www.peoplesnews.in

హైదరాబాద్
# పీపుల్స్ న్యూస్
ప్రజల గొంతుక...
దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 37 ఆదివారం, జూన్ 21, 2026, పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad

రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నది విన్నది పంచుకున్నది ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్
9866330400

## పబ్లిక్ హెల్త్ క్యాపిటల్‌గా
# తెలంగాణ

- ఆరోగ్యమే అభివృద్ధికి అసలైన సూచిక
- పేదలకు అండగా నిలవడమే నిజమైన వైద్యం
- వైద్యం సామాన్యుడికి అందుబాటులో ఉండాలి
- వ్యాధి చికిత్స కంటే నివారణెళి మిన్న
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్,జూన్ 20 :** ప్రజల ఆరోగ్యమే అత్యున్నతమైన అభివృద్ధికి అసలైన నిదర్శనమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇండియా హెల్త్ సమిట్ లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వైద్య రంగ నిపుణులు, ప్రముఖ వైద్యులు, హాస్పిటల్స్, ఫార్మా, బయోటెక్నాలజీ, డిజిటల్ హెల్త్ రంగానికి చెందిన ప్రతినిధులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఆరోగ్యం అనేది కేవలం ఒక ప్రభుత్వానికి సంబంధించిన అంశం కాదన్నారు. ప్రతి ఒక్కరి ప్రాథమిక అవసరమని పేర్కొన్నారు. ఒక కుటుంబంలో ఎవరైనా అనారోగ్యానికి గురైతే ఆ కుటుంబం మొత్తం ఆర్థికంగా కుప్పకూలిపోతుందని, వారి జీవితాంతం దాచుకున్న పొదుపు మొత్తం ఒక్క క్షణంలో కరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పేదవాడు ఎటువంటి భయం లేకుండా ఆసుపత్రిలో అడుగుపెట్టేలా తక్కువ ధరకు వైద్యం అందుబాటులో ఉండాలన్నారు. దేశం ఆర్థికంగా ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్న తరుణంలోనే తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఎయిమ్స్ వంటి ఉన్నతమైన వైద్య విద్యాసంస్థలను స్థాపించి మిగతా2లో...



# మెట్రో కోసం రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలుద్దాం

- 22,23 తేదీల్లో ఢిల్లీలోనే ఉంటానన్న సిఎం
- వెంటనే కలసి సమస్య పరిష్కారానికి కృషి చేద్దాం
- కిషన్ రెడ్డికి బహిరంగ లేఖ రాసిన సిఎం రేవంత్

**హైదరాబాద్,జూన్ 20 :** హైదరాబాద్ మెట్రో రైలు రెండోదశ పొడిగింపు అంశంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరో బహిరంగ లేఖ రాశారు. మెట్రో పెండింగ్ అంశాల పరిష్కారానికి జోక్యం చేసుకోవాలని కిషన్ రెడ్డిని సీఎం రేవంత్ కోరారు. ఈ సందర్భంగా మిగతా2లో...

## ఒడిషాలో 47వేల కోట్లతో
# అభివృద్ధి పనులు

- రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా మోడీ ప్రకటన
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలసి ప్రారంభించిన ప్రధాని
- ముర్ము స్వగ్రామం పహాడ్‌పూర్‌ను సందర్శించిన మోడీ
- అభివృద్ధి చేసి సోలార్ విలేజ్‌గా మారుస్తామని ప్రకటన



**భువనేశ్వర్,జూన్ 20 :** ఒడిషా రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఒడిశాలోని మయూర్‌భంజ్‌లో జరిగిన 'వికాస్ రా ధారా, ఒడిశా సారా' బహిరంగ సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒడిశా సర్వతోముఖాభివృద్ధి కోసం దాదాపు రూ.47,000 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు రాష్ట్రపతి మిగతా2లో...

## శాంతి ఒప్పందం వేళ
# మళ్లీ పీటముడి

- హర్మూజ్ మూసేస్తున్నట్లు ఇరాన్ ప్రకటన




# బాల్య వివాహాలు లేని తెలంగాణ కోసం కృషి

- బాలలహక్కుల పరిరక్షణ కమిటీ కృషి చేయాలి
- సమీక్షా సమావేశంలో మంత్రి సీతక్క సూచన



**హైదరాబాద్,జూన్ 20 :** తెలంగాణను బాల్య వివాహ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని మంత్రి సీతక్క సూచించారు. అలాగే పిల్లల రక్షణ చర్యలను మరింత బలోపేతం చేయడం, పిల్లలపై జరుగుతున్న దుర్వినియోగం మరియు పోక్సో కేసులను తగ్గించేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్య మరియు సక్షమ్ అంగన్‌వాడీ కార్యక్రమాలపై రాష్ట్ర స్థాయి మిగతా2లో...

## మూసీ నిర్వాసితులకు ముందు
# న్యాయం చేయండి

- ప్రభుత్వానికి బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు డిమాండ్



**హైదరాబాద్,జూన్ 20 :** మూసీ పునరుద్ధరణకు భాజపా వ్యతిరేకం కాదని ఆ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. బాధితులకు న్యాయం చేశాక, ప్రాజెక్టు పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణశాఖ అనుమతి ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రముఖ పారిశ్రామికవేత్త ఫణికుమార్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన సందర్భంగా మిగతా2లో...


## ఆత్మవిశ్వాసంతో పరీక్షకు
# హాజరు కండి

- ఎలాంటి ఒత్తిడికి గురికావదందన్న సిఎం రేవంత్
- నీట్ పరీక్ష సందర్భంగా విద్యార్థులకు శుభాకాంక్షలు




# పీఎం కిసాన్ డబ్బులు విడుదల

- రూ. 2,000 చొప్పన 18,880 కోట్లు జమ
- హుగ్లీ జిల్లాలో విడుదల చేసిన ప్రధాని నరేంద్ర మోదీ



**కోల్‌కతా,జూన్ 20 :** పీఎం కిసాన్ డబ్బులు విడుదలయ్యాయి. ప్రధాని 23వ విడత నిధులను విడుదల చేశారు. ఈ విడత ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న 9.44 కోట్ల మందికి పైగా అర్హులైన రైతు కుటుంబాల ఖాతాల్లోకి రూ. 2,000 చొప్పున మొత్తం రూ. 18,880 కోట్లు నేరుగా జమయ్యాయి. రైతులకు పెట్టుబడి మిగతా2లో...

## రైతు బంధు ప్రభుత్వం పోయి రాబందు
# ప్రభుత్వం వచ్చింది : కేటీఆర్



**బోథ్,జూన్ 20 :** రాష్ట్ర ప్రభుత్వం పంటలు రైతుల నుంచి కోటాకు మించి కొనుగోలు చేయబోమన్న నిర్ణయంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పండిన ప్రతి గింజ కూడా కొన్నదని.. పంటలు కొనబోమని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న మిగతా2లో...

# ఉచిత విద్య, వైద్యమే టీఆర్ఎస్ లక్ష్యం: కవిత

- కాంగ్రెస్ పార్టీ హామీలు నెరవేర్చే వరకు విశ్రమించేది లేదు
- టీఆర్ఎస్ వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత



**పరకాల,జూన్ 20 :** ఉచిత విద్య, వైద్యం ప్రజలందరికీ అందజేయడమే లక్ష్యంగా టీఆర్ఎస్ పార్టీ ముందుకు సాగుతుందని ఆ పార్టీ నాయకురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. శనివారం 'బాయి బాట' కార్యక్రమంలో భాగంగా భూపాలపల్లి వెళ్తూ మార్గమధ్యలో పరకాలలో నిర్వహించిన జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అంబేద్కర్ సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు జరిగిన రోడ్డు షోలో పాల్గొన్నారు. బస్టాండ్ సెంటర్లో జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి టిఆర్ఎస్ మిగతా2లో...

# ఖతార్ పాలకుల ఔదార్యం

- ట్రంప్‌కు 747 జంబో జెట్ గిఫ్ట్
- ఆవిష్కరించిన అమెరికా అధ్యక్షుడు




**వాషింగ్టన్,జూన్ 20 :** ఖతార్ పాలకులు తనకు గిఫ్ట్‌గా ఇచ్చిన 747 జంబో జెట్ విమానాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆవిష్కరించారు. ఇకనుంచి ట్రంప్ కొంతకాలం పాటు ఇందులోనే ప్రయాణాలు చేయనున్నారు. ఈ విమానాన్ని ఆయన 'ఎగిరే వైట్‌హౌస్'గా అభివర్ణించారు. జాయింట్ బేస్ ఆండ్రూస్‌లో శుక్రవారం ఈ విమానం ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఇది ప్రపంచంలోనే అత్యంత విలాసవంతమైన విమానం అని ట్రంప్ పేర్కొన్నారు. ఇందులోని ఇంటీరియర్ డిజైన్, ఇంజిన్ల నాణ్యత అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారు. ఇది ఎయిర్‌ఫోర్స్ వన్ కంటే మిగతా2లో...

# ఒడిషాలో 47వేల కోట్లతో అభివృద్ధి పనులు

(మొదటి పేజీ తరువాయి)

ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం రోజే ఈ కార్యక్రమం జరగడం విశేషం. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం సందర్భంగా ఆమె స్వగ్రామమైన పహాడ్‌పూర్‌ను ప్రధాని మోదీ సందర్శించారు. ఈ గ్రామాన్ని వేగంగా అభివృద్ధి చేసి 'సోలార్ విలేజ్'గా మారుస్తామని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలోని ప్రతి ఇంటికీ సౌరశక్తి అందుతుంది. ఒడిశాలోని ప్రసిద్ధ కోణార్క్ సూర్య దేవాలయానికి ఉన్న గుర్తింపు తరహాలోనే, పహాడ్‌పూర్ గ్రామం కూడా ప్రపంచపటంలో పునరుత్పాదక ఇంధన కేంద్రంగా సరికొత్త గుర్తింపును పొందుతుందని ప్రధాని పేర్కొన్నారు. ఒడిశాలోని సహజ వనరులను ఆర్థిక అవకాశాలుగా మార్చడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ప్రధాని తెలిపారు. రాష్ట్రంలో భారీగా పారిశ్రామిక వృద్ధి జరుగుతోందని, అంతర్జాతీయ, దేశీయ పెట్టుబడిదారులను ఆకర్షించడంలో 'ఉత్కర్ష్ ఒడిశా' ప్రచారం కీలక పాత్ర పోషిస్తోందని ఆయన కొనియాడారు. కొత్త పరిశ్రమల స్థాపన ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గిరిజన యువతకు మెరుగైన విద్య, ఉపాధి అవకాశాలను అందించడం ద్వారా వారిని సాధికారత వైపు నడిపించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మోదీ పునరుద్ఘాటించారు. గిరిజన పిల్లలకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించేందుకు దేశవ్యాప్తంగా సుమారు 500 ఏకలవ్య మోడల్ స్కూళ్లను ప్రారంభించామని తెలిపారు. అంతకుముందు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ కలిసి పహాడ్‌పూర్ గ్రామంలోని 'సంతాలీ జాహిరా', 'హో జాహిరా' అనే పవిత్ర వనాలలో సంప్రదాయ పూజలు, ఆచారాలు నిర్వహించి దేశ శ్రేయస్సు కోసం ప్రార్థించారు. ప్రస్తుతం ఒడిశాలో పండుగ వాతావరణం నెలకొందని, గత వారమే 'గాన్ పర్దా' పండుగను ఘనంగా జరుపుకున్నారని, అలాగే జగన్నాథ రథయాత్ర, బరిపద రథయాత్ర ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని ఈ సందర్భంగా ప్రధాని గుర్తుచేశారు. ఈ ఉత్సవాల మధ్య 'ప్రజాస్వామ్యం, అభివృద్ధి' అనే పండుగ కూడా ఇక్కడ నడుస్తోందని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

# ఆత్మవిశ్వాసంతో పరీక్షకు హాజరు కండి



**హైదరాబాద్,జూన్ 20** : నీట్ పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులందరికీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం పునర్నిర్వహిస్తున్న ఈ పరీక్షలో విద్యార్థులు ఎలాంటి ఆందోళనలకు, ఒత్తిళ్లకు గురికాకుండా పూర్తి ఆత్మవిశ్వాసంతో, ప్రశాంతంగా పరీక్ష రాయాలని ఆకాంక్షించారు. ఈ మేరకు సీఎం ఓ ప్రకటన విడుదల చేశారు. వైద్య విద్యలో ప్రవేశానికి ముఖ్యమైన ఈ పరీక్ష కోసం విద్యార్థులు ఎంతోకాలంగా కృషి చేశారని పేర్కొన్నారు. తమ శ్రమ, పట్టుదలపై నమ్మకం ఉంచి అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని సూచించారు. దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నీట్ పరీక్షకు సంబంధించి తెలంగాణలో సుమారు 208 పరీక్షా కేంద్రాల్లో దాదాపు 2.95 లక్షల మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. విద్యార్థులు చివరి నిమిషం వరకు వేచి ఉండకుండా ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, పరీక్షా నిబంధనలను పాటిస్తూ ప్రశాంతమైన మనసుతో పరీక్ష రాయాలని సూచించారు. విద్యార్థులందరూ తమ లక్ష్యాలను సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు.

# పబ్లిక్ హెల్త్ క్యాపిటల్‌గా తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

దేశానికి ఒక దిశను చూపించారన్నారు. పేద దేశంలో వైద్యం అనేది విలాసంగా మారకూడదనే ఉద్దేశంతో ఆనాడు పునాది వేశారన్నారు. అదేవిధంగా 1975లో ఇందిరా గాంధీ గారు తీసుకొచ్చిన సమగ్ర శిశు అభివృద్ధి సేవల పథకాన్ని గుర్తు చేశారు. రాజీవ్ గాంధీ హయాంలో తీసుకొచ్చిన యూనివర్సల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్ ద్వారా దేశవ్యాప్తంగా వ్యాక్సినేషన్ ప్రక్రియను ఒక ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లారన్నారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ గారి నాయకత్వంలో వచ్చిన జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్, ఆశా వర్కర్ల వ్యవస్థ గ్రామీణ ఆరోగ్య ముఖచిత్రాన్ని మార్చివేసిందని గుర్తుచేశారు. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారు ప్రవేశపెట్టిన 'ఆరోగ్యశ్రీ' పథకం పేదవాడి ఆరోగ్యానికి భరోసా ఇచ్చిందన్నారు. పేదరికం కారణంగా ఏ ఒక్కరూ చావుకు దగ్గర కాకూడదని కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతానికి నిదర్శనమని అన్నారు. రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఉచిత వైద్య సాయం అందిస్తూ, గుండె, కిడ్నీ వంటి ఖరీదైన జబ్బులకు సైతం పేదవాడు ధైర్యంగా కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందేలా ఈ పథకం అండగా నిలిచిందన్నారు. వైద్య రంగంలో వస్తున్న టెక్నాలజీ, టెలిమెడిసిన్, సరికొత్త పరికరాలు కేవలం కార్పొరేట్ వర్గాలకే పరిమితం కాకుండా అట్టడుగు వర్గాలకు సైతం అందాలని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. నాయకత్వం అనేది ఒక సర్టిఫికేట్ కాదు, అదొక బాధ్యత అని వ్యాఖ్యానిస్తూ, సైన్స్ అనేది సామాన్యుడికి, టెక్నాలజీ అనేది పేదవాడికి సేవ చేయాలన్నారు. ప్రస్తుత వైద్య విధానం వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స అందించే 'ఇల్‌నెస్ కేర్' గా మాత్రమే ఉండిపోకూడదన్నారు. వ్యాధి రాకుండా ముందే నివారించే 'వెల్‌నెస్ కేర్' గా మారాలని ఉప ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఐసీయూల కంటే వ్యాధి నివారణెళి అత్యంత చౌకైన మార్గమని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణ నేడు దేశంలోనే పబ్లిక్ హెల్త్ క్యాపిటల్‌గా అవతరించిందని భట్టి విక్రమార్క ప్రకటించారు. రాష్ట్రంలోని జిల్లా ఆసుపత్రుల బలోపేతం, వైద్య విద్యాసంస్థల విస్తరణ, నర్సింగ్ మరియు పారామెడికల్ రంగాలను ప్రోత్సహించడం ద్వారా వైద్య రంగాన్ని ముందుకు తీసుకువెళుతున్నామని అన్నారు. వైద్య రంగంలో పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యం అనేది కేవలం వ్యాపార లాభాల కోసం కాకుండా, ప్రభుత్వ ఆశయాలకు ప్రైవేట్ రంగానికి ఉన్న నైపుణ్యాలను జోడించి ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించడానికే ఉపయోగపడాలని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. వచ్చే దశాబ్ద కాలంలో వైద్య రంగానికి అవసరమైన మానవ వనరులను, నైపుణ్యాలను అందించడానికి తెలంగాణ పూర్తిగా సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం ప్రకటించారు. హైదరాబాద్‌లో ఉన్న బలమైన ఫార్మాస్యూటికల్ బేస్, మెడికల్ డివైజెస్ పార్క్, ఐటీ టాలెంట్ మరియు ప్రభుత్వ అండదండల వల్ల తెలంగాణ ప్రపంచంలోనే మెడికల్ ఎక్సలెన్స్ ఇకోసిస్టమ్‌కు కేంద్రంగా మారిందన్నారు. ఇక్కడి నుంచే భారతదేశానికి, ప్రపంచానికి ఉపయోగపడే సరికొత్త హెల్త్ కేర్ ప్రోటోకాల్స్, డయాగ్నోస్టిక్స్ మరియు డిజిటల్ ప్లాట్‌ఫార్మ్‌లు రూపుదిద్దుకోవాలని ఆకాంక్షించారు.

# రైతు బంధు ప్రభుత్వం పోయి రాబందు ప్రభుత్వం వచ్చింది : కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయం వెనక్కి తీసుకునే దాకా పోరాటం చేస్తామనన్నారు. 15 రోజుల కింద ప్రతి గింజ కొంటానన్న రేవంత్ రెడ్డి ఇప్పుడు మాట మార్చిండు. ఇక రైతన్నల పంటలు కొనబోమని క్యాబినెట్ సమావేశం పెట్టి మరి నిర్ణయం తీసుకున్నారు. ఇకపై కేంద్రం నిర్ణయించిన నెలకే కొంటాము కాంగ్రెస్ ప్రభుత్వం పంటలు అదనంగా కొనబోదని చెప్పిందన్నారు. కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయాన్ని ప్రతీ రైతన్న దగ్గరికి ప్రతి గ్రామానికి తీసుకుపోవాలని పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. మంత్రులంతా ప్రత్యేకంగా క్యాబినెట్ సమావేశం పెట్టుకొని రైతన్నలకు శాపం లాంటి ఒక నిర్ణయం తీసుకున్నారు. ఇకపైన తెలంగాణలో పంటలు కొనబోమని రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం మొత్తం రైతాంగానికి శాపంగా మారబోతోందని కేటీఆర్ స్పష్టం చేశారు. ఇకపై ప్రభుత్వం ఇక్కడి నుంచి గింజలు కొనదట, వడ్లు కొనదట. రైతులు పండించే జొన్నలు, శనగలు కూడా కొనదట. మోదీ ప్రభుత్వం ఎంత కొనమంటే అంతే కొంటారట. అంటే ఎకరానికి 40 క్వింటాళ్ల వడ్లు పండించినా, రేపు మోదీ ప్రభుత్వం కోటా 10 క్వింటాళ్లే అని చెబితే, అంతే కొనుగోలు చేస్తారట. **కాంగ్రెస్ నాయకులను నిలదీయాలి..** మిగిలిన 30 క్వింటాళ్లు బయట అమ్ముకోవాల్సి వస్తుంది. నిన్న ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఇదే. నేను రైతులకు ఒకటే పిలుపు ఇస్తున్నాను.. అధికారులపై కాంగ్రెస్ నాయకుల కాళ్లు పట్టుకోవాల్సిన అవసరం లేదు. కాంగ్రెస్ నాయకులను నిలదీయాలి. మీరు ప్రకటించిన బోనస్ ఎక్కడ పోయిందని అడగాలి. మీరు హామీ ఇచ్చిన కొనుగోలు కేంద్రాలు ఎక్కడికి పోయాయని ప్రశ్నించాలి. మీ ప్రభుత్వ అసమర్థత వల్ల రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఎందుకు వచ్చిందని నిలదీయాలని కేటీఆర్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. రైతుల పంటలు కొనబోమన్న రేవంత్ రెడ్డిని మేము వదిలిపెట్టమని హెచ్చరించారు. 15 రోజుల క్రితం నువ్వే కదా 'చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం' అని చెప్పింది. ఈరోజు ఏమైంది..? 'మోదీ మెడలు వంచుతా, చివరి గింజ వరకు కొనుగోలు చేస్తా' అని గొప్పలు చెప్పావు. ఇప్పుడు ఎందుకు వెనక్కి తగ్గుతున్నావు..? అని కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు ఎనిమిది మంది ఎంపీలు ఉన్నారు. ఆదిలాబాద్‌లో కూడా బీజేపీ ఎంపీ ఉన్నారు.

రాష్ట్ర ప్రభుత్వానికి ఎంత బాధ్యత ఉందో, ఈ 16 మంది ఎంపీలకు కూడా అంతే బాధ్యత ఉంది. కేసీఆర్ ప్రభుత్వం ఉన్న సమయంలో కూడా మోదీ ప్రభుత్వం "మేము వడ్లు కొనము" అని చెప్పినప్పుడు, మొత్తం మంత్రివర్గంతో కలిసి మేమంతా ఢిల్లీకి వెళ్లామన్నారు. కేసీఆర్‌తోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు అందరం ధర్నా చేసి, కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి, వడ్లు కొనుగోలు చేసేలా చేసిన నాయకుడు కేసీఆర్ అన్నారు. ఈరోజు ఉన్న 8 మంది కాంగ్రెస్ ఎంపీలు, 8 మంది బీజేపీ ఎంపీలు కూడా తమ బాధ్యతను గుర్తించాలి.



# పరేడ్ గ్రౌండ్ యోగాలో పాల్గొన్న ప్రముఖులు

**హైదరాబాద్,జూన్20**:అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో పెద్ద ఎత్తున యోగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారీగా ప్రజలు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు హాజరయ్యారు. తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు, ఎంపీలు ఈటల రాజేందర్, లక్ష్మణ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, సినీ నటులు నవీన్ పోలిశెట్టి, డింపుల్ హయాతి తదితరులు పాల్గొని యోగా సాధన చేశారు. ఏటా మాదిరిగానే యోగా కార్యక్రమం నిర్వహించినట్టు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. నిత్యం యోగా చేయడం వల్ల రుగ్మతల బారిన పడకుండా ఉండొచ్చని తెలిపారు.

# పీఎం కిసాన్ డబ్బులు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

సాయం అందించేందుకు కేంద్రం అమలు చేస్తున్న పీఎం- కిసాన్నిధులు విడుదలయ్యాయి. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లాలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిధులను విడుదల చేశారు. 23వ విడత కింద ఒక్కో రైతు ఖాతాలో రూ.2 వేలు చొప్పున జమ అయ్యాయి. దీంతో దేశవ్యాప్తంగా 9.44 కోట్ల మంది రైతులకు లబ్ది చేకూరింది. కేంద్రప్రభుత్వం 2019లో పీఎం-కిసాన్ పథకాన్ని ప్రారంభించింది. ఏటా మూడు దఫాలుగా రూ.2 వేలు చొప్పున మొత్తంగా రూ.6వేలను రైతుల ఖాతాల్లో వేస్తున్నారు. పీఎం కిసాన్ నిధులు పొందే వారి జాబితాలో మీ పేరుందో లేదో తెలుసుకోవచ్చు. ఇందుకోసం పీఎం కిసాన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లిఅందులో 'ఫార్మర్ కార్నర్' సెక్షన్‌లోకి వెళ్లాలి. అందులో లబ్ధిదారుల లిస్ట్‌పై క్లిక్ చేస్తే రాష్ట్రం, జిల్లా, బ్లాక్, గ్రామం ఎంచుకుంటే లబ్ధిదారుల జాబితా కనిపిస్తుంది. అందులో

# శాంతి ఒప్పందం వేళ మళ్లీ పీటముడి

**టెహ్రాన్,జూన్ 20**:అమెరికా- ఇరాన్ మధ్య శాంతి ఒప్పందంతో పశ్చిమాసియాలో పరిస్థితులు కుదుటపడుతున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. హర్మూజ్ జలసంధిని మళ్లీ మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ నిరంతరం భీకర దాడులు చేస్తుండటాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. అమెరికా, ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిన కారణంగా తాజాగా హర్మూజ్ మూసివేత నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఇది తమ ప్రతిస్పందనలో మొదటి అడుగు అని, దురాక్రమణ ఇలాగే కొనసాగితే మరిన్ని చర్యలు ఉంటాయని హెచ్చరించింది. ఇరాన్ సంయుక్త సైనిక విభాగ కేంద్రమైన ఖతమ్-అల్ అన్బియా ప్రకటిం చినట్లు అక్కడి అధికారిక మీడియా పేర్కొంది. నౌకలు జలసంధి వైపు రావద్దని.. అలా వస్తే వాటి భద్రతకు ముప్పు వాటిల్లుతుందని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఎఖీఉఅ) స్పష్టం చేసింది. ఏదైనా ఒప్పందం అమలు దశలోకి వచ్చినప్పుడు మాత్రమే అన్ని విషయాలు తెలుస్తాయని పేర్కొంది. ఇదే సమయంలో, మధ్యంతర ఒప్పందంపై అమెరికాతో చర్చలు జరిపేందుకు స్విట్జర్లాండ్‌కు తమ బృందం వెళ్తున్నట్లు ఇరాన్ వెల్లడించింది. మరోవైపు, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా త్వరలోనే స్విస్‌కు వెళ్లనున్నట్లు సమాచారం. సాంకేతిక అంశాలపై రెండు దేశాలు చర్చలు జరిపేందుకు శుక్రవారమే అక్కడకు వెళ్లాల్సి ఉన్నప్పటికీ.. అది వాయిదా పడిన విషయం తెలిసిందే.

# ఖతార్ పాలకుల ఔదార్యం

(మొదటి పేజీ తరువాయి)

వేగంగా.. ఎక్కువ దూరం ప్రయాణిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఖతార్ పాలకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జులై 4న జరగనున్న అమెరికా 250వ స్వాతంత్య వేడుకల్లో నిర్వహించే విమానాల ప్రదర్శనల్లో ఈ విమానం కూడా పాల్గొనే అవకాశం ఉందని ట్రంప్ వెల్లడించారు. కాగా.. విమానం లోపల లెదర్ సీట్లు, గోల్డ్ షేడ్స్‌తో కూడిన లేత గోధుమ రంగు గోడలు ఉన్నట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఇప్పటివరకు 747- 200బి ఎయిర్‌ఫోర్స్ వన్ హోదాలో అమెరికా అధ్యక్షుడికి అధికారిక విమానంగా ఇది వ్యవహరించింది. జార్జ్ హెచ్‌డబ్ల్యూ బుష్ నుంచి ట్రంప్ వరకు ప్రతి అధ్యక్షుడికి ఈ పాత విమానమే సేవలందించింది. అధునాతన విమానం కాకపోయినా సౌకర్యవంతంగా ఉండేదని అమెరికా ప్రొటోకాల్ చీఫ్ మోనికా క్రౌలీ తెలిపారు. ప్రస్తుతం దీని ప్రస్థానం ముగిసింది. యూఎస్ వైమానిక దళం ఆర్డర్ చేసిన రెండు కొత్త బోయింగ్-747 విమానాలు అందేవరకు.. ఖతార్ నుంచి గిఫ్ట్‌గా వచ్చిన ఈ విమానాన్నే ట్రంప్ ప్రయాణాలకు వినియోగించనున్నారు.

# మెట్రో కోసం రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలుద్దాం

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ మెట్రో విస్తరణకు కేంద్రం సహకారం కావాలని అన్నారు. మెట్రో ఫేజ్-2, ఎల్ అండి టి ఫైనాన్సింగ్‌పై చర్చకు సమావేశం ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. జూన్ 22, 23 తేదీల్లో తాను ఢిల్లీలో ఉంటానని, రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో భేటీకి సమయం కేటాయించాలని సీఎం రేవంత్ కోరారు. ఇద్దరం కలిసి రైల్వే మంత్రిని కలుద్దామని ప్రతిపాదించారు. సంబంధిత ఒప్పందాల పత్రాలతో సమావేశానికి హాజరవుతానని ముఖ్యమంత్రి చెప్పుకొచ్చారు. తెలంగాణకు హైదరాబాద్ మెట్రో కీలక మౌలిక వసతి ప్రాజెక్టని ఈ సందర్భంగా లేఖలో సీఎం పేర్కొన్నారు. దీనికి సంబంధించిన పెండింగ్ అంశాలకు త్వరితగతిన పరిష్కారం అవసరమని చెప్పుకొచ్చారు. కాగా, ఈనెల 16వ తేదీన కూడా హైదరాబాద్ మెట్రో రైలు అంశంపై కిషన్ రెడ్డికి రేవంత్ రెడ్డి లేఖ రాశారు. ఈ సందర్భంగా సమస్య పరిష్కారానికి ఏ మీటింగ్‌కైనా తాను సిద్ధమేనని రేవంత్ అన్నారు. రైల్వే మంత్రితో వీలైనంత త్వరగా సమావేశం ఏర్పాటు చేయించాలన్నారు. ఆ సమావేశానికి సంబంధించి కిషన్ రెడ్డి పిలుపు కోసం తాను ఎదురు చూస్తానని పేర్కొన్నారు. ఇందుకు ఆయనతో వ్యక్తిగత భేటీకీ సిద్ధమేనని సీఎం రేవంత్ చెప్పుకొచ్చారు.

# మూసీ నిర్వాసితులకు ముందు న్యాయం చేయండి

(మొదటి పేజీ తరువాయి)

ఆయన మాట్లాడారు. సింగరేణి స్కామ్ బయటపడుతుందనే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని టార్గెట్ చేస్తున్నారని ఆరోపించారు. వర్గపోరు కారణంగానే ప్రాంతీయ పార్టీలు చీలిపోతున్నాయని వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా కొన్ని స్కూళ్లలోనే పుస్తకాలు, యూనిఫాంలు ఇచ్చారు. కనీస మౌలిక సదుపాయాలు లేని బడులు లెక్కలేనన్ని ఉన్నాయి.

ప్రభుత్వ పాఠశాలల దుస్థితి ఎలా ఉందో రేవంత్‌రెడ్డి చూడాలి. ప్రైవేటు పాఠశాలలు ఎందుకు పెరుగుతున్నాయి? కేంద్రీయ విద్యాలయాలకు ఉన్న ఆదర ణ ప్రభుత్వ బడులకు ఎందుకు లేదు? బ్జడెట్‌లో విద్యారంగానికి కేటాయింపులు పెంచాలి. ఉస్మాని యా వర్సిటీకి రూ.వెయ్యి కోట్లు కేటాయిస్తామన్నారు. కానీ.. వర్సిటీల్లో కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదు. టీచర్లు, ప్రొఫెసర్ల హక్కుల గురించి మాట్లాడితే సస్పెండ్ చేస్తున్నారని ఆరోపించారు.

# బాల్య వివాహాలు లేని తెలంగాణ కోసం కృషి

(మొదటి పేజీ తరువాయి)

సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ గౌరవ అధ్యక్షురాలు సీతా దయాకర్ రెడ్డి అధ్యక్షత వహించారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా మరియు మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ ప్రభుత్వం మహిళలు మరియు పిల్లల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి మంత్రి వివరించారు. బాల్య వివాహాలు ఇంకా కొన్ని ప్రాంతాల్లో జరుగుతున్నందున వాటిని నివారించాలన్నారు. శాఖలోని ప్రతి అధికారి మరియు సిబ్బంది వాటి నివారణకు కృషి చేసి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనితా రామచంద్రన్ సమావేశంలో పాల్గొని, మహిళలు మరియు పిల్లల సంక్షేమానికి సంబంధించిన విధానాలను సమర్థవంతంగా అమలు చేయడానికి అధికారులు తమ అత్యుత్తమ సామర్థ్యంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకురాలు ఎన్. మోతి జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ అధికారులు , జిల్లా బాలల పరిరక్షణ అధికారులు, అలాగే తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ గౌరవ సభ్యులు మర్రిపల్లి చందన, బండి అపర్ణ గారు, కంచర్ల వందన గౌడ్ గారు, ప్రేమలత అగర్వాల్, గోగుల సరిత బుర్కా వచన్ కుమార్ పాల్గొన్నారు.

# ఉచిత విద్య, వైద్యమే టీఆర్‌ఎస్ లక్ష్యం: కవిత

(మొదటి పేజీ తరువాయి)

జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జయశంకర్ ఆశయ సాధన కోసం కృషి చేస్తామని కార్యకర్తలతో కలిసి నినాదాలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ అవినీతి పాలనను ఎండగడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు. టిఆర్ఎస్ ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల సమస్యలపై పోరాడుతుందని, మహిళలకు నెలకు రూ.2500 ఆర్థిక సహాయం, ఆసరా పెన్షన్ల పెంపు వంటి హామీలను అమలు చేసే వరకు విశ్రమించేది లేదని స్పష్టం చేశారు. కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా, ప్రజలందరికీ నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందించాలనేదే తమ పార్టీ అత్యున్నత సంకల్పమని ఆమె పేర్కొన్నారు. ఒక ఆడబిడ్డగా తనను రాష్ట్ర ప్రజలందరూ ఆశీర్వదించి, ఆదరించాలని కవిత కోరారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించని వాహనాలు సీజ్

**ఎస్సై తాజుద్దీన్**



**గోవిందరావుపేట.(పసర) ములుగు జిల్లా ప్రతినిధి జూన్ 20( పీపుల్స్ న్యూస్)**
నిబంధనలు పాటించని వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని.ట్రాక్టర్. కార్. ఆటో . ద్విచక్ర వాహనాల యజమానులు, డ్రైవర్లు తప్పనిసరిగా రవాణా నిబంధనలు పాటించాలని పసర పోలీస్ స్టేషన్ ఎస్సై తాజుద్దీన్ సూచించారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.ఇప్పటికే ట్రాక్టర్. కార్. ఆటో. ద్విచక్ర వాహనాల యజమానులకు 20 సార్లు అవకాశం కల్పించడంతో పాటు కౌన్సిలింగ్ కూడా నిర్వహించినప్పటికీ కొందరిలో మార్పు కనిపించడం లేదని ఆయన తెలిపారు. వాహనాల డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, పొల్యూషన్ సర్టిఫికేట్, ఫిట్‌నెస్ సర్టిఫికేట్ తప్పనిసరిగా ఉండాలని సూచించారు.అలాగే వాహనం వెనుక భాగంలో రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. రేపటి నుంచి సరైన పత్రాలు లేని ట్రాక్టర్లు, వెనుక రేడియం స్టిక్కర్లు లేని వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి వాటిని సీజ్ చేస్తామని ఎస్సై తాజుద్దీన్ హెచ్చరించారు.ప్రజల భద్రత దృష్ట్యా ప్రతి ఒక్కరూ రవాణా నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

# బాలానగర్ డివిజన్ పరిధిలోని దాసరి బస్తీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనుల పరిశీలన

**-- నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలని అధికారులు మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి సూచన**



**బాలానగర్ జూన్ 21 ( పీపుల్స్ న్యూస్)**
సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మూసా పేట సర్కిల్ బాలానగర్ డివిజన్ పరిధిలోని దాసరి బస్తీలో నూతనంగా చేపడుతున్న నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి శనివారం స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీ నాయకులతో కలిసి పరిశీలించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని చేపట్టిన ఈ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా కొనసాగాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనుల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించిన ఆవుల రవీందర్ రెడ్డి, పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి చోటు చేసుకోకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని పేర్కొన్నారు. ప్రజా ధనంతో నిర్మిస్తున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, నిర్మాణంలో చిన్నపాటి లోపాలు కూడా లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దాసరి బస్తీ ప్రజలకు సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఈ కమ్యూనిటీ హాల్ ఎంతో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. స్థానికుల అవసరాలను తీర్చే విధంగా ఆధునిక సౌకర్యాలతో హాల్‌ను నిర్మించి, త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కోరారు. అభివృద్ధి పనుల అమలులో ప్రజల భాగస్వామ్యం కూడా ముఖ్యమని పేర్కొన్న ఆయన, నిర్మాణ పనుల నాణ్యతపై స్థానికులు కూడా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ప్రజలకు ఉపయోగపడే ప్రతి అభివృద్ధి కార్యక్రమం పారదర్శకంగా, నాణ్యతతో పూర్తి కావడమే తమ లక్ష్యమని అన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో దాసరి బస్తీ అధ్యక్షుడు ఆదిమూల నాగేష్, ఆదేళ్ల జగదీష్, ఆకుల నర్సింగ్, ఘనసాల మహేష్, కంఠం రవి, ఘనసాల ప్రవీణ్‌తో పాటు స్థానిక నాయకులు కందుల రమేష్, రంగంపేట్ శ్రీనివాస్ ముదిరాజ్, నర్రా దేవేందర్ రెడ్డి, జల్దేవర్ ప్రేమ్ కుమార్, ముత్యాల మురళీధర్ ముదిరాజ్, సిద్దిరాములు పాల్గొన్నారు.

# చిన్నారుల భవిష్యత్తుకు బలమైన బాటలు..

**-- అంగన్‌వాడి కేంద్రంలో చిన్నారులకు కిట్లు, పలకల పంపిణీ....**



**బాలానగర్ జూన్ 21 ( పీపుల్స్ న్యూస్**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చిన్నారుల సమగ్ర అభివృద్ధి, విద్యా ప్రోత్సాహం లక్ష్యంగా అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బాలానగర్ డివిజన్ డి.సంజీవయ్య కాలనీలో ఉన్న అంగన్‌వాడి కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కూకట్‌పల్లి ఏఎంసీ చైర్మన్ కొండకింది పుష్పారెడ్డి చిన్నారులకు విద్యా సామగ్రి కిట్లు, పలకలు పంపిణీ చేశారు. చిన్నారులు ప్రాథమిక దశ నుంచే విద్యపై ఆసక్తి పెంపొందించుకోవాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారం, విద్యాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. అంగన్‌వాడి కేంద్రాలు చిన్నారుల భవిష్యత్తుకు పునాది వంటివని, వారి మేధో వికాసానికి అవసరమైన అన్ని సౌకర్యాలను ప్రభుత్వం అందిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వరూప, అంగన్‌వాడి టీచర్లు, స్థానిక మహిళా నాయకులు, తల్లిదండ్రులు పాల్గొని చిన్నారులను ప్రోత్సహించారు. చిన్నారులకు కిట్లు, పలకలు అందజేయడంతో వారు ఆనందం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి చిన్నారికి చేరేలా అధికారులు, సిబ్బంది కృషి చేయాలని పాల్గొన్నవారు కోరారు. "చిన్నారుల విద్యా వికాసమే రాష్ట్ర అభివృద్ధికి పునాది" అనే సందేశంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# నాలా పూడికతీత పనుల్లో అధికారుల నిర్లక్ష్యం.. రానున్న వర్షాకాలంలో మళ్లీ ముంపు ముప్పు!

**-- సీఎంసీ కమిషనర్ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి : సీపీఐ మండల కార్యదర్శి జి. కృష్ణ**



**బాలానగర్ జూన్ 21 ( పీపుల్స్ న్యూస్)** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మూసా పేట సర్కిల్ బాలానగర్ డివిజన్ పరిధిలోని బాలానగర్, కూకట్‌పల్లి మండలాల పరిధిలోని శ్రీశ్రీ నగర్, రాజీవ్ గాంధీ నగర్, ప్రశాంతి నగర్ తదితర కాలనీలకు ఆనుకుని ఉన్న నాలా పూడికతీత పనులను సీఎంసీ అధికారులు ఇటీవల చేపట్టినప్పటికీ, అవి పూర్తిస్థాయిలో సక్రమంగా నిర్వహించ లేదని సీపీఐ కూకట్‌పల్లి మండల కార్యదర్శి జి. కృష్ణ ఆరోపించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది కురిసిన భారీ వర్షాల సమయంలో ఈ నాలా పొంగిపొర్లి పరిసర కాలనీల్లోని అనేక ఇళ్లలోకి వరద నీరు చేరిందని గుర్తుచేశారు. దీంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఆస్తి నష్టాన్ని చవిచూడాల్సి వచ్చిందన్నారు. అయితే గత అనుభవాల నుంచి అధికారులు ఎలాంటి పాఠాలు నేర్చుకోకుండా పూడికతీత పనులను నిర్లక్ష్యంగా నిర్వహిస్తున్నారని విమర్శించారు. నాలాలో నుంచి తొలగించిన మట్టి, చెత్తను పూర్తిగా తరలించకుండా మళ్లీ నాలా ఒడ్డునే లేదా నాలాలోనే వదిలేయడం వల్ల వర్షపు నీటి ప్రవాహానికి తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో రాబోయే వర్షాకాలంలో మరోసారి శ్రీశ్రీ నగర్, రాజీవ్ గాంధీ నగర్, ప్రశాంతి నగర్ కాలనీలు ముంపు ముప్పును ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని ఆయన హెచ్చరించారు. ఈ నేపథ్యంలో అధికారులు వెంటనే స్పందించి నాలా పూడికతీత పనులను నాణ్యతతో పూర్తి చేయడంతో పాటు, తొలగిం చిన మట్టిని పూర్తిగా తరలించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా నాలా స్థలాన్ని కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని, దీనిపై కూడా సంబంధిత శాఖలు ప్రత్యేక దృష్టి సారించి కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడేందుకు వర్షాకాలం ప్రారంభానికి ముందే నాలా అభివృద్ధి పనులను పూర్తి చేసి ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్ర మంలో సీపీఐ శ్రీశ్రీ నగర్ శాఖ కార్యదర్శి కె. మనచారి, గంగన్న, రాములు తదితరులు పాల్గొన్నారు.

## యువత హక్కుల కోసం పోరాటం



**ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 20:** దేశ యువత భవిష్యత్‌తో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చెలగాటం ఆడు తోందని యువత హక్కుల కోసం దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుందని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగు ణ అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమా వేశంలో ఆమె మాట్లాడుతూ ప్రశ్నాపత్రాల లీకులు, పరీక్షల రద్దులు, ఉద్యోగ నియామకాలలో జాప్యాల కారణంగా లక్షలా ది మంది విద్యార్థులు, నిరుద్యోగ యువత తీవ్ర నిరాశకు గుర వుతున్నారని అన్నారు. కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిం చే పలు పోటీపరీక్షల్లో తరచూ అవకతవకలు చోటు చేసుకో వడంతో యువతలో నమ్మకం సన్నగిల్లుతోందన్నారు. ప్రతిఏ డాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన బీజే పీ ప్రభుత్వం హామీని అమలు చేయడంలో విఫలమైంద న్నా రు. సమావేశంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మంగ, డీసీసీ ఉపాధ్య క్షుడు భీంరావు, కార్యదర్శి శంకర్, డైరెక్టర్లు జక్కన్న, కౌన్సిలర్లు కార్తీక్, రాజేందర్, రాము, నారాయణ, , కాసయ్య, హరి కృష్ణ, భానుచందర్, చరణ్, ఉపసర్పంచ్ విలాస్ పాల్గొన్నారు.

# నీట్ అవకతవకలపై కేంద్రంపై టీపీవైఎఫ్ ఆగ్రహం

**-- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి: టీపీవైఎఫ్ డిమాండ్**

**-- ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించాలి -- ఎన్‌టీఏను రద్దు చేయాలని డిమాండ్**




**బాలానగర్ జూన్ 21 ( పీపుల్స్ న్యూస్)**
దేశవ్యాప్తంగా నీట్ పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్న అవకతవకలు, ప్రశ్నపత్రాల లీకేజీలు, సీబీఎస్ఈ వెబ్‌సైట్ల హ్యాకింగ్ ఘటనలు, అలాగే పరీక్షలపై ఏర్పడిన అనిశ్చితి కారణంగా విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని తెలంగాణ ప్రోగ్రెసివ్ యూత్ ఫెడరేషన్ (టీపీవైఎఫ్) నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిణామాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. బాలానగర్‌లో నిర్వహించిన సమావేశంలో టీపీవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నగేష్ సతీష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి మట్టే ప్రసన్న కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. దేశవ్యాప్తంగా నీట్ పరీక్షల నిర్వహణలో జరిగిన లోపాలు విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చాయని, దీనివల్ల విద్యార్థులు మరియు వారి కుటుంబాలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నాయని పేర్కొన్నారు. విద్యార్థుల ఆత్మహత్యల విషాద ఘటనలు దేశాన్ని కలచివేస్తున్నాయని, ఇప్పటివరకు పలువురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత లేకపోవడం, రీ–టెస్ట్‌లపై ఏర్పడిన గందరగోళం, భవిష్యత్తుపై నెలకొన్న అనిశ్చితి విద్యార్థుల్లో తీవ్ర మానసిక ఒత్తిడిని పెంచుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. "దేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉంది. అలాంటి యువత మానసికంగా కుంగిపోతుంటే ప్రభుత్వాలు ప్రేక్షక పాత్ర పోషించడం బాధాకరం. విద్యార్థుల ప్రాణాలు కాపాడటం ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యత" అని నాయకులు అన్నారు.-- టీపీవైఎఫ్ ప్రధాన డిమాండ్లుకేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి.ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం తక్షణ ఆర్థిక సాయం అందించాలి.నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలి.ప్రతి రాష్ట్రం తన అవసరాలకు అనుగుణంగా స్వతంత్రంగా నీట్ ప్రవేశ పరీక్షలు నిర్వహించుకునే అధికారం కల్పించాలి.పరీక్షల నిర్వహణలో పారదర్శకత, బాధ్యతాయుత వ్యవస్థను తీసుకురావాలి.నీట్ పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్న అవకతవకలపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని టీపీవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో టీపీవైఎఫ్ జిల్లా అధ్యక్షులు గాదె రాజు, నాయకులు గరుగుల రాజు, ఆకాష్ పాల్గొన్నారు.

# ప్రజాసేవలో మరింత సమర్థత కోసం "ఒత్తిడిని జయించే యోగాస్త్రం.. పోలీస్ సిబ్బందికి యోగా ప్రత్యేక శిక్షణ"

**-- మానసిక ప్రశాంతత, శారీరక దృఢత్వమే లక్ష్యం.. ....**

**-- బాలానగర్ సీఐ నర్సింహా రాజు**




**బాలానగర్ జూన్ 21 ( పీపుల్స్ న్యూస్)**
ప్రజల భద్రత కోసం రాత్రింబవళ్లు విధులు నిర్వహిస్తూ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొనే పోలీస్ సిబ్బంది ఆరోగ్యం, మానసిక స్థైర్యాన్ని పెంపొందించేందుకు బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక యోగా, ధ్యాన శిక్షణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు శనివారం ఉదయం స్టేషన్ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమానికి బాలానగర్ సీఐ నర్సింహా రాజు నాయకత్వం వహించారు. పోలీస్ విధుల్లో ఎదురయ్యే మానసిక ఒత్తిడి, అలసట, ఆందోళనలను అధిగమించి మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు యోగా, ధ్యానం ఎంతగానో ఉపయోగపడతాయని సీఐ సిబ్బందికి వివరించారు. శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐలు సరిత రెడ్డి, వినోద్ కుమార్‌తో పాటు పోలీస్ సిబ్బంది ఉత్సాహంగా యోగాసనాలు, ప్రాణాయామ సాధనలు నిర్వహించారు. శరీరానికి శక్తినిచ్చే ఆసనాలు, అలసటను తగ్గించే వ్యాయామాలు, కోపాన్ని నియంత్రించే ధ్యాన పద్ధతులు, శ్వాస నియంత్రణకు సంబంధించిన ప్రాణాయామ ప్రక్రియలను శిక్షకులు ప్రదర్శించి సిబ్బందితో సాధన చేయించారు.నేడు యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలి"ఈ సందర్భంగా సీఐ నర్సింహా రాజు మాట్లాడుతూ "పోలీస్ సిబ్బందికి యోగా, ధ్యానం అత్యంత అవసరం. ప్రతి రోజు కొంత సమయం కేటాయించి యోగా సాధన చేస్తే శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుంది. శ్వాసపై నియంత్రణ సాధించడం ద్వారా ఒత్తిడిని అధిగమించి విధులను మరింత ఉత్సాహంగా, ఏకాగ్రతతో నిర్వహించవచ్చని అన్నారు. అదే పోలీస్ శాఖలో సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ఇటువంటి కార్యక్రమాలను తరచూ నిర్వహిస్తామని ఆయన తెలిపారు. యోగా, ధ్యానం ద్వారా ఒత్తిడిని సమర్థవంతంగా ఎదుర్కొని ప్రజలకు మరింత నాణ్యమైన సేవలు అందించగలమనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం పోలీస్ సిబ్బందిలో నూతన ఉత్సాహాన్ని నింపగా, ఆరోగ్యకరమైన జీవనశైలికి యోగా ఒక ఉత్తమ మార్గమని మరోసారి నిరూపితమైంది. పోలీస్ సిబ్బంది సైతం ఇటువంటి శిక్షణలు తమ పనితీరును మెరుగుపరచడంలో ఎంతో ఉపయోగపడతాయని అభిప్రాయపడ్డారు.బాలనగర్ డివిజన్ పరిధిలోని దాసరి బస్తీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనుల పరిశీలన-- నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలని అధికారులు మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి సూచనసైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మూసాపేట సర్కిల్ బాలానగర్ డివిజన్ పరిధిలోని దాసరి బస్తీలో నూతనంగా చేపడుతున్న నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి శనివారం స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీ నాయకులతో కలిసి పరిశీలించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని చేపట్టిన ఈ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా కొనసాగాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనుల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించిన ఆవుల రవీందర్ రెడ్డి, పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి చోటు చేసుకోకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని పేర్కొన్నారు. ప్రజా ధనంతో నిర్మిస్తున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, నిర్మాణంలో చిన్నపాటి లోపాలు కూడా లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దాసరి బస్తీ ప్రజలకు సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఈ కమ్యూనిటీ హాల్ ఎంతో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. స్థానికుల అవసరాలను తీర్చే విధంగా ఆధునిక సౌకర్యాలతో హాల్‌ను నిర్మించి, త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కోరారు. అభివృద్ధి పనుల అమలులో ప్రజల భాగస్వామ్యం కూడా ముఖ్యమని పేర్కొన్న ఆయన, నిర్మాణ పనుల నాణ్యతపై స్థానికులు కూడా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ప్రజలకు ఉపయోగపడే ప్రతి అభివృద్ధి కార్యక్రమం పారదర్శకంగా, నాణ్యతతో పూర్తి కావడమే తమ లక్ష్యమని అన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో దాసరి బస్తీ అధ్యక్షుడు ఆదిమూల నాగేష్, ఆదేళ్ల జగదీష్, ఆకుల నర్సింగ్, ఘనసాల మహేష్, కంఠం రవి, ఘనసాల ప్రవీణ్‌తో పాటు స్థానిక నాయకులు కందుల రమేష్, రంగంపేట్ శ్రీనివాస్ ముదిరాజ్, నర్రా దేవేందర్ రెడ్డి, జల్దేవర్ ప్రేమ్ కుమార్, ముత్యాల మురళీధర్ ముదిరాజ్, సిద్దిరాములు తదితరులు పాల్గొన్నారు.నాలా పూడికతీత పనుల్లో అధికారుల నిర్లక్ష్యం.. రానున్న వర్షాకాలంలో మళ్లీ ముంపు ముప్పు!-- సీఎంసీ కమిషనర్ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి : సీపీఐ మండల కార్యదర్శి జి. కృష్ణ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మూసా పేట సర్కిల్ బాలానగర్ డివిజన్ పరిధిలోని బాలానగర్, కూకట్‌పల్లి మండలాల పరిధిలోని శ్రీశ్రీ నగర్, రాజీవ్ గాంధీ నగర్, ప్రశాంతి నగర్ తదితర కాలనీలకు ఆనుకుని ఉన్న నాలా పూడికతీత పనులను సీఎంసీ అధికారులు ఇటీవల చేపట్టినప్పటికీ, అవి పూర్తిస్థాయిలో సక్రమంగా నిర్వహించ లేదని సీపీఐ కూకట్‌పల్లి మండల కార్యదర్శి జి. కృష్ణ ఆరోపించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది కురిసిన భారీ వర్షాల సమయంలో ఈ నాలా పొంగిపొర్లి పరిసర కాలనీల్లోని అనేక ఇళ్లలోకి వరద నీరు చేరిందని గుర్తుచేశారు. దీంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఆస్తి నష్టాన్ని చవిచూడాల్సి వచ్చిందన్నారు. అయితే గత అనుభవాల నుంచి అధికారులు ఎలాంటి పాఠాలు నేర్చుకోకుండా పూడికతీత పనులను నిర్లక్ష్యంగా నిర్వహిస్తున్నారని విమర్శించారు. నాలాలో నుంచి తొలగించిన మట్టి, చెత్తను పూర్తిగా తరలించకుండా మళ్లీ నాలా ఒడ్డునే లేదా నాలాలోనే వదిలేయడం వల్ల వర్షపు నీటి ప్రవాహానికి తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో రాబోయే వర్షాకాలంలో మరోసారి శ్రీశ్రీ నగర్, రాజీవ్ గాంధీ నగర్, ప్రశాంతి నగర్ కాలనీలు ముంపు ముప్పును ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని ఆయన హెచ్చరించారు. ఈ నేపథ్యంలో అధికారులు వెంటనే స్పందించి నాలా పూడికతీత పనులను నాణ్యతతో పూర్తి చేయడంతో పాటు, తొలగిం చిన మట్టిని పూర్తిగా తరలించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా నాలా స్థలాన్ని కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని, దీనిపై కూడా సంబంధిత శాఖలు ప్రత్యేక దృష్టి సారించి కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడేందుకు వర్షాకాలం ప్రారంభానికి ముందే నాలా అభివృద్ధి పనులను పూర్తి చేసి ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్ర మంలో సీపీఐ శ్రీశ్రీ నగర్ శాఖ కార్యదర్శి కె. మనచారి, గంగన్న, రాములు తదితరులు పాల్గొన్నారు.

# కూలీల పొట్టకొడుతున్న కేంద్ర బీజేపీ ప్రభుత్వం: కర్రే లక్ష్మణ్



**హసన్‌పర్తి, జూన్ 20**
కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్రామీణ ప్రాంత కూలీల పట్ల వివక్ష చూపుతూ ఉపాధి హామీ పథకాన్ని క్రమంగా నిర్వీర్యం చేస్తోందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) జిల్లా కార్యదర్శి కర్రే లక్ష్మణ్ ఆరోపించారు.హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం అనంతసాగర్ గ్రామంలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రాంతాన్ని శనివారం ఆయన సంఘం నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.గ్రామీణ ప్రాంతాల్లో ముఖ్యంగా దళితులు, వెనుకబడిన వర్గాల ప్రజలు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. అలాంటి పథకాన్ని కేంద్ర ప్రభుత్వం కావాలనే బలహీనపరుస్తోందని విమర్శించారు.పనిచేసే ప్రదేశాల్లో కనీస సౌకర్యాలైన తాగునీరు, నీడ వంటి వసతులు కూడా లేవని, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం నిర్ణయించిన కూలి పూర్తిగా అందడం లేదని, చేసిన పనికి సకాలంలో వేతనాలు చెల్లించడం లేదని కూలీలు తమ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు.కూలీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్‌ను ఆయన డిమాండ్ చేశారు. కొత్తగా అమల్లోకి తీసుకురానున్న వీబీజీ రాంజీ చట్టం కూలీలకు మరింత అన్యాయం చేసే అవకాశముందని, పాత చట్టాన్ని యథావిధిగా కొనసాగించేలా కూలీలు ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మునిగాల భిక్షపతి, నాయకులు శనిగరపు రాజ్‌కుమార్, గిన్నారపు రాజు తదితరులు, గ్రామానికి చెందిన కూలీలు పాల్గొన్నారు.

# ఎరువుల దుకాణాలపై తనిఖీలు




**హసన్‌పర్తి, జూన్ 20**
హసన్‌పర్తి మండలంలోని ఓ ఫర్టిలైజర్ దుకాణంలో పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా శనివారం తనిఖీలు నిర్వహించారు. దుకాణంలో నిల్వ ఉన్న ఎరువులు, అమ్మకాల రికార్డులు, బిల్లులు, లైసెన్స్ వివరాలను పరిశీలించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకే ఎరువులను విక్రయించాలని దుకాణ యాజమాన్యానికి సూచించారు. రైతులకు నాణ్యమైన ఎరువులు అందేలా చూడడంతో పాటు అక్రమ నిల్వలు, అధిక ధరలకు విక్రయాలు, రికార్డుల నిర్వహణలో లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అలాగే స్టాక్ రిజిస్టర్లు, అమ్మకాల బిల్లులు, అనుమతి పత్రాలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయని అధికారులు హెచ్చరించారు.ఈ తనిఖీల్లో హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్, పోలీసు సిబ్బంది, మండల వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# విద్యా రంగంలో విప్లవానికి శ్రీకారం చుట్టిన ప్రజా ప్రభుత్వం

**-- పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యే లక్ష్యం**

**-- సీఎం రేవంత్ రెడ్డి దార్శనికతకు నిదర్శనంగా తెలంగాణ పబ్లిక్ స్కూల్స్, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్**

**-- మేడ్చల్ మల్కాజ్గిరి కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మదన్ మోహన్**



**బాలానగర్ జూన్ 21 ( పీపుల్స్ న్యూస్)**
తెలంగాణ రాష్ట్రంలో విద్యా రంగాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దే దిశగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలతో ముందుకు సాగుతోంది. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్యను పూర్తిగా ఉచితంగా అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలుకుతున్నాయని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మదన్ మోహన్ పేర్కొన్నారు -- తెలంగాణ రాష్ట్రంలో పబ్లిక్ స్కూల్స్ -- పేద విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్య..రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 119 తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ (టీపీఎస్) ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొదటి దశలో హైదరాబాద్ మినహా 100 నియోజకవర్గాల్లో ఈ పాఠశాలలను ప్రారంభించేందుకు చర్యలు చేపట్టింది. ఈ పాఠశాలల్లో నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఇంగ్లీష్ మీడియంలో విద్య అందించడంతో పాటు డిజిటల్ క్లాస్‌రూమ్స్, సైన్స్ ల్యాబ్‌లు, కంప్యూటర్ ల్యాబ్‌లు, ఆధునిక క్రీడా మైదానాలు వంటి సౌకర్యాలు కల్పించనున్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోని విధంగా ఈ స్కూళ్లను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. పైలట్ ప్రాజెక్ట్‌గా వంగూర్, మంచాల, అరుట్ల, పోల్కంపల్లి ప్రాంతాల్లోని తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ముఖ్యమంత్రి స్వయంగా ప్రారంభించగా, జూన్ 17 నుంచే తరగతులు ప్రారంభమయ్యాయి.యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ -- సామాజిక సమానత్వానికి కొత్త నిర్వచనం విద్య ద్వారా సామాజిక సమానత్వాన్ని సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో ఒకటి చొప్పున మొత్తం 119 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తోంది. ఈ మేరకు పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు ఒకే వేదికపై కలిసి చదువుకునే అవకాశం కల్పించనున్నారు. ఒక్కో స్కూల్‌ను 25 ఎకరాల విస్తీర్ణంలో సుమారు రూ.200 కోట్ల వ్యయంతో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నిర్మిస్తున్నారు. 4వ తరగతి నుంచి 12వ తరగతి వరకు పూర్తిస్థాయి రెసిడెన్షియల్ విధానంలో విద్య అందించనున్నారు. ఇప్పటికే 79 స్కూళ్లకు పరిపాలనా అనుమతులు లభించగా, 44 ప్రాంతాల్లో నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతు తున్నాయి. వచ్చే మూడు సంవత్సరాల్లో 119 స్కూళ్లను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి స్పష్టమైన గడువు విధించారు. -- విద్యా రంగానికి రికార్డు స్థాయి బడ్జెట్ కేటాయింపులు....గత ప్రభుత్వాలు విద్యా రంగాన్ని నిర్లక్ష్యం చేశాయని విమర్శించిన కాంగ్రెస్ ప్రభుత్వం, విద్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ 2025-26 బడ్జెట్‌లో రూ.21 వేల కోట్లకు పైగా కేటాయించిందని పేర్కొన్నారు."ప్రభుత్వ బడి అంటే పేదల బడి కాదు... ప్రతిభావంతుల బడి"విద్యాశాఖను స్వయంగా పర్యవేక్షిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ పాఠశాలలను అత్యున్నత ప్రమాణాలతో తీర్చిదిద్దేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. "ప్రభుత్వ బడి అంటే పేదల బడి కాదు, ప్రతిభావంతుల బడి" అనే నినాదంతో ప్రతి పాఠశాలను "పిల్లల దేవాలయం"గా భావించి అభివృద్ధి చేస్తున్నారని మదన్ మోహన్ తెలిపారు.-- మూడు ఏళ్లలో 238 ప్రపంచ స్థాయి మోడల్ స్కూళ్లు...ప్రతి నియోజకవర్గంలో ఒక తెలంగాణ పబ్లిక్ స్కూల్, ఒక యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు ద్వారా మొత్తం 238 ప్రపంచ స్థాయి విద్యాసంస్థలు రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి రానున్నాయి.పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్యను పూర్తిగా ఉచితంగా అందిస్తూ, తెలంగాణను విద్యారంగంలో దేశానికి ఆదర్శంగా నిలబెట్టాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు."విద్యలో పెట్టుబడి... తెలంగాణ భవిష్యత్తుకు బలమైన పునాది""ప్రభుత్వ బడుల పునరుజ్జీవనంతో బంగారు తెలంగాణ నిర్మాణం"అని వారు పేర్కొన్నారు.


# నారసింహా..సి పి ఎస్ రద్దు చేయ..రా.!

**- ఏ ఐ ఎన్ పి ఎస్ ఈ ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి**



**మాచన రఘునందన్**
భాగస్వామ్య పింఛను పథకం (సి పి ఎస్)రద్దు అనే విషయం దైవాధీనం అయ్యిందని,అందుకే ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేస్తున్నట్టు, ఆల్ ఇండియా న్యూ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఏ ఐ ఎన్ పి ఎస్ ఈ ఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శి మాచన రఘునందన్ అన్నారు. గురువారం నాడు ఆయన భాగస్వామ్య పింఛను పథకం(సి పి ఎస్)రద్దు కావాలన్న తమ అభిమతం నెరవేరాలని కోరుతూ.. తూప్రాన్ సమీపంలోని నాచవరం శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి ఆలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా రఘునందన్ మాట్లా డుతూ..ఏలికులు ఎప్పటికప్పుడు సి పి ఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చి పబ్బం గడుపుకుంటున్నారే తప్ప..పెన్షన్ తో ఉద్యోగుల ఆర్థిక భద్రత అన్న విషయం వారికి పట్టడం లేదని రఘునందన్ అవేదన వ్యక్తం చేశారు.దేశ వ్యాప్తంగా కోటి మంది కి పైగా ఉద్యోగులు న్యూ పెన్షన్ స్కీమ్ వద్దు అని దైవాన్ని దీనంగా అర్థిస్తున్నామని రఘునందన్ వివరించారు. పాలకులకు సి పి ఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ పథకం ను పునరుద్ధరించేలా బుద్ధి ప్రసాదించాలని కోరుతూ..దేవుళ్ళకు, దేవతలకు పూజలు చేస్తున్నామని రఘునందన్ వెల్లడించారు.

# నేడు ట్రాఫిక్ ఆంక్షలు , మళ్లింపులు







**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూన్ 20 (పీపుల్స్ న్యూస్) :** హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ & ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులో భాగంగా బంజారాహిల్స్ , జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో స్టీల్ ఫ్లైఓవర్ , అండర్‌పాస్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో, కేబీఆర్ పార్క్ చుట్టుపక్కల ఉన్న అన్ని రోడ్లలో ఆదివారం ఉదయం 10:00 గంటల నుండి రాత్రి 8:00 గంటల వరకు 1000 నుండి 2000 గంటలు వన్-వే ట్రయల్ రన్ నిర్వహించారు. ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేసిన సైన్‌బోర్డుల ఆధారంగా వాహన దారులు ఎడమ , కుడి లేన్‌లలోకి మారడానికి 'లేన్ చేంజర్స్' ఉపయోగించాల్సిందిగా కోరారు. ఎన్‌ఎఫ్‌సీఎల్ వైపు నుండి ఎస్‌ఎన్టి, సాగర్ సొసైటీ (ముగ్ధ), కెబీఆర్ పార్క్ ఎంట్రన్స్, జూబ్లీ హిల్స్ చెక్‌పోస్ట్, రోడ్ నెం. 36, రోడ్ నెం. 45 , కేబుల్ బ్రిడ్జ్ (దుర్గం చెరువు ) వైపు వెళ్లే వాహనదారులు వాహనదారులు ఇబ్బందులను నివారించడానికి ఈ ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకోవాలి: ఎన్టీఆర్ భవన్ వద్ద ఎడమ మలుపు తీసుకుని బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ వైపు ప్రయాణించాలి . అగ్రసేన్ ఐలాండ్ మీదుగా ఒమేగా హాస్పిటల్ భారతీయ విద్యాభవన్ జంక్షన్ రోడ్ నెం. 45, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, కేబుల్ బ్రిడ్జ్ ఐకియా వైపు వెళ్ళవచ్చు. యూసుఫ్‌గూడ, శ్రీనగర్ కాలనీ వైపు నుండి రోడ్ నెం. 36 & 45, జూబ్లీహిల్స్, మాదాపూర్ వైపు వెళ్లే వాహనదారులు ఇందిరానగర్ గడ్డ రోడ్ (రోడ్ నెం. 5, జూబ్లీహిల్స్) మీదుగా వెంకటగిరి జంక్షన్ వైపు వెళ్లాలి , వెంకటగిరి జంక్షన్ వద్ద కుడి మలుపు తీసుకుని , డైమండ్ హౌస్ మీదుగా జూబ్లీహిల్స్ రోడ్ నెం. 10 వైపు ప్రయాణించాలి. అక్కడ నుండి అల్-కాజర్ వైపు వెళ్లి కుడి మలుపు తీసుకుని రోడ్ నెం. 36 (నీరూస్ వైపు) రోడ్ నెం. 45, జూబ్లీహిల్స్, మాదాపూర్ వైపు వెళ్లవచ్చు.అన్నపూర్ణ స్టూడియో బైలేన్ (ఉపమార్గం) మీదుగా ప్రయాణించి ఎన్టీఆర్ భవన్ (రోడ్ నెం. 2) వైపు ఎడమ మలుపు తీసుకోవాలి బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ , అగ్రసేన్ ఐలాండ్ మీదుగా భారతీయ విద్యాభవన్ దాటి ఫిలింనగర్ (రోడ్ నెం. 82), సెనార్ వ్యాలీ , షేక్‌పేట్ వైపు వెళ్లవచ్చు.ఐటీసీ కోహినూర్, కేబుల్ బ్రిడ్జ్ (దుర్గం చెరువు) నుండి రోడ్ నెం. 45 జంక్షన్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, వెంకటగిరి, ఎన్టీఆర్ భవన్ మరియు పంజాగుట్ట వైపు వెళ్లే వాహనదారులు సులువైన ప్రయాణం కొరకు రోడ్ నెం. 60 మరియు 67 మీదుగా ప్రయాణించి, రోడ్ నెం. 1 ద్వారా జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్‌కు చేరుకోవాలి -ñ అక్కడి నుండి వెంకటగిరి, ఎన్టీఆర్ భవన్ మరియు పంజాగుట్ట వైపు వెళ్లవచ్చునని తెలిపారు.వాహనదారులు ఆదివారం ఉదయం 10:00 గంటల నుండి రాత్రి 8:00 గంటల వరకు ఆయా ప్రాంతాలలో ట్రాఫిక్ మళ్లింపులను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ నిర్దేశిత మార్గాల్లో ఎక్కడా 'ఖ' టర్న్‌లు అనుమతించబడవు. సజావుగా ఇబ్బంది లేకుండా ఎగ్జిట్ అవ్వడానికి రోడ్డుకు ఎడమ వైపున ప్రయాణించాలి.ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఉండటానికి మార్గంలో ఏర్పాటు చేసిన నిర్దేశిత ఎగ్జిట్ పాయింట్లను గమనించాలన్నారు. రోడ్డుపై ఉండే ట్రాఫిక్ పోలీసుల సూచనలను , సైన్‌బోర్డులను ఖచ్చితంగా పాటించాలి.రియల్ టైమ్ ట్రాఫిక్ అప్‌డేట్స్ కోసం నావిగేషన్ యాప్‌లను ఉపయోగించాలన్నారు. ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి వీలైనంత వరకు ప్రజా రవాణా లేదా కార్ పూలింగ్ కు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రద్దీ సమయాల్లో భారీ వాహనాలు ఈ మార్గాల్లో రాకుండా ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలన్నారు. మౌలిక వసతుల అభివృద్ధి పనుల సమయంలో ట్రాఫిక్ నియంత్రణ , ప్రజా రక్షణ కోసం ఈ చర్యలు చేపట్టడమైనది. దీనివల్ల ప్రజలకు కలిగే అసౌకర్యానికి విచారం వ్యక్తం చేస్తున్నాము. పౌరులు ఈ మార్పులను గమనించి, ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాల్సిందిగా కోరుతున్నాము. ట్రాఫిక్ అప్‌డేట్ల కోసం మా సోషల్ మీడియా వేదికలైన ఫేస్‌బుక్ పేజీ (ఋషవఎశీశిని.ఏశీఎ/ని్బూ) మరియు ఎక్స్/ట్విట్టర్ హ్యాండిల్ (ఏన్బూ)లను అనుసరించండి. ప్రయాణంలో ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే, సహాయం కోసం మా ట్రాఫిక్ హెల్ప్‌లైన్ నంబర్ 9010203626ను సంప్రదించవచ్చు.

## ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసం కేసును చేదించిన సైబర్ క్రైమ్ పోలీసులు

### - నిందితులను అరెస్టు





**సైబరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూన్ 20 (పీపుల్స్ న్యూస్) :** ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసం కేసును సైబర్ క్రైమ్ పోలీసులు విజయవంతంగా ఛేదించారు. సైబర్ మోసాల ద్వారా వచ్చిన అక్రమ నగదును తరలించేందుకు ఉపయోగించే మ్యూల్ బ్యాంక్ ఖాతాలను తెరవడం, నిర్వహించడం , అందించడంలో పాల్గొన్న ఏడుగురు నిందితులను అరెస్టు చేశారు. వివరాల ప్రకారం... ... అరెస్టు చేసిన నిందితులు బ్యాంక్ ఖాతాలను ఏర్పాటు చేయడం, ఖాతాదారులను సమకూర్చడం, మోసపూరిత నగదును సేకరించడం, నగదును రవాణా చేయడం , వ్యవస్థీకృత సైబర్ నేర ముఠాలకు మనీ లాండరింగ్ కార్యకలాపాలను సులభతరం చేయడంలో పాల్గొన్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఎల్ఐసీ కాలనీ కి చెందిన రాపర్తి గౌతమ్ (28) , ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం , విశాఖపట్నం, గాజువాక పోస్టు, గణపతి నగర్ కు చెందిన సేనాపతి పెంటయ్య (56), విశాఖపట్నం ద్వారకానగర్ కు చెందిన బోడాల సాయి కుమార్(28), ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, శ్రీకాకుళం జిల్లా, కోటబొమ్మాళి మండలం, కురుడు పోస్టు, చౌదరి కొత్తూరు కు చెందిన మురపాకల కుమార్ (30) , విశాఖపట్నం, పెదగంట్యాడ మండలం, ఏపీఎచ్‌బీ కాలనీ కి చెందిన విజ్జిపు సత్యనారాయణ(44), విశాఖపట్నం , గాజువాక డిపో కు చెందిన మంత్రి సాయి కుమార్(24), రాయదుర్గం, మదన్ నగర్ కాలనీ కి చెందిన ఉట్ల సత్యనారాయణ (27) దర్యాప్తులో బోడాల సాయి కుమార్ సైబర్ మోసాల ద్వారా వచ్చిన నగదును సేకరించి రాపర్తి గౌతమ్ కు అప్పగించినట్లు వెల్లడైంది. ప్రధాన నిందితుడు సేనాపతి గణేష్ ఆదేశాల మేరకు, రాపర్తి గౌతమ్ ఆ నగదును సేనాపతి పెంటయ్య కు అందజేశాడు. సేనాపతి పెంటయ్య వ్యవస్థీకృత సైబర్ నేర ముఠా తరపున ఆ నగదును స్వీకరించినట్లు దర్యాప్తులో తేలింది. ఈ లావాదేవీల సమయంలో మంత్రి సాయి కుమార్ నగదు రవాణా , సరఫరాలో సహకరించి, నిందితుల మధ్య మోసపూరిత నగదు తరలింపులో కీలక సహాయక పాత్ర పోషించినట్లు గుర్తించారు. తదనంతరం, మరో ప్రత్యేక పోలీసు బృందం హైదరాబాద్‌లోని రాయదుర్గం , మణికొండ ప్రాంతాల్లో దాడులు నిర్వహించి, ఉట్ల సత్యనారాయణ ను అదుపులోకి తీసుకుని అరెస్టు చేసింది. సైబర్ మోసాల ద్వారా వచ్చిన నగదును తరలించేందుకు ఉపయోగించే బ్యాంక్ ఖాతాలను నిర్వహించడం అందించడంలో అతను పాల్గొన్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. దర్యాప్తులో నిందితులు మ్యూల్ బ్యాంక్ ఖాతాల ఏర్పాటు, ఖాతాదారుల సమీకరణ, మోసపూరిత నగదు సేకరణ, నగదు రవాణా వ్యవస్థీకృత సైబర్ నేర ముఠాలకు మనీ లాండరింగ్ కార్యకలాపాలను సులభతరం చేయడంలో చురుకుగా పాల్గొన్నట్లు తేలింది.ఇతర లబ్ధిదారులు, అకౌంట్ సప్లయర్లు, నగదు నిర్వాహకులు , ఈ వ్యవస్థీకృత సైబర్ మోసాల నెట్‌వర్క్ వెనుక ఉన్న ప్రధాన సూత్రధారులను గుర్తించేందుకు దర్యాప్తు కొనసాగుతోందన్నారు.

## మొహర్రం వేడుకలలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ముందస్తు చర్యలు











**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూన్ 20 (పీపుల్స్ న్యూస్) :** మొహర్రం సందర్భంగా నగరంలో శాంతిభద్రతల పరిరక్షణకు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు హైదరాబాద్ సిటీ పోలీస్ శాఖ కట్టుదిట్టమైన ముందస్తు చర్యలు చేపట్టిందని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ అన్నారు.మొహర్రం సందర్భంగా డబీర్‌పుర, దారుషిఫాలోని చారిత్రాత్మక బీబీ కా అలవాను హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ శనివారం సందర్శించారు. దట్టిని సమర్పించి ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం, ఊరేగింపులో ప్రధాన ఆకర్షణగా నిలిచే శ్రీదేవి ఏనుగు ట్రయల్ వాక్‌ను ఎమ్మెల్సీ మీర్జా రియాజ్ ఉల్ హాసన్ ఎఫెండితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను ఉన్నతాధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఊరేగింపు నిర్వాహకులతో మాట్లాడి, భద్రతా పరంగా పోలీసులకు సహకరించాల్సిందిగా కోరారు.నగర సీపీ వీసీ సజ్జనర్, మీడియాతో మాట్లాడుతూ బీబీ కా ఆలం ఊరేగింపు కోసం దాదాపు 2 వేల మంది సిబ్బందితో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామని, ఊరేగింపు మార్గంలో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు.భారీ జనసమూహం ఉన్నప్పుడు ఏనుగు ప్రవర్తన ఎలా ఉంటుంది, ఊరేగింపు సాగే మార్గం ఎలా ఉంది, భద్రత పరంగా ఇంకా ఎలాంటి అదనపు ఏర్పాట్లు చేయాలి అనే అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించడమే ఈ 'ట్రయల్ రన్' ముఖ్య ఉద్దేశమని సీపీ వివరించారు. నగరంలో గతంలో ఏ కార్యక్రమం జరిగినా ఇక్కడి ప్రజలు పోలీసులకు ఎంతో చక్కగా సహకరించారని గుర్తుచేశారు. ఈసారి కూడా అదే రీతిలో తోడ్పాటునందించి, ఈ కార్యక్రమమంతా ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నగర విశిష్ట సంస్కృతి అయిన 'గంగా-జమునా తహజీబ్'ను ప్రతిబింబించేలా, ప్రజలు, నిర్వాహకుల తోడ్పాటుతో ఈ ఉరేగింపును ప్రశాంతంగా పూర్తి చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో లా అండ్ ఆర్డర్ అడిషనల్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్, చార్మినార్ జోన్ డీసీపీ ఖారే కిరణ్, టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైభవ్ రఘునాథ్ గైక్వాడ్,.బికె. రాహుల్ హెగ్డే డిసిపి ట్రాఫిక్ లతో పాటు ఇతర సీనియర్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## ఒత్తిడిని జయించే అద్భుత సాధనం యోగా

### :- ఐపీఎస్ పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ




**పెద్దపల్లి,జూన్ 20:-** యోగా శారీరక,మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడంతో పాటు ఒత్తిడిని జయించే అద్భుత సాధనమని ఇండియన్ పబ్లిక్ పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్,ప్రిన్సిపల్ కృష్ణప్రియ పేర్కొన్నారు.అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం పాఠశాలలో ఘనంగా యోగ డే వేడుకలు నిర్వహించారు.యోగా శిక్షకులు, పీఈటీల ఆధ్వర్యంలో విద్యార్థులతో సూర్య నమస్కారాలు,పద్మాసనం, చక్రాసనం,భుజంగాసనం, హలాసనం తదితర యోగాసనాలు చేయించారు.ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్ ప్రిన్సిపల్ కృష్ణప్రియ మాట్లాడుతూ యోగా ద్వారా శరీర దారుఢ్యంతో పాటు మానసిక ప్రశాంతత,ఏకాగ్రత పెరుగుతాయని వివరించారు. విద్యార్థులు ప్రతిరోజూ యోగా సాధన చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనాన్ని అలవర్చుకోవచ్చని సూచించారు.ఈ కార్యక్రమంలో పీఈటీలు సత్యం, సతీష్, జ్యోతి,మేనేజర్ శివ, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు,విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## 7 హోటల్ సమీపంలో వ్యక్తి మృతి



**చిట్యాల, జూన్ 20** ?చిట్యాల పోలీస్ స్టేషన్ పరిధిలోని నేషనల్ హైవే 65 పక్కన ఉన్న '7 హోటల్' సమీపంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. చిట్యాల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడిని ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నోకు చెందిన లారీ క్లీనర్ లకేంద్ర (33)గా గుర్తించారు. వారం రోజుల క్రితం పని కోసం బయలుదేరిన లకేంద్ర గత రెండు రోజులుగా కుటుంబ సభ్యులకు అందుబాటులోకి రాలేదు. దీంతో అతని కోసం వెతుకుతూ బుధవారం (26-06-2024) చిట్యాలకు వచ్చిన బంధువులకు, హోటల్ సమీపంలో లకేంద్ర మృతదేహం కనిపించింది. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న అతను, సరిగ్గా ఆహారం తీసుకోకపోవడం మరియు ఎండ తీవ్రతకు వడదెబ్బ తగలడం వల్లే మరణించి ఉంటాడని బంధువులు తెలిపారు. మృతిపై తమకు ఎలాంటి అనుమానాలు లేవని పేర్కొన్నారు. మృతుడి మేనబావ దిలీప్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిట్యాల ఎస్ఐ ఎం. రవికుమార్ తెలిపారు.

## దేశవ్యాప్తంగా 23వ విడత పిఎం కిసాన్ నిధులు విడుదల

### :- జిల్లా వ్యవసాయ అధికారులు కెవికె రామగిరి హెడ్ వెంకట రమేష్

**రామగుండం,జూన్ 20:** పాలకుర్తి మండలం పాలకుర్తి రైతు వేదికలో పీఎం కిసాన్ నిధుల విడుదల కార్యక్రమాన్ని పాలకుర్తి రైతులతో ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించిన జిల్లా వ్యవసాయ అధికారి బత్తిని శ్రీనివాస్,కెవికె రామగిరి ఖిల్లా శాస్త్రవేత్తల బృందం,వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా రైతులకు వివిధ వ్యవసాయ పద్ధతుల్లో పై అవగాహన ఇందులో కల్పించారు.పాలకుర్తి రైతు వేదికలో సాయంత్రం 4 గంటల నుండి పీఎం కిసాన్ నిధుల ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు చేశారు.ఇందులో పిఎం కిసాన్ 23 వ విడత నిధుల విడుదలను ప్రధాని చేతులు మీదుగా అట్టహాసంగా జరిగింది.పాలకుర్తి మండలంలో 3724 రైతు ఒక్కో కుటుంబాలకు ఈ విడత రూ: 2000 చొప్పున నేరుగా ఖాతా లో జమా.రైతు సోదరులు అర్హత ఉండి ఇప్పటికీ పిఎం కిసాన్ రానివారు,పీఎం కిసాన్ పై సందేహాల ఉన్నవారు,పీఎం కిసాన్ లబ్ధిదారులు,అభ్యుదయ రైతులు సందేహాలు నివృత్తి చేశారు.అలాగే కేవైసీ,ఈ కేవైసీ లేదా భూమి వివరాలపై ఏవైనా సందేహాలు ఉన్న రైతులు ఈ సమావేశానికి హాజరై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు పాలకుర్తి ఎం.సువర్ణ రేఖ,జయ్యారం ఏఈఓ కే.శ్రీకాంత్,గూడూరు ఏఈఓ జే.సుష్మ,మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్,డిఎఓ జిల్లా వ్యవసాయ అధికారి బత్తిని శ్రీనివాస్ కెవికె హెడ్,డాక్టర్ వెంకట రమేష్,రామగిరి ఖిల్లా శాస్త్రవేత్తలు కిరణ్,డాక్టర్ వై వెంకన్న,డాక్టర్ టి.వినోద్, రైతులు,తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## బీర్ల ఐలయ్య పై ప్రతిపక్షాల నిందలు మానుకోవాలి

**రాజాపేట జూన్ 20 :** ఆలేరు శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అభివృద్ధి కార్యక్రమాలు చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు నిందలు మోపుతున్నారని రాజపేట మండల కాంగ్రెస్ నాయకులు, పారుపల్లి గ్రామ మాజీ సర్పంచ్ గౌర బక్కయ్య అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడు. ఆలేరును సస్యశ్యామలంగా దిద్దుతున్న ఐలన్నను చూసి ప్రజల ఆధారణ చూసి ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయని అన్ని అబద్ధాల మాటలతో నిడంబరమైన పదాలు ఓర్వలేక బదనాం చేస్తున్నారని అన్నారు. ప్రజలు అన్ని చూస్తున్నారని రాబోయే ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించి ఐలన్నను లక్ష మెజార్టీతో గెలిపించడం ఖాయమని, ఐలన్న మంత్రి కావడం ఖాయం అని అన్నారు. ఇలాంటి అబాండరాలు మళ్లీ ఒకసారి మీద వేస్తే పెద్ద ఎత్తున ప్రజలతో కలిసి బుద్ధి చెప్పిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక



**నారాయణపేట, జూన్ 20**
ధన్వాడ మండల కేంద్రంలోని ఆగ్రో, హాకా రైతు సేవా కేంద్రాలను శనివారం జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాలలో పత్తి విత్తనాల ప్యాకెట్లను, ఇతర రసాయనిక ఎరువులు, పురుగుల మందుల ను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్లను చెక్ చేశారు. ఈ సీజన్ లో రైతులకు అవసరమైన ఎరువులన్నీ అందుబాటులో ఉన్నాయా లేదా అని డీలర్లను అడిగి తెలుసుకున్నారు. గోదాముల్లో నిల్వ ఉంచిన యూరియా బస్తాలను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియా నాయక్, ధన్వాడ తహసిల్దార్ సింధూజ, ఎంపీడీవో అబ్జల్, ఏవో నవీన్ కుమార్, ఆర్. ఐ. నిఖిల్, వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన హెచ్ఎంఎస్ నాయకుడు రియాజ్ అహ్మద్


**:- ?పరామర్శించిన సమత సైనిక్ దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. మార్షల్ దుర్గం నగేష్**



**రామగుండం,జూన్ 20 :-**
మంథని మండలం దుబ్బపల్లి సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన హెచ్ఎంఎస్ నాయకుడు రియాజ్ అహ్మద్‌ను సమత సైనిక్ దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా.మార్షల్ దుర్గం నగేష్ పరామర్శించారు. గోదావరిఖనిలోని రియాజ్ అహ్మద్ నివాసానికి వెళ్లిన ఆయన ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసి,కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.?ఈ సందర్భంగా డా.నగేష్ మాట్లాడుతూ రియాజ్ అహ్మద్ ప్రమాదానికి గురికావడం బాధాకరమని,ఆయన త్వరగా కోలుకుని,పూర్వ వైభవంతో కార్మికుల హక్కుల సాధనలో,ప్రజా సమస్యల పరిష్కారంలో మళ్లీ చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ప్రయాణాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కష్టకాలంలో బాధితులకు అండగా నిలవడం సామాజిక బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు, సమత సైనిక్ దళ్ సభ్యులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## విజిబుల్ పోలీసింగ్‌తోనే నేరాల నియంత్రణ సాధ్యం

**:- మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్**



**మంచిర్యాల,జూన్ 20**
నేరాల నియంత్రణకు నిరంతర పెట్రోలింగ్ చేపట్టాలని మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్ అన్నారు.శనివారం ఆయన మందమర్రి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు.పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించిన డీసీపీ,స్టేషన్ ఆవరణను పరిశుభ్రంగా ఉంచి ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చూడాలని సూచించారు.స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. రిసెప్షన్ సెంటర్ రికార్డులను తనిఖీ చేశారు.నమోదవుతున్న కేసుల వివరాలు,రౌడీషీటర్ల వివరాలు,నేరాల స్వభావం, కేసుల పురోగతి తదితర అంశాలను తెలుసుకున్నారు.రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు.నేరాల నియంత్రణకు విజిబుల్ పోలీసింగ్ అత్యవసరమని, నిరంతర పెట్రోలింగ్‌తో పాటు ఆకస్మిక వాహన తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. గంజాయి,ఇతర మత్తు పదార్థాల క్రయవిక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.అనంతరం సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.స్టేషన్ పరిధికి సంబంధించిన వివిధ అంశాలను సీఐ రమేష్ డీసీపీకి వివరించారు.ఈ తనిఖీలలో బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్, మందమర్రి సీఐ రమేష్,ఎస్ఐ నరేష్ పాల్గొన్నారు.

## చౌక ధరాల దుకాణం కేజీబీ జడ్.పి.హెచ్.ఎస్ స్కూల్స్ తనిఖీ నిర్వహించిన భాస్కర్ రావు టీమ్



**నారాయణపేట, జూన్ 20**
నారాయణపేట జిల్లాలో శనివారం సివిల్ సప్లై కమిషనర్ ఆదేశాల మేరకు ఆ శాఖ జనరల్ మేనేజర్ భాస్కర్ రావు తో పాటు టెక్నికల్ టీం, సైదులు డిస్ట్రిక్ట్ మేనేజర్ జిల్లాలో మరికల్ మండలంలోని చౌకదారుల దుకాణం మరియు కేజీబీవీ హాస్టల్ , జడ్.పి.హెచ్.ఎస్ స్కూల్ మరికల్ అండ్ కేజీబీవీ హాస్టల్ , ఎస్సీ వెల్ఫేర్ హాస్టల్ నారాయణపేట సందర్శించడం జరిగినది అలాగే మధ్యాహ్నం భోజనం పథకం కింద సప్లై చేస్తున్న సన్న బియ్యం నాణ్యతను మరియు మధ్యాహ్న మధ్యాహ్న భోజనం ఆహార నాణ్యత గురించి మరియు వంట విధానాన్ని పరిశీలించారు.

## రోడ్డు ప్రమాదంలో శ్వాస కోల్పోయిన పసికందును సీపీఆర్ తో బ్రతికించిన రాజేంద్రనగర్ డిసిపి బృందం






**హైదరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో జూన్ 20 (పీపుల్స్ న్యూస్) :**
రాత్రి వేళ జరిగిన ఒక ఘోర రోడ్డు ప్రమాదంలో అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఏడాది పసికందు ప్రాణాన్ని రాజేంద్రనగర్ జోన్ డిసిపి ఎస్. శ్రీనివాస్, వారి నైట్ డ్యూటీ ఎస్కార్ట్ సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించి, ప్రథమ చికిత్స ద్వారా కాపాడారు. వివరాల్లోకి వెళ్ళితే...... బెంగళూరు నుండి హైదరాబాద్ వైపు వస్తున్న (ఎంహెచ్ 14జేఆర్ 9028 ) నంబర్ గల ఒక కారు శంషాబాద్ – ఆరాంఘర్ రూట్‌లో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును బలంగా ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే డిసిపి , వారి సిబ్బంది క్షణాల్లో ఘటనా స్థలానికి చేరుకున్నారు. కారులో ఉన్న ఏడాది బాలుడు ఊపిరి ఆగి, పూర్తిగా అపస్మారక స్థితిలోకి వెళ్లడాన్ని గమనించారు. ఆందోళనలో ఉన్న తల్లిదండ్రుల సమక్షంలోనే డిసిపి ఆదేశాల మేరకు సిబ్బంది బాలుడికి తక్షణమే ప్రథమ చికిత్స అందించారు. పోలీసుల నిరంతర శ్రమతో బాలుడు కొద్దిసేపటికే స్పృహలోకి వచ్చి ఏడవడం ప్రారంభించాడు. దీంతో ఊపిరి పీల్చుకున్న తల్లిదండ్రులు మరియు సిబ్బంది, క్షతగాత్రులందరినీ తదుపరి మెరుగైన చికిత్స నిమిత్తం వెంటనే ఆసుపత్రికి తరలించారు.

## ఖైరతాబాద్ జోన్‌లో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు







**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూన్ 20 (పీపుల్స్ న్యూస్) :**
యోగ సాధన ద్వారా రోజువారీ జీవితంలో ఒత్తిడిని అధిగమించి, ఆరోగ్యకరమైన , సంతోషకరమైన జీవనాన్ని గడపవచ్చని ఖైరతాబాద్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్‌అన్నారు. హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ పిలుపు మేరకు ప్రారంభమైన 'గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్' లో భాగంగా, అలాగే జూన్ 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖైరతాబాద్ జోన్ పోలీస్ అధికారులకు, సిబ్బందికి యోగా , ధ్యాన అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బ్రహ్మకుమారీస్ సమాజానికి చెందిన ప్రతినిధులు విచ్చేసి ఖైరతాబాద్ జోన్ కె. శిల్పవల్లి, డిసిపి స్వయంగా ఈ సెషన్‌లో పాల్గొని యోగాసనాలు, ప్రాణాయామం, యోగ నిద్ర , ధ్యానం యొక్క ప్రాముఖ్యతను వివరించడమే కాకుండా, వాటిని స్వయంగా చేయించారు. హైదరాబాద్ సిటీ పోలీస్ అధికారులలో ఆరోగ్యకరమైన, క్రియాశీలక జీవనశైలిని పెంపొందించడానికి ప్రతి శనివారం నిర్వహించే వీక్లీ సెషన్స్‌లో భాగంగా జరిగిన ఈ యోగా కార్యక్రమాన్ని అడిషనల్ సీపీ (క్రైమ్స్ అండ్ సిట్ ) ఎం. శ్రీనివాసులు స్వయంగా పర్యవేక్షించారు.

## దర్యాప్తు నైపుణ్యాల పెంపునకు తెలంగాణ పోలీస్ అకాడమీలో ప్రత్యేక శిక్షణ







**హైదరాబాద్,క్రైమ్ బ్యూరో జూన్ 20 (పీపుల్స్ న్యూస్) :**
నూతన క్రిమినల్ చట్టాల అమలు నేపథ్యంలో శాస్త్రీయ దర్యాప్తు నైపుణ్యాలను పెంపొందించేందుకు పోలీస్ కానిస్టేబుల్ నుండి సబ్–ఇన్‌స్పెక్టర్ స్థాయి వరకు ఉన్న పోలీసు సిబ్బందికి "నేర సంఘటన స్థల నిర్వహణలో క్లూస్ టీమ్" అంశంపై ఆరు రోజుల ప్రత్యేక సేవా శిక్షణా కోర్సు నిర్వహించారు. ఈ శిక్షణలో నేర సంఘటన స్థలాన్ని శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించడం, సాక్ష్యాధారాల గుర్తింపు, సేకరణ, సంరక్షణ, ప్యాకింగ్, సీలింగ్, లేబులింగ్ , ఫార్వార్డింగ్ విధానాలపై సమగ్ర అవగాహన కల్పించారు. భౌతిక, జీవసంబంధ , డిజిటల్ సాక్ష్యాధారాలను సక్రమంగా నిర్వహించారు. వాటి సమగ్రతను కాపాడడం, చైన్ ఆఫ్ కస్టడీ నిర్వహణపై శిక్షణ అందించారు. నేర సంఘటన స్థల డాక్యుమెంటేషన్‌కు సంబంధించిన ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ, శోధన పద్ధతులు , రికార్డుల నిర్వహణపై విస్తృత స్థాయిలో ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చారు. నూతన క్రిమినల్ చట్టాల ప్రకారం తప్పనిసరి అయిన ఆడియో–వీడియో రికార్డింగ్ విధానాలపై ప్రత్యేక దృష్టి సారించి, ఎలక్ట్రానిక్ రికార్డుల ప్రామాణికత , న్యాయపరమైన అంశాలపై అవగాహన కల్పించారు. డిజిటల్ సాక్ష్యాధారాల ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని, ఎలక్ట్రానిక్ పరికరాల గుర్తింపు, స్వాధీనం, సాక్ష్యాల భద్రత , డాక్యుమెంటేషన్‌పై ప్రత్యక్ష శిక్షణ అందించారు. క్లూస్ టీమ్ వాహనం , నేర సంఘటన స్థల పరిశీలనలో ఉపయోగించే వివిధ ఫోరెన్సిక్ కిట్లు, పరికరాలు , ఉపకరణాలపై ప్రత్యేక సెషన్ నిర్వహించి, వాటి వినియోగాన్ని ప్రదర్శనల ద్వారా వివరించారు. వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా రూపొందించిన ఆరు మాక్ క్రైమ్ సీన్ సిమ్యులేషన్ వ్యాయామాలు నిర్వహించబడ్డాయి. బీఎన్ఎస్ఎస్ , బీఎస్ఏ చట్టాలకు సంబంధించిన నిబంధనలపై నిర్వహించిన తరగతులు నేర సంఘటన స్థల దర్యాప్తు , సాక్ష్యాధారాల నిర్వహణలో అవసరమైన న్యాయపరమైన అవగాహనను మరింత బలోపేతం చేశాయి. ప్రతిరోజూ నిర్వహించిన మూల్యాంకనాల ద్వారా శిక్ష ణార్థుల అవగాహనను పరీక్షించి, నేర్చుకున్న అంశాలను మరిం త పటిష్టం చేశారు. ఈ కోర్సు ను డైరెక్టర్ అభిలాష బిస్త్ స్పెషల్ కోర్సు గా తెలంగాణ పోలీస్ అకాడమీ లో నిర్వహిస్తున్నారు. ఈ కోర్సు డైరెక్టర్ గా ధనజ, వ్యవహరించారు. క్లోజింగ్ కు ఎడి నరహరి క్లూస్ టీం ప్రాముఖ్యతను వివరించారూ

# సంపూర్ణ ఆరోగ్య ప్రక్రియ యోగా... !



మన రుషులు అందించకినే అద్భుత ఆరోగ్య ప్రక్రియ యోగా. ఆధునిక కాలంలో మనమంతా చేస్తున్న కసరత్తులకు పూర్వమే రుషులు యోగా ద్వారా మన శరీరాన్ని అదుపులో పెట్టుకోవడమెలాగో ఆచరించి చూపారు. వేల ఏళ్లుగా ఈ యోగా అన్నది ఆనాటి దినచర్యలో భాగం. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చని నిరూపితం అయ్యింది. ఇతర వ్యాయామాకంటే భిన్నమైన యోగాభ్యాసము దానిలో నిబిడీకృతంగా ఉన్న ఆద్యాత్మిక భావం కారణంగా దేశవిదేశాలలో విశేషప్రాచుర్యాన్ని సంతరించుకున్నది.ఆరోగ్యమే మహాభాగ్యం అన్న నానుడికి యోగా పరమౌషధం. యోగా చేసేవారిలో ధృఢత్వం, మానసిక ప్రశాంతతను గమనించవచ్చు. ముఖ్యంగా పాశ్చాత్యదేశాల యోగా ప్రాచుర్యము, ఆదరణ అమోఘమైనది. పాశ్చాత్య దేశీయులకు యోగా మీద ఉన్న విశేషమైన మక్కువ, ఆకర్షణ లోక విదితం. బుద్ధ ఆరామలాలో ఇచ్చేశిక్షణలో యోగా కూడా ఒక భాగమే. వారి వేషధారణ క్రమశిక్షణ ప్రపంచ ప్రాముఖ్యత ఆకర్షణ సంతరించుకున్నది. భారతీయ సంప్రదాయిక యోగశిక్షణా తరగతులను అనేక దేశాలలో నిర్వహిస్తున్నారు. ఇతర వ్యాయాయములు శరీరదారుఢ్యాన్ని మాత్రమే మెరుగు పరచడములోదృష్టిని సారిస్తాయి. యోగా భ్యాసము ధ్యానం, ప్రాణాయామం లాంటి పక్రియలు మానసిక ఏకాగ్రత వలన మానసిక ప్రశాంతతను కలిగించి మానసిక ఆరోగ్యానికి కూడా దోహద పడుతుంది. మానసిక వత్తిడులు, హృద్రోగము, రక్తపోటు లాంటి వ్యాధుల తీవ్రత తగ్గించటానికి తోడ్పడుతుందని ప్రయోగాత్మకంగా యోగా నిరూపించింది. సనాతన సంప్రదాయమైన యోగా అధునిక కాలంలో కూడా అనేకమంది అధునికుల అభిమానాన్ని చూరగొన్నది. ప్రధాని మోడీ చొరనవతో ఐక్యరాజ్య సమితి జూన్ 21న యోగా దినోత్సవం జరుపుకోవడానికి అంగీకరిం చింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా 21న అంతర్జాతీయ యోగా జరుపుకుంటున్నాం. ఇది భారతీయులకు గర్వకారణంగా చెప్పుకోవాలి. జూన్ 21 ఉత్తరార్ధగోళంలో అత్యధిక పగటి సమయం ఉన్న రోజు. ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో ఆ రోజుకు ప్రత్యేకత కూడా ఉంటుంది. ఎక్కువ పగటి సమయం ఉన్న రోజుగా గుర్తింపు పొందడంతో అదే రోజును అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుకోవాలని ఐక్యరాజ్యసమితికి ప్రధాని మోదీ సూచించారు. దీంతో అంతర్జాతీయ యోగ దినోత్సవము ప్రతి సంవత్సరం జూన్ 21 న జరుపడానికి నిశ్చయించారు. 2014 సెప్టెంబరు 27న భారత ప్రధాని నరేంద్రమోడి ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రతి సంవత్సరం జూన్ 21న జరుపుకొనుట గురించి ప్రతిపాదన చేశారు. ఈ తీర్మానానికి 193 ఐరాస ప్రతినిధులలో 175 మంది మద్దతు ఇచ్చారు. భద్రతా కమిషన్‌లో శాశ్వత సభ్యులుగా ఉన్న భారతదేశం, అమెరికా, ఇంగ్లాండ్, చైనా, ఫ్రాన్స్, రష్యా వంటి దేశాలు కూడా ఈ తీర్మానానికి సహ ప్రతినిధులు. విస్తృతమైన చర్చల తరువాత డిసెంబర్ 2014 లో ఆమోదించబడింది. 2015 జూన్ 21 న, మొదటి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా జరుపుకున్నారు. మన యోగా గురించి వేల ఏళ్ల క్రితం ఆచారంలో ఉన్నట్లు పురాణాలు, ఇతిహాసాల్లో ఉంది. ఈశ్వరుడు తపస్సు చేస్తున్నప్పుడు పద్మాసనంలో ధ్యానయోగంలో ఉన్నట్లు పురాణాలలో వర్ణించబడి ఉంది. లక్ష్మీదేవి ఎప్పుడు పద్మాసినియే, మహా విష్ణువు నిద్రను యోగనిద్రగా వర్ణించబడింది. తాపసులు తమ తపసును పద్మాసనంలోనే చేసినట్లు పురాణ వర్ణన. ఇంకా లెక్కకు మిక్కిలి ఉదాహరణలు హిందూ సంప్రదాయంలో చోటు చేసుకున్నాయి. బుద్ధ సంప్రదాయంలో, జైన సంప్రదాయం లోను, సన్యాస శిక్షణలోను యోగా ప్రధాన పాత్ర పోషిస్తుంది. సింధు నాగరికత కుడ్య చిత్రాల ఆధారంగా యోగా వారి నాగరికతలో భాగంగా విశ్వసిస్తున్నారు. 11 వ శతాబ్దమున ఘూరఖ్స్ నాద్ శిశ్యుడగు స్వామి స్వాత్వారామ ముని హఠయోగం అను యొగ శాస్త్ర గ్రంథం వ్రాసి యున్నారు. ఇందులో ఆసనములను, ప్రాణాయామ పద్ధతులను, బంధములను, ముద్రలను, క్రియలను సవిస్తారముగ వ్రాసి యున్నారు. అనేక వేల ఆసనములలో 84 ఆసనములను ముఖ్యమైనవిగా చెప్పబడినవి. ముఖ్యముగ ధ్యానమునకు కావలసిన సుఖాసనము, సిద్దాసనము, అర్ధ పద్మాసనము, పద్మాసనములు ముఖ్యమని చెప్ప బడింది. ఇదె విధముగ పాతంజలి యొగ శాస్త్రమున – స్థిరసుఖ మాసనమ్– అని ఆసనము నకు నిర్వచనము ఉంది. ప్రాణాయామ సాధనలో – సూర్య భేదన, ఉజ్జాయి, శీతలి, సీత్కారి, భస్త్రిక, భ్రామరి, ప్లావని, మూర్ఛ – ఇతి అష్ట కుంభకాని వంటి 8 ప్రాణాయమములు చెప్ప బడెను. జాలంధర బంధము, మూల బంధము, ఉడ్యాన బంధము – ఈ మూడు బంధములు ముఖ్యమని చెప్పబడెను. ముద్రలలో మహాముద్ర, మహాబంధ, మహాభేధ – ముఖ్య మగు ముద్రలుగ చెప్ప బడెను. శరీరమునకు బహిర్ అంతర్ శుచి చాల అవసరముగ ఈ హఠయొగమున ప్రధాన అంశముగ చెప్పబడింది.–ధవుతి, నేతి, వస్తి, నొలి, త్రటకం, తధా కఫాల భాతి ఏతాని షట్ కర్మాణి – అని వివరణగలదు.. అంటే యోగాలో ఏయే ఆసనం వేస్తే..ఏయే అవయవం బాగా పనిచేస్తుందన్న విషయం దాగివుంది. అందుకే శరీరాన్ని మన అదుపులో ఉంచుకుని శారీరక, మానసిక ప్రశాంతతను పొంతేందుకు చేసే విధానమే యోగ. యోగతో ఆరోగ్యం మన స్వాధీనంలో ఉంటుంది. శ్వాస ప్రక్రియ వలన ఆరోగ్యం స్థిరంగా ఉంటుంది. అలాగే మన జఠరం బాగా పనిచేసి అవయవాలు పనిచేయ డానికి దోహదపడుతుంది. ఇలాంటి యోగను ఏటా అంతర్జాతీయంగా జరుపుకోవాలన్న నిర్ణయం వల్ల ఇప్పుడు ప్రపంచ దేశాల్లో యోగా ప్రాముఖ్యతను గుర్తించారు. మన నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకుంటే ఆరోగ్యం మన అదుపులో ఉంటుంది. శరీరం అదుపులో ఉంటుంది. దీనిని ప్రతి ఒక్కరూ భాగం చేసుకుంటే జీవితం సుఖమయంగా సాగగలదు.

# నీట్ అడ్మిట్ కార్డుల్లో లోపాలు

**మహారాష్ట్ర విద్యార్థికి అరబ్ ఎమిరేట్స్ సెంటర్**

**ఖంగుతిన ఎటిఎకు సమాచారం ఇచ్చిన విద్యార్థి**

**పొరపాటును సవరించి, కొత్త కేంద్రం అలాట్‌కు హామీ**




**న్యూఢిల్లీ,జూన్20:** నీట్ రీ-ఎగ్జామ్‌కు సంబంధించి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ జారీ చేసిన అడ్మిట్ కార్డులో లోపాలు బయటపడ్డాయి. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన ఓ అభ్యర్థికి.. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని అబుధాబీలో పరీక్షా కేంద్రాన్ని కేటాయించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీనిపై స్పందించిన ఎన్‌టీఏ.. సమస్యను పరిష్కరిస్తున్నట్లు తెలిపింది పరీక్షకు ఒకరోజు ముందు ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. నీట్ రీటెస్టుకు సమయం దగ్గరపడుతోన్న నేపథ్యంలో అబ్దుల్లా మహ్మద్ తాలిబ్ అనే అభ్యర్థి.. శుక్రవారం సాయంత్రం తన అడ్మిట్ కార్డును డౌన్‌లోడ్ చేసుకున్నాడు. అందులో పరీక్షా కేంద్రాన్ని చూసి అవాక్కయ్యాడు. అబుధాబీలోని ఓ భారతీయ స్కూల్‌లో ఎన్‌టీఏ అతడికి పరీక్షా కేంద్రాన్ని కేటాయించింది. ఈ అడ్మిట్ కార్డుకు సంబంధించిన ఫొటో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. తాము ఇచ్చిన ఆప్షన్లలో అలాంటి కేంద్రం ఏదీ లేదని విద్యార్థి తండ్రి మీడియాతో పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఎన్‌టీఏ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. శనివారం సాయంత్రం 4 గంటల్లోపు కొత్త అడ్మిట్ కార్డు జారీ చేస్తామని తమకు హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. సమయం తక్కువగా ఉన్నందున నాగ్‌పూర్‌నే పరీక్షా కేంద్రంగా కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సంఘటనతో తన కొడుకు తీవ్ర ఆందోళనలో ఉన్నట్లు తెలిపారు. ఈ సమస్యపై ఎన్‌టీఏ కూడా స్పందించింది. సాంకేతిక లోపం వల్ల ఇలా జరిగినట్లు పేర్కొంది. సమస్యను పరిష్కరిస్తున్నామని.. కొన్ని గంటల్లోనే ఆ విద్యార్థికి పరీక్షా కేంద్రాన్ని కేటాయిస్తామని స్పష్టంచేసింది. కాగా.. అడ్మిట్ కార్డులో వ్యక్తిగత వివరాలు, పరీక్ష కేంద్రాలు ఇతర ముఖ్యమైన అంశాల్లో ఏమైనా లోపాలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఈసందర్భంగా ఎన్‌టీఏ అభ్యర్థులకు సూచించింది. ప్రశ్నపత్రం లీక్ నేపథ్యంలో రద్దయిన నీట్ ఎంట్రన్స్ పరీక్షను నేడు మరోసారి నిర్వహించనున్న విషయం తెలిసిందే. రీ-నీట్ అడ్మిట్ కార్డు డౌన్‌లోడ్ చేసుకుని చూస్తే జరిగిన పొరపాటు గురించి తెలిసిందని అబ్దుల్లా మొహమ్మద్ తాలిబ్ అనే విద్యార్థి తెలిపాడు. తాను భారత్‌లో ఉంటే తన పరీక్ష కేంద్రం మాత్రం యూఏఈలో ఉన్నట్టు అడ్మిట్ కార్డులో కనిపించిందని అన్నాడు. నాగ్‌పూర్‌లో పరీక్ష కేంద్రం కోసం అతడు దరఖాస్తు చేసినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ విషయం ఎన్‌టీఏ దృష్టికి తీసుకెళ్లగా సాంకేతిక సమస్య కారణంగా ఇలా జరిగిందని సంస్థ తెలిపినట్టు విద్యార్థి తండ్రి తెలిపారు. సమస్యను పరిష్కరిస్తామని, సవరించిన అడ్మిట్ కార్డును జారీ చేస్తామని పేర్కొన్నట్టు చెప్పారు. ఈ మేరకు ఎన్‌టీఏ నుంచి ఈమెయిల్ వచ్చిందని వెల్లడించారు.

# రాష్ట్రపతి ద్రౌపది ముర్మ జన్మదినోత్సవం


- **ఎక్స్ వేదికగా సిఎం చంద్రబాబు, పవన్ శుభాకాంక్షలు**



**అమరావతి,జూన్20:** శనివారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పుట్టినరోజు సందర్భంగా రాష్ట్రపతికి రాజకీయ ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ బర్త్ డే విషెస్ తెలియజేశారు. దేశానికి ద్రౌపది ముర్ము అందిస్తున్న సేవల్లో విజయం సాధించాలని సీఎం ఆకాంక్షించగా, నాయకులు కావాలనుకునే ప్రతి ఒక్కరికీ రాష్ట్రపతి ముర్ము నిజమైన స్ఫూర్తిదాయకమని పవన్ అన్నారు. 'భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు జన్మదిన శుభాకాంక్షలు. ఆమె జీవితం, ప్రజాసేవ దేశవ్యాప్తంగా లక్షలాది మందికి స్ఫూర్తినిస్తూనే ఉన్నాయి. ద్రౌపది ముర్ము మంచి ఆరోగ్యంతో ఉండాలని, దేశానికి ఆమె అందిస్తున్న గొప్ప సేవల్లో విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నాను' అంటూ చంద్రబాబు పోస్ట్ చేశారు. 'రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు. నగర్ పంచాయతీ కౌన్సిలర్‌గా సేవలందించడం నుంచి భారతదేశ ప్రథమ పౌరురాలిగా ఎదిగే వరకూ.. ఆమె సాగించిన అద్భుత ప్రయాణం, ప్రజాసేవకులు, నాయకులు కావాలనుకునే ప్రతి ఒక్కరికీ నిజమైన స్ఫూర్తిదాయకం. ఇది అట్టడుగు స్థాయి ప్రజాస్వామ్య బలానికి, అంకితభావంతో కూడిన ప్రజాసేవ శక్తికి నిదర్శనంగా నిలుస్తుంది. దేశ సేవలో ఆమెకు మంచి ఆరోగ్యం, దృఢత్వం, దీర్ఘాయుష్షును ప్రసాదించాలని జగన్నాథ స్వామిని ప్రార్థిస్తున్నాను' అంటూ ఎక్స్‌లో పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# స్వల్పంగా పెరిగిన బంగారం ధరలు

**హైదరాబాద్,జూన్20:** శనివారం బంగారం ధరలు పెరిగాయి. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారంపై 220 రూపాయలు.. 22 క్యారెట్ల బంగారంపై 200 రూపాయలు.. 18 క్యారెట్ల బంగారంపై 170 రూపాయలు పెరిగింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం.. ఉదయం 10 గంటల ప్రాంతంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 1,46,080 రూపాయల వద్ద.. 22 క్యారెట్ల బంగారం ధర 1,33,900 రూపాయల వద్ద.. 18 క్యారెట్ల బంగారం ధర 1,09, 560 రూపాయల వద్ద ట్రేడ్ అవుతోంది.



# నిందితులకు నీరాజనాలు!

ప్రజాస్వామ్యంలో అధికారాన్ని ప్రశ్నించడం పౌరుల హక్కు. ప్రభుత్వ వైఫల్యాలను నిలదీయడం ప్రతిపక్షాల బాధ్యత. కానీ, నేడు దేశంలో ప్రశ్న అడిగిన వారిపై దాడి చేయడం, దాడిచేసిన వారిని వీరులుగా కీర్తించడం, నిందితులకు పూలదండలు వేసి ఊరేగింపులు నిర్వహించడం రోజు రోజుకూ దేశంలో ఒక కొత్త రాజకీయ సంస్కృతిగా మారుతోంది. నీట్ పేపర్ లీకేజీ, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆందోళన, కేంద్ర విద్యామంత్రి రాజీనామా డిమాండ్, పలు రాష్ట్రాల్లో యువత నిరసనలు అధికార పార్టీని ఆద్యంతం కలవరపెట్టిన మాట నిజం. దీన్ని జీర్ణించు కోలేని కాషాయ మూక ఈ నెల పదిహేనున రాజస్థాన్‌లోని జైపూర్‌లో సీజేపీ చేపట్టిన ప్రదర్శనలో వీరంగం సృష్టించింది. అధ్యక్ష?్నడు అభిజిత్ దీప్కేపై దాడికి దిగింది. ప్రజాస్వామ్యంలో ప్రశ్నకు జవాబు చెప్పాల్సిన చోట భౌతికదాడిని ఆయుధంగా ఎంచుకోవడం ప్రమాద కరం.పోలీసులు ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు.కానీ అసలు వివాదం అక్కడితో ఆగలేదు. బెయిల్‌పై విడుదలైన నిందితులకు పూల దండలు వేసి స్వాగతించడం, మోటార్‌సైకిల్ ర్యాలీలు నిర్వహించడం, 'జై శ్రీరామ్', 'భారత్ మాతాకీ జై', 'హిందూ ఏక్తా జిందాబాద్' వంటి నినాదాలతో వారిని వీరులుగా చిత్రీకరించడం దేశవ్యాప్తంగా విమర్శలకు దారితీసింది. బెయిల్ అనేది న్యాయ ప్రక్రియలో ఒక భాగం మాత్రమే. అది నిర్దోషిత్వానికి ధ్రువీకరణ కాదు. అయినప్పటికీ నిందితులను సమాజ రక్షకులుగా, మత యోధులుగా ప్రదర్శించడం న్యాయవ్యవస్థకు, ప్రజాస్వా మ్యానికి, బాధితులకు అవమానం. మరింత ప్రమాదకర విషయం ఏమిటంటే, ఈ ఘటనలో నేరారోపణలపై కాకుండా నిందితుల మతపరమైన గుర్తింపుపై ప్రచారం జరగడం. ఇదొక్కటే కాదు, గత దశాబ్ద కాలంగా ఇలాంటి దృశ్యాలు దేశంలోని అనేక ప్రాంతాల్లో కనిపిస్తున్నాయి. గుజరాత్‌లో బిల్కిస్ బానోపై సామూహిక లైంగికదాడి, ఆమె కుటుంబ సభ్యుల హత్య కేసులో శిక్ష అనుభవిస్తున్న దోషులు విడుదలైనప్పుడు వారికి పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికిన ఘటన దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది.కొందరు వారికి మిఠాయిలు పంచి సన్మానించారు.

# ముగ్గురమ్మల స్వరూపం- త్రికూట పర్వత గుహలో వెలసిన వైష్ణోదేవి చరిత్ర ఇదే

వైష్ణోదేవి ఆలయం ప్రసిద్ధి చెందిన అమ్మవారి పుణ్యక్షేత్రం. ఈ పుణ్యక్షేత్రం వైష్ణవ దేవి కొండలపై నెలకొని ఉంది. హిందువులు వైష్ణవ దేవినే మాతా రాణి అని, వైష్ణవి అని కూడా సంభోదిస్తారు. వైష్ణోదేవి యాత్ర చాలామంది చేసి ఉంటారు కానీ అందరికీ అమ్మవారి చరిత్ర గురించి తెలిసి ఉండకపోవచ్చు. ఈ కథనంలో వైష్ణో దేవి ఆలయంలో కొలువైన అమ్మవారి చరిత్ర గురించిన తెలుసుకుందాం.



**ముగ్గురమ్మలు మూర్తీభవించిన దేవిగా!**

తనను దర్శించిన భక్తులకు ధర్మార్థ కామ మోక్షాలు ప్రసాదించే జగజ్జననిగా వైష్ణో దేవి మాత పూజలందుకుంటోంది. ఈ చల్లని తల్లి దర్శనార్థం భక్తులు ఎక్కడెక్కడి నుంచో సంవత్సరం పొడుగునా అశేష సంఖ్యలో తరలి రావడం ఈ తల్లి మహిమకి నిదర్శనం. ఆ దేవిని దర్శించినవరెవరూ రిక్త హస్తాలతో వెను తిరగరని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

**వైష్ణోదేవి ఆలయం ఎక్కడుంది?**

వైష్ణోదేవి ఆలయం జమ్ము కశ్మీర్?లోని కాట్రా అనే ప్రదేశంలో పర్వత శిఖరాల్లో సముద్రమట్టానికి 5200 అడుగుల ఎత్తులో వెలసి ఉంది. త్రికూట పర్వత గుహలో వెలసిన వైష్ణోదేవి తన భక్తుల కోర్కెలు తీర్చే చల్లని తల్లి. అత్యంత పురాతనమైన ఈ ఆలయం ఏ యుగానికి చెందినదో ఆధారాలు లేవు. శాస్త్రవేత్తలు తమ పరిశోధనలో ఈ ఆలయం వున్న గుహ ఒక మిలియన్ సంవత్సరాల ప్రాచీనమైనదని కనుగొన్నారు.

**ఉత్తరాది వారి కొంగు బంగారమై విలసిల్లే ఈ దేవి**

వైష్ణోదేవి ప్రాశస్త్యం దక్షిణాదిలో అంత ఎక్కువగా కనబడదు. అందుకే అక్కడివారు ఈ దేవిని లక్ష్మీ స్వరూపమని కొందరు, పార్వతీ స్వరూపమని కొందరు చెబుతారు. నిజానికి మహాలక్ష్మి, మహాకాళీ, మహా సరస్వతి ఈ ముగ్గురి తేజోమయ స్వరూపమే ఈ తల్లి.

**వైష్ణోదేవి పవిత్ర గాథ**

పూర్వం జగన్మాత తాను అసుర సంహారంలో నిమగ్నమై ఉన్న సమయంలో భూలోకంలో ధర్మాన్ని రక్షించి, ప్రజలని కాపాడేందుకు మహాలక్ష్మి, మహాకాళి, మహా సరస్వతుల తేజస్సుతో ఒక శక్తిని ఆవిర్భవింప చేసింది. సంకల్పమాత్రం చేత అక్కడ అందమైన యువతి ప్రత్యక్షమైంది. వారు ఆ యువతిని భూలోకంలో ధర్మ సంరక్షణార్థం రత్నాకర సాగర్ అనే ఆయనకి పుత్రికగా విష్ణు అంశతో జన్మించి ధర్మ హిత కార్యాలు చేయమని, ఆధ్యాత్మికంగా ఉన్నత స్థాయికి చేరుకున్న తర్వాత శ్రీ మహా విష్ణువు లో ఐక్యం చెందుతావని చెబుతారు. ఆ మహాశక్తుల ఆదేశానుసారం రత్మాకరసాగర్ ఇంట జన్మించిన ఆ బాలిక వైష్ణవిగా పెరగసాగింది.

**చిరుప్రాయంలోనే తపస్సు**

వైష్ణవి చిన్నతనం నుంచి జ్ఞాన సముపార్జనలో లీనమైంది. తపస్సుతో తన జీవన ధ్యేయం సాధ్యమని తలచి అడవుల్లోకి వెళ్లి తపస్సు చేయసాగింది. అదే సమయంలో 14 సంవత్సరాలు అరణ్యవాసంలో వున్న శ్రీరామచంద్రుడు అక్కడికి వచ్చాడు. వైష్ణవి శ్రీరామచంద్రుణ్ణి ఆ శ్రీమహావిష్ణువుగా గుర్తించి, తనని ఆయనలో లీనం చేసుకోమని కోరింది. శ్రీరామచంద్రుడు దానికి తగిన సమయం కాదని, తన అరణ్యవాసం తర్వాత తిరిగి వైష్ణవి దగ్గరకు వస్తానని , ఆ సమయంలో ఆమె తనని గుర్తిస్తే తప్పక తనలో ఐక్యం చేసుకుంటానని తెలిపాడు.

**శ్రీరాముని గుర్తించని వైష్ణవి**

ఆ ప్రకారమే శ్రీరామచంద్రుడు అరణ్యవాసం, రావణవధానంతరం అయోధ్యకు తిరిగి వెళ్తూ ఆమె దగ్గరకు ఒక వృద్ధుడి రూపంలో వచ్చాడు. కానీ ఆ సమయంలో వైష్ణవి ఆయనని గుర్తించలేకపోతుంది. అందుకని భగవంతునిలో ఐక్యమయ్యే ఆవిడ కోరిక తీరలేదు. అప్పుడు బాధపడుతున్న వైష్ణవిని శ్రీరామచంద్రుడు ఓదార్చి, ఆమె తనలో ఐక్యమవటానికి తగిన సమయమింకా రాలేదని, కలియుగంలో తాను కల్కి అవతారం ధరిస్తానని, అప్పుడు ఆమె కోరిక నెరవేరుతుందని ధైర్యం చెప్పాడు. త్రికూట పర్వత సానువుల్లో ఆశ్రమం నెలకొల్పుకుని తపస్సు కొనసాగిస్తూ, ఆధ్యాత్మికంగా ఉన్నత శిఖరాలు అవరోహించమని, ప్రజల మనోభీష్టాలు నెరవేర్చి, ప్రజల కష్టాలు తీర్చమని ఆదేశించాడు. శ్రీరామచంద్రుని ఆజ్ఞానుసారం వైష్ణవి త్రికూట పర్వతసానువుల్లో ఆశ్రమాన్ని నెలకొల్పుకుని తన తపస్సు కొనసాగించింది. అనతికాలంలోనే ఆవిడ శక్తిని గ్రహించిన ప్రజలు అమ్మవారి దర్శనం కోసంఆవిడ కోరిక తీరలేదు. అప్పుడు బాధపడుతున్న వైష్ణవిని శ్రీరామచంద్రుడు ఓదార్చి, ఆమె తనలో ఐక్యమవటానికి తగిన సమయమింకా రాలేదని, కలియుగంలో తాను కల్కి అవతారం ధరిస్తానని, అప్పుడు ఆమె కోరిక నెరవేరుతుందని ధైర్యం చెప్పాడు. త్రికూట పర్వత సానువుల్లో ఆశ్రమం నెలకొల్పుకుని తపస్సు కొనసాగిస్తూ, ఆధ్యాత్మికంగా ఉన్నత శిఖరాలు అవరోహించమని, ప్రజల మనోభీష్టాలు నెరవేర్చి, ప్రజల కష్టాలు తీర్చమని ఆదేశించాడు. శ్రీరామచంద్రుని ఆజ్ఞానుసారం వైష్ణవి త్రికూట త్రికూట పర్వతానికి రావడం మొదలు పెట్టారు.

**భైరవ నాథుని ఆగడాలు**

కొంతకాలం తర్వాత గోరఖ్ నాథ్ అనే తాంత్రికుడు వైష్ణవి గురించి, ఆమె దీక్ష గురించి తెలుసుకుని, శ్రీరామచంద్రుడు ఆదేశించిన ప్రకారం ఆమె ఆధ్యాత్మికంగా ఉన్నత శిఖరాలను అధిరోహించిందో లేదో తెలుసుకోవాలనే కుతూహలంతో, వివరాలు తెలుసుకోవడానికి అత్యంత సమర్థుడైన తన శిష్యుడు భైరవనాథుణ్ణి పంపాడు. భైరవ నాథుడు చాటుగా వైష్ణవిని గమనించాడు. తపస్విని అయినా వైష్ణవి ఎల్లప్పుడు ధనుర్బాణాలు ధరించి వుండటం, ఆవిడకి రక్షగా లంగూర్, ఒక భయంకర సింహం వుండటం గమనించాడు. భైరవ నాథుడు వైష్ణవి అందానికి ముగ్ధుడై తనని వివాహం చేసుకోమని ఆమెని వేధించసాగాడు.

**భైరవ సంహారం**

ఒకానొక సమయంలో భైరవుడు వైష్ణవిపట్ల అమర్యాదగా ప్రవర్తించాడు. అయితే ఈ వివాదం పెద్దది చేసి భైరవుని శిక్షించటం ఇష్టంలేని వైష్ణవి తన తపస్సును కొనసాగించటానికి వాయురూపంలో పర్వతాల్లోకి వెళ్తుంది. కానీ భైరవుడు ఆమెని వదలకుండా వెంటాడుతాడు. ఆ సమయంలో త్రికూట పర్వతంలోని ఈ పవిత్ర గుహ బయట దగ్గర తనను వెంటాడుతున్న భైరవుడి తలని ఒక్క వేటుతో నరుకుతుంది. తెగిన భైరవుడి తల కొంచెం దూరంలో ఒక పర్వత శిఖరం మీద పడింది. అప్పుడు తన తప్పుతెలుసుకున్న భైరవుడు వైష్ణవీదేవిని క్షమించమని ప్రార్థిస్తాడు. మాత దయతలచి తన భక్తులంతా తన దర్శనం తర్వాత భైరవుణ్ణి దర్శిస్తారని, అప్పుడే వారి యాత్ర సంపూర్ణమవుతుందని వరమిస్తుంది.

**ముగ్గురమ్మల స్వరూపం**

తదనంతరం వైష్ణవి తన ధ్యేయం నెరవేర్చుకోవడానికి, శ్రీ మహావిష్ణువు లో లీనమయ్యే అర్హత సంపాదించుకోవడానికి, త్రికూట పర్వతం పైన గుహలో లక్ష్మి, సరస్వతి, పార్వతి స్వరూపాలైన 3 తలలతో 5.5 అడుగుల ఎత్తయిన రాతి రూపం ధరించింది. వైష్ణోదేవి గుహాలయం లో మనకి కనిపించే మూడు రాతి రూపాలను స్థానిక ప్రజలు పిండి అంటారు. వాటినే మహాకాళీ, వైష్ణో దేవి, మహా సరస్వతి గా అక్కడి పండితులు చెప్పారు ఇదే వైష్ణో దేవి కథ. వైష్ణోదేవి యాత్ర చేయాలనుకునే వారు కాలినడకన, డోలీల్లో, గుర్రాలపై కొండమీదకు చేరుకోవచ్చు. ఎత్తైన కొండల మీద నుంచి కనిపించే అందమైన ప్రకృతి దృశ్యాలు ప్రయాణం బడలికను తెలియనీయదు. యాత్ర మొత్తం భక్తులు 'జై మాతాకీ' అంటూ లయ బద్ధంగా చేసే యాత్రికుల్లో ఎనలేని ఉత్సాహాన్ని కలిగిస్తాయి.

# దైవ దర్శనం తర్వాత శఠగోపం తలపై పెడతారు- ఎందుకో తెలుసా?

సాధారణంగా మనం దేవాలయాలకు వెళ్లినప్పుడు దైవ దర్శనం తరువాత తీర్థ ప్రసాదాలు స్వీకరించాక ఆలయ అర్చకులు శఠారి మన శిరసుపై ఉంచి ఆశీర్వదిస్తారు. ఒక్కోసారి కొందరు ఈ శఠారి తీసుకోకుండానే వెళ్లిపోతుంటారు. కానీ దైవ దర్శనం తరువాత తప్పకుండా తీసుకోవాలని శాస్త్రం చెబుతోంది.



**శఠగోపం అంటే?**

దేవాలయాల్లో దైవ దర్శనం అనంతరం పూజారి మన శిరసుపై ఉంచి ఆశీర్వదించే లోహపు కిరీటాన్ని శఠారి అంటారు. ఈ శఠారి రాగితో కానీ, వెండితో కానీ తయారుచేసినదై ఉంటుంది. శఠారి పైభాగంలో భగవంతుని పాద ముద్రలు ఉంటాయి. అందుకే శఠారి తీసుకునే సమయంలో సాక్షాత్తు భగవంతుని పాదాలు శిరస్సున ధరిస్తున్నామన్న పవిత్ర భావనతో శిరసు వంచి శఠారి స్వీకరించడం ఆలయ మర్యాద, ప్రతి ఒక్కరు తప్పకుండా పాటించాల్సిన సంప్రదాయం.

**శఠారికి ఎందుకంత పవిత్రత**

శఠగోపం సాధారణం వెండి లేదా రాగి వంటి ఉత్తమమైన లోహాలతో తయారు చేస్తారు. ఈ శఠారిని ఎల్లవేళలా భగవంతుని పాదాల వద్ద ఉంచడం వలన దైవశక్తిని నిక్షిప్తం చేసుకుంటుంది. అంతేకాదు గర్భాలయంలో అర్చకులు పఠించే వేద మంత్రోచ్చారణల వలన ఏర్పడే శక్తి తరంగాల ప్రకంపనలు కూడా తనలో నిక్షిప్తం చేసుకుని మరింత శక్తివంతంగా మారుతుంది. ఈ శఠగోపాన్ని పూజారి మన శిరసుపై ఉంచగానే అందులోని దివ్య శక్తులు మన శిరసులోని సహస్రార చక్రం ద్వారా శరీరంలోకి ప్రసరించి మానసిక ప్రశాంతత చేకూరుతుంది. అందుకే ఆలయాలకు వెళ్లినప్పుడు శఠారి తీసుకోవడం తప్పనిసరి అని పురాణాలు చెబుతున్నాయి.

**దివ్యానుభూతితో కంపించే శరీరం**

చాలా మంది దేవుని దర్శనం చేసుకుని వచ్చిన పని అయిపోయిందని చక చకా వెళ్ళి ఏదో ఏకాంత నిర్మల ప్రదేశం చూసుకొని కూర్చుంటారు. కొద్దిమంది మాత్రమే ఆగి, శఠగోపం పెట్టించుకుంటారు. శఠగోపం మన నెత్తిన పెట్టగానే ఏదో తెలియని దివ్యానుభూతితో శరీరం కంపించి, మానసిక ఉల్లాసం కలుగుతుంది.

**శఠగోపం కాదు 'శఠగోప్యం'**

శఠగోపం అసలు పేరు శఠగోపం అంటే 'అత్యంత గోప్యమైనది' లేదా రహస్యమైనది అని అర్థం. శఠగోపాన్ని తలమీద ఉంచినపుడు శరీరంలో ఉన్న విద్యుత్, దాని సహజత్వం ప్రకారం శరీరానికి లోహం తగిలినపుడు విద్యుదావేశం జరిగి, మనలోని అధిక విద్యుత్ బయటికెళుతుంది. తద్వారా శరీరంలో ఆందోళన, ఆవేశమూ తగ్గుతాయి. అందుకే శఠగోపాన్ని శఠగోప్యం అని కూడా అంటారు.

**శఠగోపం దేవుని దీవెన**

ఆలయ పూజారి శఠగోపాన్ని మన శిరసుపై ఉంచినప్పుడు మన మనసులో ఉన్న కోరికను భగవంతునికి మానసికంగానే తెలపాలి. భగవంతుని పాదాలను నేరుగా తాకలేని భక్తులకు, ఈ శఠగోపం ద్వారా భగవంతుని పాద స్పర్శను లభించడం వలన ఆ దేవదేవుని అనుగ్రహం తో మన అభీష్టాలు సిద్ధిస్తాయని శాస్త్రం చెబుతోంది.

**శఠగోపం స్వీకరించేటప్పుడు పాటించాల్సిన నియమాలు**

ఆలయ పూజారి శఠగోపాన్ని మన శిరసుపై ఉంచేటప్పుడు మనసులోని కోరికను భగవంతునికి విన్నవిస్తూ, చేతులు కట్టుకొని, శిరసు వంచి, ఏకాగ్రతతో భగవన్నామం స్మరిస్తూ పవిత్రమైన భావనతో శఠగోపాన్ని పెట్టించుకోవాలి. తీర్థ ప్రసాదాలు స్వీకరించిన తర్వాత మాత్రమే శఠగోపాన్ని పెట్టించుకోవాలి. మానవునికి సహజ శత్రువులైన కామ, క్రోధ, లోభ, మోహ, మదమత్స్యర్యాలకు ఇక నుంచి దూరంగా ఉంటామని భగవంతునికి ఎదుట ప్రమాణం చేయడమే శిరసు వచ్చి శఠగోపం తీసుకోవడం లోని అంతరార్థం.

**శఠగోపం ఒక అద్భుత సాధనం**

శఠగోపం ఒక సంప్రదాయం మాత్రమే కాదు మానవుడు తరించడానికి మన వేద పురాణాలు ఏర్పాటు చేసిన ఒక అద్భుత సాధనం. శఠగోపం వలన మానసిక ప్రశాంతత లభించడంతో పాటు, ఒత్తిడి తగ్గి ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. అందుకే ఆలయానికి వెళ్లినప్పుడు ఏకాగ్రతతో, భక్తితో శఠగోపాన్ని స్వీకరిస్తే జీవితంలో సానుకూల మార్పులు సంభవిస్తాయని విశ్వాసం. ఆ సమయంలో భగవంతుడిని నిస్వార్థంగా కోరికలు కోరితే నెరవేరుతాయని పండితులు చెబుతున్నారు. మనం కూడా ఆలయానికి వెళ్లినప్పుడు పరమ పవిత్రమైన శఠగోపాన్ని స్వీకరించి భగవంతుని అనుగ్రహాన్ని పొందుదాం.ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం

# టయోటా తొలి ఎలక్ట్రిక్ కారు వచ్చేసిందోచ్- ధర, ఫీచర్ల వివరాలు ఇవే!

టయోటా కిర్లోస్కర్ మోటార్ ఎట్టకేలకూ ఇప్పుడు తన 'టయోటా అర్బన్ క్రూయిజర్ ఎబెల్లా'ను భారత మార్కెట్లో అధికారికంగా విడుదల చేసింది. కంపెనీ ఈ ఏడాది ప్రారంభంలో దీన్ని ఆవిష్కరించగా సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఇప్పుడు ప్రారంభించింది. ఇది కంపెనీ నుంచి వచ్చిన తొలి ఎలక్ట్రిక్ కారు. ఈ కారును టాప్-స్పెక్ జు3 వేరియంట్‌లో రూ. 23.60 లక్షల (ఎక్స్-షోరూమ్) ధరకు పరిచయం చేసింది.ఇందులో గమనించదగ్గ విషయం ఏంటంటే, కంపెనీ ప్రస్తుతం కేవలం టాప్-స్పెక్ మోడల్ ధరను మాత్రమే ప్రకటించింది. దీని దిగువ శ్రేణి వేరియంట్లైన జు2 ధరలను మాత్రం ఇంకా వెల్లడించలేదు. దీంతో టయోటా ఇతర వేరియంట్లను దశల వారీగా విడుదల చేయాలని యోచిస్తున్నట్లుగా టెక్ నిపుణులు భావిస్తున్నారు.ఈ మిడ్-సైజ్ టయోటా భాగస్వామ్య సంస్థ అయిన మారుతి సుజుకి ఇ-విటారా రీబ్యాడ్జ్ వెర్షన్. సుజుకి ఇ-విటారా మోడల్ ఇప్పటికే భారతదేశంలో గత కొంతకాలంగా విక్రయానికి అందుబాటులో ఉంది. అయితే ఆసక్తికరంగా, టయోటా ఎబెల్లా జు3 గ్రేడ్‌తో పోలిస్తే ఇ-విటారా ఆల్ఫా వేరియంట్ ధర సుమారు రూ. 3.6 లక్షలు తక్కువతో రూ. 20.1 లక్షలు (ఎక్స్-షోరూమ్) గా ఉంది.స్పెసిఫికేషన్లు, ఫీచర్ల పరంగా ఈ రెండు మోడళ్లు దాదాపు ఒకేలా ఉండటంతో పాటు ఒకే అసెంబ్లీ లైన్‌పై తయారవుతున్నప్పటికీ టయోటా ఎబెల్లా ధర అధికంగా ఉండటం కాస్త విస్తు కలిగిస్తుంది.టయోటా అర్బన్ క్రూయిజర్ ఎబెల్లా పవర్‌ట్రెయిన్: కంపెనీ ఈ కొత్త ఎబెల్లా మోడల్?ను రెండు



బ్యాటరీ ఆప్షన్లతో పరిచయం చేసింది. ఒకటి 49 నియూనిట్ కాగా, మరొకటి 61 సామర్థ్యం గల పెద్ద బ్యాటరీ ప్యాక్. ఎబెల్లా జు3 వేరియంట్ కేవలం ఈ పెద్ద బ్యాటరీ ప్యాక్‌తో మాత్రమే లభిస్తుంది. ఇది ఒకే ఎలక్ట్రిక్ మోటారుకు శక్తిని అందిస్తుంది. ఈ ఎలక్ట్రిక్ మోటారు 172 ఎప్త్రజూ పవర్, 193 చీఎ పీక్ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది.మైలేజీ విషయానికి వస్తే, ఈ సెటప్‌తో టయోటా ఎబెల్లాను ఒక్కసారి ఛార్జ్ చేస్తే గరిష్ఠంగా 543 కిలోమీటర్ల దూరం ప్రయాణించగలదు. ప్రస్తుతం గ్లోబల్ మార్కెట్లో ఈ వాఖఎ డ్యూయల్-మోటార్ సెటప్, ఆల్-వీల్ డ్రైవ్ ఆప్షన్‌తో కూడా అందుబాటులో ఉంది. కానీ, భారతీయ వినియోగదారులు ఈ వెర్షన్ కోసం మరికొంత కాలం వేచి చూడక తప్పదు. ప్రస్తుతానికైతే ఇది భారత మార్కెట్లోకి అందుబాటులోకి రావడం లేదు.టయోటా అర్బన్ క్రూయిజర్ ఎబెల్లా భద్రతా ఫీచర్లు: ఇది ఏడు ఎయిర్‌బ్యాగ్‌లు, , బ్రేక్ అసిస్ట్, 360-డిగ్రీల కెమెరా సహా అనేక ఇతర ఫీచర్లతో వస్తుంది. కంపెనీ ఈ వాహనానికి 8 ఏళ్ల బ్యాటరీ వారంటీ, అష్యూర్డ్ బైబ్యాక్ ఆప్షన్, బ్యాటరీ-యాజ్-ఎ-సర్వీస్ (దీఝుూ) ఆప్షన్, ఆకర్షణీయమైన ఫైనాన్స్ స్కీమ్‌లను కూడా అందిస్తోంది.

# "షుగర్, బీపీ" కంట్రోల్లో ఉండాలా? - నిపుణులు ఏం చెప్తున్నారంటే!

సంపూర్ణ ఆరోగ్యం సొంతమవ్వాలంటే ఆహారంతో పాటు వ్యాయామమూ అవసరమే. శారీరక శ్రమ దీర్ఘకాలిక వ్యాధులను దూరంగా ఉంచడంలో సహాయపడుతుంది. కొన్ని సాధారణ వ్యాయామాలు రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను నియంత్రణలో ఉంచడానికి, రక్త ప్రసరణను మెరుగుపరచడానికి, గుండెను బలోపేతం చేయడానికి సహాయపడతాయి. ఈ క్రమంలో ఆరోగ్యంగా ఉండటానికి చాలామంది ఒకే రకమైన వ్యాయామంపై దృష్టి పెట్టితే సరిపోతుందని భావిస్తారు. కానీ, ఏరోబిక్, స్ట్రెంత్, బ్యాలెన్స్ శిక్షణ కలయిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని పలు అధ్యయనాల్లో వెల్లడైంది. మరి, అదెలాగో ఇప్పుడు తెలుసుకుందాం!బ్రిస్క్ వాకింగ్ : చాలామంది నడక వల్ల కలిగే ప్రయోజనాలను తక్కువగా అంచనా వేస్తారు. కానీ, రోజుకు కనీసం 30 నిమిషాల పాటు వేగంగా నడవడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయంటున్నారు నిపుణులు. ఇలా నడిస్తే బీపీ అదుపులో ఉండటంతో పాటు చెడు కొలెస్ట్రాల్ తగ్గిపోతుందని చెబుతున్నారు. అలాగే, ఇన్సులిన్ నిరోధకతను తగ్గిస్తుందట. రోజు గంటసేపు నడవడం వల్ల డయాబెటిస్ వచ్చే ప్రమాదం తగ్గడమే కాకుండా, శరీరంలోని బెల్లీ ఫ్యాట్ తగ్గించుకోవడానికి కూడా సహాయపడుతుంది. ఈ క్రమంలో భోజనం చేసిన తర్వాత 10 నిమిషాలు పాటు నడవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు స్థిరంగా ఉండటానికి తోడ్పడుతుంది. ఇది హృదయ స్పందన రేటును పెంచుతుందని, రక్త సరఫరాను మెరుగుపరుస్తుందని, రక్తపోటును తగ్గిస్తుందని పేర్కొంది.మీకు నిత్యం 'అజీర్తిగా' అనిపిస్తోందా? - అయితే మీలో 'ఆ సమస్య' ఉండొచ్చుట!స్ట్రెంత్ ట్రెయినింగ్ : చాలామంది స్ట్రెంత్ ట్రెయినింగ్ అంటే కేవలం కండరాలను, బలాన్ని పెంచుకోవడానికి బరువులు ఎత్తడం మాత్రమే అనిపిస్తుంది. కానీ, ఇది రక్తప్రవాహంలో చేరే గ్లూకోజ్?ను శరీరం సమర్థవంతంగా ఉపయోగించుకోవడానికి సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు. తద్వారా రక్తంలో అధిక చక్కెర స్థాయిలు వల్ల



గుండెపై పడే ఒత్తిడి తగ్గుతుందని వివరిస్తున్నారు. ఈ క్రమంలో టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారిలో క్రమం తప్పకుండా చేసే స్ట్రెంత్ ట్రెయినింగ్ వల్ల ూ1జ స్థాయిలు మెరుగుపడతాయని, చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇది బరువు తగ్గడానికి కూడా ఎంతో ప్రభావవంతంగా పనిచేస్తుంది.యోగా : యోగ వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ఇది తక్కువ తీవ్రత కలిగిన శారీరక కదలికలు, ధ్యానం, శ్వాస నియంత్రణను సమన్వయం చేస్తుంది. తద్వారా మనసుకి, శరీరానికి మధ్య అనుసంధానాన్ని మెరుగుపరుస్తుంది. క్రమం తప్పకుండా యోగా సాధన చేయడం వల్ల ఒత్తిడి తగ్గుతుంది. రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. ముఖ్యంగా, బీపీ మందులు వాడే వారికి ఇది ఎంతో సహాయపడుతుంది.హై-ఇంటెన్సిటీ ఇంటర్వెల్ ట్రెయినింగ్ : ఇందులో కొద్దిసేపు అత్యంత తీవ్రమైన వ్యాయామాలు, ఆ తర్వాత ఎక్కువసేపు తక్కువ తీవ్రత కలిగిన ఎక్సర్?సైజ్?లను మార్చి మార్చి చేస్తారు. ఇలా చేయడం వల్ల మధుమేహం వచ్చే ప్రమాదం 40 శాతం తగ్గుతుందని చెబుతారు. ఈ క్రమంలో మధుమేహం ఉన్నవారిలో ఈ రకమైన శిక్షణ వల్ల మంచి ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు. ఇది గుండె ఆరోగ్యానికి కూడా గణనీయమైన ప్రయోజనాలను చేకూరుస్తుందని చెబుతున్నారు. అలాగే, రక్తనాళాల పనితీరును మెరుగుపరుస్తుంది. వచ్చే ప్రమాదం చాలా తక్కువగా ఉంటుంది.నీటి వ్యాయామాలు : నీటిలో చేసే వ్యాయామాలు కేవలం వినోదం లేదా విశ్రాంతి కోసం మాత్రమే కాదు. అవి మొత్తం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయంటున్నారు. ఎలాగంటే, 45 నిమిషాల పాటు ఈత కొట్టడం వల్ల రక్తంలో గ్లూకోజ్ స్థాయి, రక్తపోటును తగ్గించుకోవచ్చు. మధుమేహం ఉన్నవారికి లేదా మధుమేహం వచ్చే ప్రమాదం ఉన్నవారికి, ఇది కొలెస్ట్రాల్ స్థాయిలను మెరుగుపరుస్తుందని, కేలరీలను కరిగిస్తుందని, ఒత్తిడి స్థాయిలను తగ్గిస్తుందని పేర్కొంది.: ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సార్మెడీల సమావేశంలో పాల్గొన్న ఖానాపూర్ ఎమ్మెల్యే

- ఐటీడీఏ పీవోతో కలిసి ఆదివాసీ పెద్దల తరపున అడవి బిడ్డల సమస్యలు తెలుసుకున్న వెడ్మ బొజ్జు పటేల్



**ఖానాపూర్ జూన్ 20,ఉట్నూర్ :** మండల కేంద్రంలోని ఉమ్మడి జిల్లా సార్మెడీలతో సమావేశంలో ఐటిడిఎ పీవో తో కలిసి సమస్యలు తెలుసుకున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్,ఎమ్మెల్యే కి మరియు పీవో గారికి ఆదివాసీ సార్మెడీలు వారి సమ స్యలు వివరించారు,ఆదివాసీ యువతకు ఉద్యోగాలు, మరియు ప్రత్యేక నైపుణ్య శిక్షణ తరగతులు ఏర్పాటు చేసి ఉద్యోగాలు కల్పించాలని వారు కోరారు,ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ ఆదివాసీలు గోండు,మరియు కోలాం భాషలో వారి సమస్య లను అధికారులకు అర్థమయ్యేలా స్తానిక భాష పైన అవగాహన ఉన్న వారిని ట్రాన్స్ లెటర్ ను నియమించాలని పీవో కి సూచించారు,వారు తెలిపిన సమస్యలను అధికారులకు అర్థమయ్యేలా ఎమ్మెల్యే వివరించారు, ఆదివాసీ యువతకు ఉద్యోగాల కల్పన,ఇప్పపువ్వు ప్రత్యేకత,ఏజెన్సీ లో ఆరోగ్య సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని,వ్యవసాయ అబివృద్ధి కొరకు మరియు ఫారెస్ట్ అధికారులు అటవీ ఆంక్షల పేరున ఆదివాసీలు పడుతున్న ఇబ్బందుల గురించి అధికారులకు వివరించిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు వాటి పరిష్కారానికి కృషి చేయాలని,అడవి బిడ్డల పక్షాన తాను నిలుస్తానని సమస్య పరిష్కారానికి రాష్ట్ర స్తాయి అధికారులను కలుస్తాం అని అన్నారు. కొలాంలు స్వయం ఉపాధి కొరకు అటవీ నుండి వెదురు బొంగు ద్వారా ఉపాధి పొందే అవకాశాన్ని అటవీ అధికారులు అడ్డు ఒడి వారి ఉపాధికి అడ్డుపడి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని అటవీ అధికారులను,మరియు ఐటీడీఏ పీవోకి సూచించారు.ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో,జిల్లా సర్మేడీలు,ఆదివాసీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# రాంపల్లి 'డెంజర్ కర్వ్' సమస్యపై జీవన్ రెడ్డి తక్షణ స్పందన!

- మలుపు వద్ద తరచూ ప్రమాదాలపై స్థానికుల ఆందోళన
- కాంట్రాక్టర్‌తో మాట్లాడి భద్రతా ఏర్పాట్లకు ఆదేశం





**నాగారం, జూన్ 20:** నాగారం డివిజన్ పరిధిలోని రాంపల్లి సాహితి కాలనీలో ప్రమాదకరంగా మారిన రోడ్డు మలుపు (కర్వ్) సమస్యపై కౌకుంట్ల జీవన్ రెడ్డి తక్షణమే స్పందించారు. ఈ మలుపు కారణంగా కాలనీలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కాలనీవాసులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సమస్య తీవ్రతను గుర్తించిన జీవన్ రెడ్డి.. ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే సంబంధిత కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఇక్కడ జరుగుతున్న ప్రమాదాల గురించి వివరించి, తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మలుపు వద్ద వాహనదారులకు హెచ్చరిక బోర్డులు, అవసరమైన చోట రేడియం ఇండికేటర్లు వంటి భద్రతా ఏర్పాట్లు చేయాలని కోరారు. ప్రజల ప్రాణాలతో ముడిపడి ఉన్న సమస్య కాబట్టి, ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సూచించారు.

**స్థానికుల భద్రతే మా ప్రాధాన్యత..**

ఈ సందర్భంగా కౌకుంట్ల జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. స్థానిక ప్రజల, వాహనదారుల భద్రతకే తాము మొదటి ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు. ప్రమాదకరమైన ఈ రోడ్డు మలుపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే వరకు కాంట్రాక్టర్‌తో పాటు సంబంధిత అధికారులతో ఫాలోఅప్ చేస్తామని హామీ ఇచ్చారు. సమస్యను వెంటనే పరిష్కరిస్తామని భరోసా ఇవ్వడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ కాలనీస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్, వైస్ ప్రెసిడెంట్ ప్రసాద్, సాహితి కాలనీ అధ్యక్షులు రవీందర్ రెడ్డి మరియు స్థానిక కాలనీవాసులు, ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# లివర్ ఆరోగ్యానికి కాఫీ మేలు చేస్తుందా

## బ్లాక్ కాఫీ వల్ల ఉపయోగాలు ఏమిటి..?



ప్రపంచవ్యాప్తంగా ఫ్యాటీ లివర్ సమస్య వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో, రోజువారీ ఆహారపు అలవాట్లలో చిన్న మార్పులు కూడా కాలేయ ఆరోగ్యంపై సానుకూల ప్రభావం చూపిస్తాయని నిపుణులు చెబుతున్నారు. అలాంటి వాటిలో బ్లాక్ కాఫీ ఒకటి. ఉదయం నిద్రలేవగానే చాలామంది తాగే ఈ పానీయం కేవలం చురుకుదనాన్ని పెంచడానికే కాకుండా కాలేయాన్ని రక్షించడంలో కూడా సహాయపడుతుందని తాజా సమాచారం సూచిస్తోంది. నియమితంగా కాఫీ తాగే వ్యక్తుల్లో ఫ్యాటీ లివర్ వ్యాధి వచ్చే ప్రమాదం తక్కువగా ఉండటంతోపాటు, ఇప్పటికే ఈ సమస్య ఉన్నవారిలో వ్యాధి పురోగతి నెమ్మదిగా సాగుతుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. అలాగే కాలేయంలో మచ్చలు ఏర్పడే ఫైబ్రోసిస్ ప్రమాదాన్ని తగ్గించడంలో కూడా కాఫీ ఉపయోగపడుతుందని వారు వివరిస్తున్నారు.

**లివర్ ఫ్రెండ్లీ పానీయం..**


కాఫీ కాలేయానికి మేలు చేయడానికి ప్రధాన కారణం ఇందులో ఉండే సహజ సమ్మేళనాలే. ముఖ్యంగా క్లోరోజెనిక్ యాసిడ్, కెఫిన్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలో వాపులను తగ్గించే లక్షణాలను కలిగి ఉంటాయి. ఇవి కణాలను దెబ్బతినకుండా కాపాడటంతోపాటు జీవక్రియలను మెరుగుపరచడంలోనూ సహాయపడతాయి. శరీరంలోని అన్ని ప్రధాన జీవక్రియలలో కాలేయం కీలక పాత్ర పోషిస్తుంది. కాబట్టి కాఫీలోని యాంటీ ఆక్సిడెంట్లు వాపును నియంత్రించడం, జీవక్రియలను మెరుగుపరచడం ద్వారా కాలేయ ఆరోగ్యానికి పరోక్షంగా మద్దతు ఇస్తాయి. అందుకే బ్లాక్ కాఫీని లివర్-ఫ్రెండ్లీ పానీయంగా పరిగణిస్తారు. అయితే కాఫీ మాత్రమే ఫ్యాటీ లివర్ సమస్యకు పరిష్కారం కాదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ముఖ్యంగా నాన్-ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ వ్యాధి అధిక బరువు, శారీరక శ్రమ లేకపోవడం, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, మధుమేహం వంటి కారణాలతో ముడిపడి ఉంటుంది. ఈ పరిస్థితుల్లో కాలేయంలో అధిక కొవ్వు పేరుకుపోయి వాపు, మచ్చలు, తీవ్రమైన సందర్భాల్లో కాలేయ వైఫల్యానికి కూడా దారితీస్తుంది. కాబట్టి కాఫీ తాగడం వల్ల మాత్రమే ఫ్యాటీ లివర్ పూర్తిగా తగ్గిపోతుందని భావించడం సరైంది కాదు. సమతుల ఆహారం, క్రమం తప్పకుండా వ్యాయామం, బరువు నియంత్రణ, మద్యం వినియోగాన్ని తగ్గించడం, వైద్య పరీక్షలు చేయించుకోవడం వంటి అంశాలు కూడా అంతే ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు.

**బ్లాక్ కాఫీ మేలు..**

కాఫీ ఎంపిక విషయంలో కూడా జాగ్రత్త అవసరం. పాలు కలపకుండా బ్లాక్ కాఫీ తాగడం ఉత్తమమని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా అధిక చక్కెర, సిరప్‌లు, విప్డ్ క్రీమ్ కలిపిన కాఫీ పానీయాలను నివారించాలని సూచిస్తున్నారు. ఇవి బరువు పెరగడానికి, జీవక్రియ సమస్యలకు కారణమై ఫ్యాటీ లివర్ పరిస్థితిని మరింత తీవ్రతరం చేసే అవకాశం ఉంటుంది. సాధారణంగా ఆరోగ్యవంతులైన పెద్దలు రోజుకు రెండు నుంచి మూడు కప్పుల బ్లాక్ కాఫీ తాగవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. అయితే కెఫిన్‌కు సున్నితంగా స్పందించే వారు, గర్భిణులు, గుండె లేదా ఊపిరితిత్తుల వ్యాధులు ఉన్నవారు, ఆందోళన సమస్యలు లేదా నిద్రలేమితో బాధపడేవారు, కొన్ని మందులు వాడుతున్నవారు కాఫీ పరిమాణాన్ని పెంచే ముందు వైద్యుల సలహా తీసుకోవడం మంచిది. కెఫిన్ వినియోగాన్ని తగ్గించాలని భావించే వారికి డీకెఫినేటెడ్ కాఫీ కూడా ఒక ప్రత్యామ్నాయంగా ఉపయోగపడుతుంది. ఆరోగ్యకరమైన జీవనశైలితోపాటు పరిమిత మోతాదులో బ్లాక్ కాఫీ తీసుకోవడం కాలేయ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయకారిగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

## కొందరు మహిళలకు ముందస్తు మెనోపాజ్ ఎందుకు వస్తుంది

# సైంటిస్టులు ఏం చెబుతున్నారు..



గర్భధారణ సమస్యలు కేవలం సంతానం పొందడంలో ఇబ్బందులకే పరిమితం కావని, మహిళల దీర్ఘకాలిక ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని తాజా అధ్యయనం వెల్లడించింది. ప్రాథమిక వంధ్యత్వం (ప్రైమరీ ఇన్‌ఫెర్టిలిటీ) చరిత్ర ఉన్న మహిళలు ఇతర మహిళలతో పోలిస్తే రుతుక్రమం శాశ్వతంగా ఆగిపోయే దశ మెనోపాజ్‌ను ముందుగానే ఎదుర్కొనే అవకాశం ఎక్కువగా ఉంటుందని పరిశోధకులు గుర్తించారు. ఈ అధ్యయనం ఫలితాలు మహిళల పునరుత్పత్తి ఆరోగ్యం, భవిష్యత్తు ఆరోగ్య పరిస్థితుల మధ్య ఉన్న సంబంధంపై మరింత అవగాహన కల్పిస్తున్నాయి. మెనోపాజ్ మహిళల జీవితంలో సహజంగా సంభవించే జీవసంబంధ దశ. ఈ దశలో రుతుస్రావం పూర్తిగా నిలిచిపోవడంతోపాటు సంతానోత్పత్తి సామర్థ్యం కూడా ముగుస్తుంది. సాధారణంగా చాలా మంది మహిళలు 50 నుంచి 51 ఏళ్ల మధ్య మెనోపాజ్‌కు చేరుకుంటారు. అయితే 45 ఏళ్లలోపు మెనోపాజ్ రావడాన్ని ఎర్లీ మెనోపాజ్‌గా, 40 ఏళ్లలోపు రావడాన్ని ప్రీమేచ్యూర్ మెనోపాజ్‌గా పరిగణిస్తారు. ఈ రెండు పరిస్థితులు గుండె జబ్బులు, ఎముకల బలహీనత, జ్ఞాపకశక్తి సంబంధిత సమస్యల ప్రమాదాన్ని పెంచుతాయని ఇప్పటికే పలు అధ్యయనాలు సూచించాయి.

**ప్రాథమిక వంధ్యత్వం ఉంటే..**

ఈ పరిశోధనలో దాదాపు 700 మంది మహిళల ఆరోగ్య వివరాలను దీర్ఘకాలంగా పరిశీలించారు. వారిలో సగం మందికి ప్రాథమిక వంధ్యత్వం ఉన్నట్లు నిర్ధారణ అయింది. అంటే నిర్దిష్ట కాలం పాటు గర్భం దాల్చేందుకు ప్రయత్నించినప్పటికీ, గతంలో ఎప్పుడూ విజయవంతమైన గర్భధారణ జరగని మహిళలను ఈ వర్గంలో చేర్చారు. అధ్యయనంలో పాల్గొన్న మహిళల వివరాలను విశ్లేషించగా, ప్రాథమిక వంధ్యత్వం చరిత్ర ఉన్న మహిళలు సాధారణంగా ఇతర మహిళలతో పోలిస్తే సగటున ఒక సంవత్సరం ముందుగానే సహజ మెనోపాజ్‌కు చేరుకున్నట్లు తేలింది. ముఖ్యంగా కారణం తెలియని వంధ్యత్వం లేదా ఎండోమెట్రియోసిస్ కారణంగా వంధ్యత్వం ఎదుర్కొన్న మహిళల్లో 45 ఏళ్లకు ముందే మెనోపాజ్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. అయితే 40 ఏళ్లలోపు వచ్చే ప్రీమేచ్యూర్ మెనోపాజ్‌తో వంధ్యత్వానికి స్పష్టమైన సంబంధం కనిపించలేదు. అయినప్పటికీ ఎర్లీ మెనోపాజ్‌తో ఉన్న బలమైన సంబంధం నిపుణుల దృష్టిని ఆకర్షించింది.

**అండాల ఉత్పత్తి తగ్గితే..**

వంధ్యత్వం, ముందస్తు మెనోపాజ్ మధ్య సంబంధం ఎందుకు ఉంటుందనే అంశంపై శాస్త్రవేత్తలు ఇంకా పరిశోధనలు కొనసాగిస్తున్నారు. ఒకే రకమైన జీవసంబంధ కారణాలు ఈ రెండు పరిస్థితులకు దోహదపడే అవకాశం ఉందని వారు భావిస్తున్నారు. సాధారణంగా మహిళల అండాశయాల్లోని అండాల సంఖ్య వయసు పెరిగేకొద్దీ తగ్గిపోతుంది. కొంతమందిలో ఈ ప్రక్రియ వేగంగా జరిగితే సంతానోత్పత్తి సామర్థ్యం తగ్గడమే కాకుండా మెనోపాజ్ కూడా ముందుగానే వచ్చే అవకాశం ఉంటుంది. ఎండోమెట్రియోసిస్ వంటి సమస్యలు కూడా ఇందులో కీలక పాత్ర పోషిస్తాయని నిపుణులు చెబుతున్నారు. గర్భాశయ అంతర్గత పొరలాంటి కణజాలం గర్భాశయం వెలుపల పెరగడం వల్ల ఏర్పడే ఈ వ్యాధి వంధ్యత్వానికి కారణమవడమే కాకుండా ముందస్తు మెనోపాజ్ ప్రమాదాన్ని కూడా పెంచుతుందని గత పరిశోధనలు సూచించాయి.

**ఇతర అంశాలు..**

జన్యుపరమైన అంశాలు, హార్మోన్ల మార్పులు, శరీర అభివృద్ధి విధానం, జీవనశైలి వంటి అంశాలు కూడా వంధ్యత్వం, పునరుత్పత్తి వ్యవస్థ వృద్ధాప్య ప్రక్రియపై ప్రభావం చూపే అవకాశం ఉంటుందని పరిశోధకులు భావిస్తున్నారు. మెనోపాజ్ సమయం మహిళల భవిష్యత్తు ఆరోగ్యంపై గణనీయమైన ప్రభావం చూపుతుంది. మెనోపాజ్ ముందుగానే వస్తే ఈస్ట్రోజెన్ హార్మోన్ స్థాయిలు ఎక్కువ కాలం తక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. ఈ హార్మోన్ ఎముకలు, గుండె, మెదడు ఆరోగ్యాన్ని కాపాడటంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. అందువల్ల ముందస్తు మెనోపాజ్ గుండె సంబంధిత వ్యాధులు, ఆస్టియోపోరోసిస్, కొన్ని నాడీ సంబంధిత సమస్యల ప్రమాదాన్ని పెంచుతుంది. అందుకే ప్రాథమిక వంధ్యత్వం చరిత్ర ఉన్న మహిళలు మెనోపాజ్ లక్షణాలు లేదా రుతుక్రమంలో వచ్చే మార్పులపై అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే వైద్యులను సంప్రదించి తగిన సలహాలు, చికిత్సలు పొందాలని పరిశోధకులు సూచిస్తున్నారు.

# సర్పాలతో సావాసం

మహారాష్ట్రలోని షోలాపూర్ జిల్లాలో ఉంది షెత్‌ఫల్ గ్రామం. ప్రపంచవ్యాప్తంగా అత్యంత విచిత్రమైన, విస్మయపరిచే విశేషంతో.. 'పాముల గ్రామం'గా గుర్తింపు తెచ్చుకున్నది. ఎందుకంటే, ఈ గ్రామంలోని ప్రజలు అత్యంత విషపూరితమైన నాగుపాములతో కలిసి జీవిస్తారు. ఇక్కడి ఏ వీధిలో చూసినా, ఏ ఇంట్లో చూసినా కోకొల్లలుగా సర్పాలు దర్శనమిస్తాయి. ఇంటి అరుగు మొదలుకొని పొలం గట్ల దాకా.. ప్రతిచోటా పాములు నివసిస్తాయి. అయినా.. ఆ ఊరి జనం వాటిని చూసి భయపడరు. కనీసం కర్ర పట్టుకుని తరిమేయడానికి కూడా ప్రయత్నం చేయరు.

**కుటుంబ సభ్యులే!**

షెత్‌ఫల్ వాసులు పాములను సాక్షాత్తూ పరమశివుడి స్వరూపమని నమ్ముతారు. వాటిని అత్యంత భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. ఇలా కొన్ని తరాలుగా పాములను ప్రత్యక్ష దైవంగా భావిస్తున్నారు. అందుకే, అవి తమకు ఎలాంటి హానీ కలిగించవని చెబుతారు. వారి నమ్మకానికి తగ్గట్టే.. ఇప్పటివరకు ఈ గ్రామంలో ఒక్కరు కూడా పాము కాటుతో చనిపోలేదు. ఇక, ఇక్కడి ఇళ్లలో మనుషులతోపాటు పాములు కూడా స్వేచ్ఛగా తిరుగుతుంటాయి. వారితో కలిసి ఒకే మంచంపై పడుకుంటాయి. ఇక్కడి పిల్లలు కూడా బొమ్మలకు బదులుగా.. పాములతోనే ఆడుకుంటూ పెరుగుతారు. అందుకే, షేత్‌ఫల్ వాసులకు పాముల ప్రవర్తన, కదలికల గురించి బాల్యం నుంచే పూర్తి అవగాహన ఉంటుంది.

**పాములకు ప్రత్యేకంగా..**

పాములతో సహవాసం, వాటికి హాని తలపెట్టక పోవడం మాత్రమే కాదు.. ఇంటి నిర్మాణ సమయంలోనూ వీటికోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారు. ఏ సమయంలోనైనా పాములు రావడానికీ, స్వేచ్ఛగా విశ్రాంతి తీసుకోవడానికీ వీలుగా ఇళ్ల పైకప్పుల కింద, గోడలలో 'దేవస్థానం' లాంటి ఒక ప్రత్యేకమైన చిన్న స్థలాన్ని (కోటరీ) తప్పనిసరిగా నిర్మిస్తారు. వేసవిలో ఎండలు మండిపోతున్నా, శీతాకాలంలో చలి వేసినా.. పాములు నేరుగా ఈ ప్రత్యేక స్థలాల్లోకి వచ్చి సేదతీరుతాయి.


**సాహసీకుల క్యూ..**

ఈ పాముల ప్రపంచాన్ని చూసేందుకు సాహస పర్యాటకులు, వన్యప్రాణి ప్రేమికులు అమితాసక్తి చూపుతుంటారు. ఏటా వందల సంఖ్యలో షెత్‌ఫల్ గ్రామాన్ని సందర్శిస్తుంటారు. అయితే, ఇక్కడికి వచ్చే పర్యాటకులు కొన్ని నియమ నిబంధనలను పాటించాల్సి ఉంటుంది. పాములను తాకడం, పట్టుకోవడం, వాటితో సెల్ఫీలు దిగడం..



పూర్తిగా నిషేధం. అదే విధంగా, పాములను భయపెట్టడం, వాటికి హాని తలపెట్టడం లాంటివీ చేయకూడదు. షెత్‌ఫల్ గ్రామాన్ని సందర్శించాలంటే.. అక్టోబర్ నుంచి ఫిబ్రవరి వరకు అనుకూలంగా ఉంటుంది. ఈ సమయంలో ఇక్కడి వాతావరణం చల్లగా, ఆహ్లాదకరంగా ఉంటుంది. షోలాపూర్ నుంచి షెత్‌ఫల్ గ్రామం 60 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. దేశంలోని అన్ని ప్రధాన నగరాల నుంచి షోలాపూర్‌కు రవాణా సౌకర్యం ఉన్నది. ప్రకృతితో, వన్యప్రాణులతో మనుషులు ఎంతటి సామరస్యంతో జీవించవచ్చో చెప్పడానికి.. షెత్‌ఫల్ గ్రామం ఒక అద్భుతమైన ఉదాహరణగా నిలుస్తున్నది.

# థైరాయిడ్ సమస్యలు ఉన్నవారికి మేలు చేసే ఆహారాలు ఇవే..



థైరాయిడ్ గ్రంథి పరిమాణంలో చిన్నదైనా శరీరంలోని అనేక ముఖ్యమైన ప్రక్రియలను నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. జీవక్రియ (మెటబాలిజం), శక్తి స్థాయిలు, గుండె ఆరోగ్యం, శరీర ఉష్ణోగ్రత, మానసిక స్థితి, జుట్టు ఆరోగ్యం, హార్మోన్ల సమతుల్యత వంటి అంశాలు థైరాయిడ్ పనితీరుపై ఆధారపడి ఉంటాయి. థైరాయిడ్ సక్రమంగా పనిచేయాలంటే కొన్ని ముఖ్యమైన పోషకాలు శరీరానికి తగిన మోతాదులో అందడం అవసరం. ఈ పోషకాల లోపం థైరాయిడ్ హార్మోన్ల ఉత్పత్తి, వినియోగం, క్రియాశీలతపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. సెలీనియం థైరాయిడ్ గ్రంథిని రక్షించడంలో, థైరాయిడ్ హార్మోన్లను క్రియాశీల రూపంలోకి మార్చడంలో సహాయపడుతుంది. బ్రెజిల్ నట్స్, ట్యూనా చేప, సన్‌ఫ్లవర్ గింజలు, మష్రూమ్స్‌లో ఇది సమృద్ధిగా లభిస్తుంది.

**అయోడిన్, ఐరన్, జింక్..**

అయోడిన్ థైరాయిడ్ హార్మోన్ల తయారీకి అత్యంత అవసరమైన ఖనిజం. అయోడైజ్డ్ ఉప్పు, సముద్రపు పచ్చి మొక్కలు (సీ వీడ్), రొయ్యలు, కాడ్ చేప, గుడ్లు మంచి వనరులు. ఐరన్ శరీరం థైరాయిడ్ హార్మోన్లను సమర్థవంతంగా వినియోగించుకోవడంలో సహకరిస్తుంది. రాజగిరా (అమరాంత్), గుమ్మడికాయ గింజలు, గుడ్డు పచ్చసొన, ఆకుకూరల్లో ఇది ఎక్కువగా ఉంటుంది. జింక్ థైరాయిడ్ హార్మోన్ల ఉత్పత్తికి తోడ్పడటం తోపాటు రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తుంది. శనగలు, గుమ్మడికాయ గింజలు, జీడిపప్పు, హెంప్ గింజలు, ఓయిస్టర్ల ద్వారా జింక్ పొందవచ్చు. టైరోసిన్ అనే అమైనో ఆమ్లం థైరాయిడ్ హార్మోన్ల తయారీలో ఉపయోగపడుతుంది. గుడ్లు, చికెన్, చేపలు, పనీర్, నువ్వులగింజలు టైరోసిన్‌కు మంచి మూలాలు.

**విటమిన్ డి, ఎ, బి విటమిన్లు..**

విటమిన్ డి థైరాయిడ్ పనితీరుపై ప్రభావం చూపడంతోపాటు రోగనిరోధక వ్యవస్థకు మద్దతు ఇస్తుంది. సాల్మన్, సార్డిన్ చేపలు, గుడ్డు పచ్చసొన, యూవీ కిరణాలకు గురిచేసిన మష్రూమ్స్, ఫోర్టిఫైడ్ పాల ఉత్పత్తుల్లో ఇది లభిస్తుంది. మెగ్నీషియం క్రియారహిత థైరాయిడ్ హార్మోన్లను క్రియాశీల రూపంలోకి మార్చడంలో సహాయపడుతుంది. బాదం, పాలకూర, అవకాడో, బ్లాక్ బీన్స్, గుమ్మడికాయ గింజలు మంచి వనరులు. విటమిన్ ఎ థైరాయిడ్ హార్మోన్ల జీవక్రియను నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. చిలగడ దుంపలు, క్యారెట్లు, ఎర్ర క్యాప్సికం, కాలేయం (లివర్)లో ఇది సమృద్ధిగా ఉంటుంది. బి-విటమిన్లు శక్తి ఉత్పత్తి, జీవక్రియ ప్రక్రియలకు అవసరం. ఇవి థైరాయిడ్ నియంత్రించే ముఖ్యమైన శారీరక విధులకు మద్దతు ఇస్తాయి. న్యూట్రిషనల్ ఈస్ట్, పప్పుధాన్యాలు, సాల్మన్ చేప, ఆకుకూరల్లో బి-విటమిన్లు లభిస్తాయి. అయితే ఈ పోషకాలు థైరాయిడ్ ఆరోగ్యానికి ఉపయోగకరమైనప్పటికీ, ఇప్పటికే థైరాయిడ్ సంబంధిత సమస్యలు ఉన్నవారు లేదా ఆహారంలో పెద్ద మార్పులు చేయాలనుకునేవారు వైద్య నిపుణుల సలహా తీసుకోవడం మంచిదని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనాలు సీజ్

**- రవాణా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి : ఎస్సై తాజుద్దీన్**



**గోవిందరావుపేట,జూన్ 20**
రవాణా నిబంధనలు పాటించని వాహనాలను సీజ్ చేయనున్నట్లు పసర పోలీస్ స్టేషన్ ఎస్సై తాజుద్దీన్ హెచ్చరించారు. ట్రాక్టర్, కారు, ఆటో, ద్విచక్ర వాహనాల యజమానులు, డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.ఇప్పటికే ట్రాక్టర్, కారు, ఆటో, ద్విచక్ర వాహనాల యజమానులకు పలుమార్లు అవగాహన కల్పించడంతో పాటు కౌన్సిలింగ్ కూడా నిర్వహించినప్పటికీ కొందరిలో మార్పు కనిపించడం లేదని తెలిపారు. వాహనాలకు సంబంధించిన డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, పొల్యూషన్ సర్టిఫికేట్, ఫిట్‌నెస్ సర్టిఫికేట్ వంటి పత్రాలు తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు.అలాగే ట్రాక్టర్లు సహా అన్ని వాహనాల వెనుక భాగంలో రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. రేపటి నుంచి సరైన పత్రాలు లేని వాహనాలు, రేడియం స్టిక్కర్లు లేని ట్రాక్టర్లపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి వాటిని సీజ్ చేస్తామని ఎస్సై తాజుద్దీన్ స్పష్టం చేశారు.
ప్రజల భద్రతే లక్ష్యంగా ఈ చర్యలు చేపడుతున్నామని, ప్రతి ఒక్కరూ రవాణా నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

## మాటల్లో కాదు.. చేతల్లో చూపిన సర్పంచ్ సుమలత.

**- గత కొన్ని సంవత్సరాలుగా నిర్లక్ష్యానికి గురైన బజార్‌కు పునర్జీవం..**

**- ప్రజల ప్రశంసలు అందుకుంటున్న సర్పంచ్: సుమలత**



**గోవిందరావుపేట, జూన్ 19**
ప్రజా సమస్యల పరిష్కారంలో మాటలకు కాకుండా చేతలకు ప్రాధాన్యం ఇస్తూ పస్రా గ్రామపంచాయ తీ సర్పంచ్ భూక్య సుమలత మరోసారి తన ప్రత్యేకతను చాటుకున్నారు. గ్రామపంచాయతీ పరిధిలోని ఐదవ వార్డులో ఉన్న ఏడుకొండలు బజార్ ప్రాంతాన్ని రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని శుక్రవారం మొరంతోలించి శుభ్రపరిచారు.సర్పంచ్ భూక్య సుమలత, వార్డు సభ్యుల ఆధ్వర్యంలో చేపట్టిన ఈ పనులతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో సంవత్సరాలుగా బజార్ ప్రాంతంలో రహదారి సౌకర్యాలు సరిగా లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ, గతంలో పలువురు ప్రజాప్రతినిధులు ఈ సమస్యను పట్టించుకోలేదని స్థానికులు పేర్కొన్నారు.అయితే ప్రస్తుత సర్పంచ్ భూక్య సుమలత ప్రజల ఇబ్బందులను గుర్తించి వెంటనే స్పందించి మొరం వేయించి బజార్ ప్రాంతాన్ని సౌకర్యవంతంగా మార్చారని గ్రామస్తులు కొనియాడారు. వర్షాకాలంలో బురద, నీటి నిల్వల సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టడం అభినందనీయమని అన్నారు.గ్రామాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు అవసరమైన మౌలిక కల్పనలో సర్పంచ్ సుమలత చొరవ చూపుతున్నారని, ఇదే స్ఫూ ర్తితో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టాలని స్థానికులు ఆకాంక్షించారు. ప్రస్తుతం ఏడుకొండలు బజా ర్ ప్రాంతంపరిశుభ్రంగా,రాకపోకలకుఅనుకూలంగా మారడంతో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

## రైతు పండించిన ప్రతి ధాన్యపు గింజను రాష్ట్ర ప్రభుత్వం కొనాల్సిందే..

**- రైతుల కోసం మానిఫెస్టో లో పెట్టిన అంశాలను అమలు చేయాలి..**

**BRS పార్టీ మండల అధ్యక్షుడు కుర్రి నాగేశ్వరరావు, టౌన్ ప్రెసిడెంట్ కుంట లక్ష్మణ్.**

**మణుగూరు.జూన్ 20**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,మణుగూరు పార్టీ కార్యాలయంలో శనివారం నాడు విలేకరుల సమావేశం నిర్వహించిన మణుగూరు టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావుపట్టణ అధ్యక్షులు కుంట లక్ష్మణ్ లు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో అధికారంలోకి రావడం కొరకు అమలు కానటువంటి అడ్డగోలు హామీలు ఎడాపెడ ఇస్తూ ఎన్నో బహిరంగ సభల్లో రైతులను ఆదుకుంటాం, రైతులకు అది చేస్తాం ఇది చేస్తాం అని హామీల మాయ మాటలు చెప్పి,కెసిఆర్ రైతుబంధు రెండు ధపాలే వేస్తున్నాడు అదే మేము వచ్చిన తర్వాత మూడో దఫా కూడా రైతుబంధు వేస్తామని ప్రగల్భాలు పలికినటువంటి రాష్ట్ర ముఖ్యమంత్రి ఇప్పుడు పదవి ఎక్కిన తర్వాత మొన్న జరిగినటువంటి యాసంగి ధాన్యం కొనుగోళ్లలో రైతులకు తీవ్రమైన అన్యాయం చేసి సమయానికి ధాన్యాన్ని కాటాలు పెట్టకుండా, లారీలు పంపించి ధాన్యం ఎత్తకుండా చాలా ఇబ్బందులకు గురి చేసినటువంటి సందర్భం తెలంగాణ రాష్ట్ర రైతాంగం మొత్తం చూశారు. ఒకవేళ కాంటాలు పెట్టి లారీలో ధాన్యం ఎత్తి మిల్లు దగ్గరికి ధాన్యం వెళితే మిల్లర్లు పెట్టేటువంటి ఇబ్బందులు, చిత్రహింసలకు రైతులు ఆ యొక్క ధాన్యం బస్తాల మీదనే ప్రాణాలు వదిలినటువంటి పరిస్థితి తెలంగాణ రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో చూసాం. నిన్న తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రం ఆదేశాల ప్రకారమే ధాన్యం కొంటామని చెప్పడం సిగ్గుమాలిన మాటగా మేము అభివర్ణిస్తున్నాం అని వారు అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులకు కన్నీరే మిగిలింది తప్ప ఒరిగింది ఏమీ లేదని,రైతులు దిక్కుతోచని స్థితిలోకి నెట్టివేయబడ్డారని వారు పేర్కొన్నారు. ఇప్పటికైనా రేవంత్ ప్రభుత్వం తమ పద్ధతి మార్చుకొని రైతులకు ఎన్నికల ముందు ఇచ్చినటువంటి మేనిఫెస్టోలో ఏదైతే రైతులకు ఉపయోగమైనటువంటి విషయాలు పేర్కొన్నారో వాటిని తక్షణమే అమలు చేయకపోతే టిఆర్ఎస్ పార్టీ నుండి తీవ్రమైనటువంటి పరిణామాలు ఎదుర్కోక తప్పదని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి పోశం నరసింహారావు, ముత్యంబాబు, వట్టంరాంబాబు, అడపా అప్పారావు, ఎడ్ల శ్రీనివాస్, ముద్దంగుల కృష్ణ, అక్కి నరసింహారావు, తడికమల ప్రభుదాస్, వేల్పుల సురేష్, జావిద్ పాషా, తురక రామకోటి, వడ్లూరి రాంబాబు, వనమాల రాంబాబు, రావులపల్లి వెంకటేశ్వర్లు, బోసెట్టి రవి, గుర్రం సృజన్, జక్కం రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# యోగాతో ఆరోగ్యం.. యోగాతో ఆనందం

**- ఆర్జీ-1 ఏరియా లో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహణ**

**- విద్యార్థుల యోగా విన్యాసాలు ఆకట్టుకున్నాయి**








**పెద్దపల్లి బ్యూరో, జూన్ 20** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్జీ-1 ఏరియా ఆధ్వర్యంలో స్థానిక గోదావరి కళా ప్రాంగణం, జీఎం కాలనీ గ్రౌండ్‌లో సామూహిక యోగా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. జూన్ 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఒక రోజు ముందుగానే ఈ వేడుకలను నిర్వహించారు.కార్యక్రమానికి ఏరియా జనరల్ మేనేజర్ లలిత్ కుమార్, సేవా అధ్యక్షురాలు అనిత లలిత్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం పాల్గొన్న వారందరితో యోగా ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా జీఎం లలిత్ కుమార్ మాట్లాడుతూ..., యోగా అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాకుండా ఆరోగ్యకరమైన జీవనశైలికి మార్గదర్శకమని అన్నారు. ప్రతి ఒక్కరూ రోజూ యోగాభ్యాసం చేయడం ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రతను పెంపొందించుకో వచ్చని తెలిపారు.సింగరేణి పాఠశాల, సరస్వతి శిశు మందిర్, జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ప్రదర్శించిన యోగా విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సేవా సభ్యులు కూడా ప్రత్యేక యోగా ప్రదర్శనలు నిర్వహించి యోగా ప్రాముఖ్యతను వివరించారు.అలాగే ఆర్జీ-1 ఏరియాలోని జీడీకే 1,3, 2,2ఏ, 11 ఇంక్లైన్, ఓసీ-5తో పాటు వివిధ గనులు, శాఖల్లో ఉద్యోగులచే సామూహిక యోగా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో క్వాలిటీ జనరల్ మేనేజర్ సుజయ్ ముజేందర్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి రంగు శ్రీను, అధికారుల సంఘం ప్రతినిధి పి. శ్రీనివాస్, ఎస్ఓ టు జీఎం చంద్రశేఖర్, ప్రాజెక్ట్ ఆఫీసర్ రమేష్, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ వేణు, అధికారులు మోహన్‌రావు, శ్రావణ్ కుమార్, హనుమంతరావు, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.రామగుండం ఏరియా-1 పరిధిలోని అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, యోగా శిక్షకులు, సేవా సభ్యులు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని యోగా ద్వారా ఆరోగ్య పరిరక్షణపై అవగాహన పెంపొందించుకున్నారు.

# సింగరేణి దొంగతనాలకు కాంట్రాక్టర్లను బలి చేయొద్దు

**- ఆర్జీ-3లో భద్రతా వైఫల్యాలపై స్వతంత్ర విచారణ జరపాలి: మొలుమూరి శ్రీనివాస్**

**- రూ.32 లక్షల రికవరీని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్**



**పెద్దపల్లి బ్యూరో, జూన్ 20**
సింగరేణి ఆర్జీ-3 ఏరియాలో వరుసగా జరుగుతున్న దొంగతనాలకు కాంట్రాక్టర్లను బాధ్యులను చేయడం సరైన విధానం కాదని, అసలు భద్రతా వైఫల్యాలకు కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ ఎంపీటీసీల ఫోరం మాజీ జిల్లా అధ్యక్షుడు మొలుమూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం రామగిరి మండలం సెంటినరీ కాలనీలో విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ..., గత ఆరు నెలల కాలంలో ఆర్జీ-3 ఏరియాలో భారీ స్థాయిలో కాపర్ కేబుళ్లు, విలువైన సామాగ్రి చోరీకి గురయ్యాయని అన్నారు. డ్రాగ్‌లైన్, ఓసీపీ-1, 701, 702, 703 స్ప్రెడర్లు, 301, 302, 303 క్రషర్లు, ఏఎల్పీ మైన్లు, స్టోర్ల వంటి కీలక ప్రాంతాల్లో వందల మీటర్ల కేబుళ్లు మాయమవడం తీవ్ర ఆందోళన కలిగించే అంశమన్నారు.సంస్థలో భద్రతా వ్యవస్థను నిర్వీర్యం చేయడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని ఆరోపించారు. కంపెనీ సెక్యూరిటీకి బదులుగా ప్రైవేట్ సెక్యూరిటీని నియమించడం, చెక్‌పోస్టులను ఎత్తివేయడం, గార్డు పోస్టులను తగ్గించడం, పెట్రోలింగ్ మరియు ఇంటెలిజెన్స్ వ్యవస్థలను బలహీనపరచడం వల్ల దొంగతనాలు పెరిగాయని విమర్శించారుకార్మికులు, సీనియర్ గార్డులు, ఇన్‌స్పెక్టర్లు ముందుగానే హెచ్చరించినప్పటికీ అధికారులు పట్టించుకోలేదని అన్నారు. అసలు దొంగలను పట్టుకోవాల్సింది పోయి, విచారణ పూర్తికాకుండానే శ్రీజా ఇన్ఫ్రా , మ్యాక్ ప్రైవేట్ సెక్యూరిటీ సంస్థలపై రూ.32 లక్షల రికవరీ విధించడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని పేర్కొన్నారు.ఈ వ్యవహారంపై స్వతంత్ర ఉన్నతస్థాయి కమిటీతో విచారణ జరపాలని, అవసరమైతే సీబీఐ లేదా విజిలెన్స్ దర్యాప్తు నిర్వహించాలని డిమాండ్ చేశారు. భద్రతా వైఫల్యాలకు బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రైవేట్ సెక్యూరిటీ సంస్థలపై విధించిన రికవరీని వెంటనే రద్దు చేయాలని కోరారు.అలాగే ఐఈడీ నిబంధనల ప్రకారం పూర్తి స్థాయి కంపెనీ సెక్యూరిటీ వ్యవస్థను పునరుద్ధరించాలని, చెక్‌పోస్టులు, పెట్రోలింగ్, ఇంటెలిజెన్స్ వ్యవస్థలను వెంటనే బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు.సింగరేణి ఆస్తుల రక్షణే తమ లక్ష్యమని, ఈ అంశాన్ని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ వ్యవహారంలో నిజాలు వెలుగులోకి వచ్చే పోరాటం కొనసాగిస్తుందని మొలుమూరి శ్రీనివాస్ స్పష్టం చేశారు.

# ఘనంగా వడ్డేపల్లి రామచందర్ జన్మదిన వేడుకలు

**- తబిత ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించిన బీజేపీ శ్రేణులు**







**పెద్దపల్లి బ్యూరో, జూన్ 20**
జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రామచందర్ జన్మదినాన్ని పురస్కరించుకుని, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి సూచన మేరకు స్థానిక తబిత ఆశ్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆశ్రమంలోని చిన్నారుల సమక్షంలో వడ్డేపల్లి రామచందర్ జన్మదిన వేడుకలను నిర్వహించి, అనంతరం చిన్నారులకు అన్నదానం చేశారు. సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి అండగా నిలవడమే భారతీయ జనతా పార్టీ లక్ష్యమని నాయకులు పేర్కొన్నారు.వడ్డేపల్లి రామచందర్ ప్రజా సేవలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ఆయురారోగ్యా తో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జనగామ మండల అధ్యక్షుడు గుండబోయిన భూమయ్య, జక్కన్న బాలు, జక్కుల పద్మ, బూడిద హర్ష, చిలువేరు కుమార్, హనుమాన్ల వెంకటేష్, కుమార్, ఏరుకొండ తిరుపతి, సింగారం శ్రీకాంత్, ఓబీసీ మోర్చా నాయకులు, పార్టీ కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజల కళ్ళలో వెలుగు.. ప్రజల గుండెల్లో భూక్య జంపన్న.

**ములుగు :**
రెండున్నరేళ్లలో ములుగు జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాలలో 29 సార్లు ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి ఇప్పటివరకు 4032 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు విజయవంతం 17,352 మందికి ఆరోగ్య పరీక్షలు చేయించిన భూక్య జంపన్న ప్రజాసేవలో మరో మైలురాయి.. భూక్య జంపన్న సేవ యజ్ఞానికి ప్రజల జేజేలు వేల కుటుంబాల ఆశాకిరణం భూక్య జంపన్న సేవలు"ఇంటికి పెద్ద కొడుకులా అండగా నిలుస్తున్న జంపన్న" అంటూ ఆశీర్వదిస్తున్న వృద్ధులు29వ విడత ఉచిత కంటి ఆపరేషన్ చేయించుకొని ప్రత్యేక బస్సులో ప్రజలతో కలిసి ప్రయాణం చేసిన జంపన్న ఆపరేషన్ తరువాత తీసుకోవాల్సిన జాగ్రత్తలు ప్రజలకు వివరిస్తూ ప్రజలతో ప్రత్యేక బస్సులో ప్రయాణించి విజయవంతంగా ములుగు చేరుకున్న ప్రజలు ములుగు జిల్లాలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు భూక్య జంపన్న ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాలు వేలాది మంది పేద కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయి. 29వ విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో భాగంగా కంటి ఆపరేషన్లు విజయవంతంగా పూర్తిచేసుకున్న వృద్ధులు, ప్రజలు తమ సొంత గ్రామాలకు చేరుకుని ఆనందం వ్యక్తం చేశారు.కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో జంపన్న చేపట్టిన ఈ సేవా యజ్ఞం జిల్లాలో విశేష



ఆదరణ పొందుతోంది. చికిత్స కోసం ఆస్పత్రులకు తరలించడం నుంచి ఆపరేషన్లు పూర్తయ్యాక సురక్షితంగా తిరిగి గ్రామాలకు చేర్చడం వరకు ప్రతి అంశంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని లబ్ధిదారులు తెలిపారు.గత రెండున్నర సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ సేవా కార్యక్రమాల ద్వారా ఇప్పటివరకు 17352వేల మందికి పైగా ప్రజలకు బీపీ, షుగర్, ఇతరేతర పరీక్షలు నిర్వహించి డాక్టర్ సలహా మేరకు అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు , ఇప్పటిదాకా 4,032 మందికి విజయవంతంగా కంటి ఆపరేషన్లు చేయించినట్లు నిర్వాహకులు భూక్య జంపన్న వెల్లడించారు. దీంతో వేలాది కుటుంబాల్లో కొత్త ఆశలు చిగురించాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ, జంపన్న తమ ఇంటి పెద్ద కొడుకులా అండగా నిలిచి, ఎలాంటి స్వార్థం లేకుండా ప్రజా సేవ చేస్తున్నారని కొనియాడారు. ఆయన సేవలకు కృతజ్ఞతగా వృద్ధులు ఆశీర్వదించారు. భూక్య జంపన్న నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ములుగు జిల్లా వ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్నాయి. ప్రజలకు ఇంతగా సేవ చేస్తున్న జంపన్నకు భవిష్యత్తులో మరింత బాధ్యతలు వస్తే పేదలకు మరింత న్యాయం జరుగుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.కంటి చూపు సమస్యల గురించి ఎక్కడ చర్చ జరిగినా గుర్తుకు వచ్చే పేరుగా జంపన్న నిలుస్తున్నారని, వేలాది మందికి వెలుగులు పంచుతున్న ఆయన సేవా యజ్ఞం జిల్లాలో ఆదర్శంగా మారిందని స్థానికులు పేర్కొన్నారు.

# ఆఫ్ఘన్‌పై భారత్ భారీ విజయం..

## 9 వికెట్ల తేడాతో ఆఫ్ఘన్ చిత్తు

## 3-0తో భారత్ సిరీస్ క్లీన్ స్వీప్

చెన్నైలోని ఎం.ఏ. చిదంబరం స్టేడియంలో జరిగిన 3వ వాణ×లో భారత్ తన ఆధిపత్యాన్ని కొనసాగించింది. అఫ్గానిస్తాన్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్నా, ప్రసీధ్ కృష్ణ అద్భుత బౌలింగ్‌తో వారిని 218 పరుగులకు ఆలౌట్ చేసింది. భారత్ లక్ష్యాన్ని 28.4 ఓవర్లలోనే 224/1తో చేజ్ చేసి 9 వికెట్ల తేడాతో గెలిచి సిరీస్‌ను 3–0తో ముగించింది. ఇది అఫ్గానిస్తాన్‌పై భారత్ బలమైన ప్రదర్శనను మరోసారి నిరూపించింది. మ్యాచ్ ప్రారంభంలో అఫ్గానిస్తాన్ బ్యాటింగ్ దుర్వినియోగమైంది. ప్రసీధ్ కృష్ణ మొదటి ఓవర్‌లోనే రహ్మానుల్లా గుర్బాజ్‌ను (5) ఔట్ చేశాడు. రోహిత్ శర్మ స్లిప్‌లో అద్భుత క్యాచులు పట్టి మూడు వికెట్లు సహకరించాడు. ఇబ్రాహిం జాద్రాన్ (11), రహ్మత్ షా (5), దర్వీష్ రసూలి త్వరగా పెవిలియన్ చేరారు. అఫ్గానిస్తాన్ 9.2 ఓవర్లలో 36/4కి కుప్పకూలింది. ఈ సమయంలో కెప్టెన్ హష్మతుల్లా షాహిది మరియు అజ్మతుల్లా ఒమర్జాయ్ భాగస్వామ్యం కీలకమైంది. ఒమర్జాయ్ అర్ధ శతకం (50) సాధించగా, షాహిది తన మైడెన్ వన్డే సెంచరీ (102 బాల్స్‌లో 102 పరుగులు, 13 ఫోర్లు, 1 సిక్స్)తో జట్టును 218 వరకు



తీసుకెళ్లాడు. ప్రసీధ్ కృష్ణ 8.2 ఓవర్లలో 23 పరుగులకు 5 వికెట్లు సాధించి మ్యాచ్‌ను తన వశం చేసుకున్నాడు. ఇతర బౌలర్లు కూడా సహకరించారు. ఛేజింగ్‌లో భారత్ ఓపెనర్లు యశస్వి జైస్వాల్, రోహిత్ శర్మ అద్భుతంగా ఆడారు. రోహిత్ 79 పరుగులు చేసి ఔట్ అయ్యాడు కానీ జైస్వాల్ సెంచరీ సాధించి అజేయంగా నిలిచాడు. భారత్ 28.4 ఓవర్లలో 224/1తో లక్ష్యం చేరుకుంది. ఈ విజయంతో భారత్ వాణ× సిరీస్‌ను 3–0తో గెలిచి ఆధిపత్యం చాటింది. షుబ్‌మన్ గిల్ నాయకత్వంలో జట్టు డెప్త్‌ను ప్రదర్శించింది. నితీష్ కుమార్ రెడ్డీ, హర్ష్ దుబే, ప్రసీధ్ కృష్ణ వంటి ఆటగాళ్లు అవకాశాలు సద్వినియోగం చేసుకున్నారు. ఈ సిరీస్ భారత్ క్రికెట్ బలాన్ని మరోసారి హైలైట్ చేసింది. అఫ్గానిస్తాన్ షాహిది సెంచరీతో పోరాడినా, బౌలింగ్ బలహీనతలు వారిని ఓడించాయి. చెన్నై పిచ్ స్పిన్, పేస్‌కు సపోర్టు ఇచ్చింది. భారత్ బౌలర్లు డెత్ ఓవర్లలో కూడా నియంత్రణ కాపాడారు. ఈ మ్యాచ్ యువ ఆటగాళ్ల అవకాశాలు, జట్టు డెప్త్‌ను చూపించింది. క్రికెట్ ప్రేమికులు ఈ విజయాన్ని సంబరాలతో జరుపుకుంటున్నారు. భారత్ ఈ సిరీస్ గెలుపుతో 2027 ప్రపంచ కప్ సన్నాహాలను మరింత బలోపేతం చేసుకుంది. అఫ్గానిస్తాన్ తమ అనుభవాన్ని మెరుగుపరచుకోవాల్సిన అవసరం ఉంది. రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్ ఓపెనింగ్ భాగస్వామ్యం, ప్రసీధ్ బౌలింగ్ మరపురాని ముద్ర వేశాయి. ఈ మ్యాచ్ క్రికెట్ అభిమానులకు ఉత్కంఠభరితమైనదిగా మారింది. ఈ విజయం భారత్ క్రికెట్ భవిష్యత్తును ఉజ్వలంగా చూపిస్తుంది. యువ ఆటగాళ్లు అంతర్జాతీయ స్థాయిలో రాణించడం గ్రేట్. అఫ్గానిస్తాన్ జట్టు కూడా తమ సామర్థ్యాలను మెరుగుపరచుకుని భవిష్యత్ మ్యాచ్‌లలో మెరుగైన ప్రదర్శన ఇవ్వాలని కోరుకుందాం. మొత్తం సిరీస్ భారత్ ఆధిపత్యంతో ముగిసింది.

# చెపాక్‌లో శతక్కొట్టిన జైశ్వాల్..



చెన్నై వేదికగా శనివారం జరిగిన మూడో వన్డేలో అఫ్ఘానిస్థాన్‌పై 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించిన భారత్, మూడు వన్డేల సిరీస్‌ను 3–0తో క్లీన్‌స్వీప్ చేసింది. తొలుత ప్రసిద్ధ్ కృష్ణ ధాటికి అఫ్ఘాన్ 218 పరుగులకే ఆలౌట్ కాగా, కెప్టెన్ షాహిదీ (102) సెంచరీతో రాణించాడు. అనంతరం 219 పరుగుల లక్ష్యాన్ని భారత్ కేవలం ఒక్క వికెట్ కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ యశస్వి జైశ్వాల్ (110 నాటౌట్) అద్భుత సెంచరీ సాధించగా, రోహిత్ శర్మ 79 పరుగులతో రాణించాడు.న్నై వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన అఫ్ఘాన్ కెప్టెన్ తొలుత బ్యాటింగ్ ఎంచుకున్నాడు. అయితే ప్రసిద్ధ్ కృష్ణ బౌలింగ్ వేయడం.. అఫ్ఘాన్ బ్యాటర్లు షాట్లు కొట్టడం.. బంతి వెళ్లి నేరుగా రోహిత్ శర్మ చేతిలో పడటం. వరుసగా మూడు వికెట్లు ఇదే తరహాలో పడ్డాయి. రెహ్మనుల్లా గుర్బాజ్, ఇబ్రహీం జద్రాన్, రెహ్మత్ షా.. ముగ్గురు ప్రసిద్ధ్ బౌలింగ్‌లో రోహిత్ శర్మకు క్యాచ్ ఇచ్చి ఔట్ అయ్యారు. డార్విష్ రసూల్ కూడా ఔట్ కావడంతో అఫ్ఘాన్.. 36/4తో పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ సమయంలో కెప్టెన్ హష్మతుల్లా షాహిదీ (102), అజ్మతుల్లా ఒమర్జాయ్ (50) ఆదుకున్నారు. కానీ వారిద్దరూ ఔట్ అయ్యాక అఫ్ఘాన్ కుప్పకూలింది. ప్రసిద్ధ్ కృష్ణ ఐదు వికెట్లు తీశాడు.అనంతరం ఛేజింగ్ ప్రారంభించిన భారత ఓపెనర్లు అఫ్ఘాన్ బౌలర్లు ఏమాత్రం ఇబ్బంది పెట్టలేకపోయారు. ఈ క్రమంలోనే రోహిత్, జైశ్వాల్.. ఇద్దరూ హాఫ్ సెంచరీలు పూర్తి చేసుకున్నారు. తొలి వికెట్‌కు 137 బంతుల్లో 170 రన్స్ జోడించారు. 69 బంతుల్లో 79 రన్స్ చేసి రోహిత్ శర్మ ఔట్ అయినా.. జైశ్వాల్ మాత్రం జోరు కొనసాగించాడు. ఈ క్రమంలోనే తన కెరీర్‌లో రెండో వన్డే సెంచరీ కొట్టాడు. సిక్సర్‌తో మ్యాచ్ ముగించాడు. 86 బంతుల్లో 110 రన్స్ చేసి అజేయంగా నిలిచాడు. శ్రేయస్ అయ్యర్ 19 బంతుల్లో 20 రన్స్ చేసి నాటౌట్‌గా

# 14000 పరుగుల క్లబ్‌లోకి జో రూట్



న్యూజిలాండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో ఇంగ్లాండ్ స్టార్ బ్యాటర్ జో రూట్ టెస్ట్ క్రికెట్‌లో 14,000 పరుగుల మైలురాయిని అందుకుని చరిత్ర సృష్టించాడు. సచిన్ టెండూల్కర్ (15,921) తర్వాత ఈ అరుదైన ఫీట్ సాధించిన రెండో బ్యాటర్‌గా రూట్ రికార్డులకెక్కాడు. న్యూజిలాండ్‌తో జరుగుతున్న రెండో వన్డేలో అతడు ఈ ఫీట్ సాధించాడు. ప్రస్తుతం 35 ఏళ్ల జో రూట్, సచిన్ ఆల్‌టైమ్ రికార్డును బద్దలు కొట్టడానికి మరో 1,921 పరుగుల దూరంలో ఉన్నాడు. ఇంగ్లాండ్ స్టార్ బ్యాటర్ జో రూట్ .. టెస్టుల్లో 14,000 పరుగుల మైలురాయిని చేరాడు. న్యూజిలాండ్‌తో జరుగుతున్న రెండో టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో రెండు పరుగులు చేయడం ద్వారా అతడు ఈ ఫీట్ సాధించాడు. దీంతో టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఈ ఫీట్ సాధించిన రెండో క్రికెటర్‌గా అతడు నిలిచాడు. ఈ క్రమంలోనే టెస్ట్ క్రికెట్‌లో అత్యధిక రన్స్ చేసిన వ్యక్తిగా ఉన్న సచిన్ టెండూల్కర్ రికార్డుకు రూట్ చేరువయ్యాడు. సుమారుగా మరో 1800o రన్స్ చేస్తే.. రెడ్ బాల్ క్రికెట్‌లో అత్యధిక రన్స్ చేసిన ప్లేయర్‌గా రూట్ అవతరిస్తాడు.టెస్ట్ క్రికెట్‌లో అత్యధిక రన్స్ చేసిన ప్లేయర్‌ల జాబితాలో భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ అగ్రస్థానంలో ఉన్నాడు. అతడు తన టెస్ట్ కెరీర్‌లో 15,921 పరుగులు సాధించాడు. సచిన్ 2010లో ఈ ఫీట్ సాధించాడు. అయితే ఈ రికార్డు ఎప్పటికీ చెరిగిపోదని అంతా భావించారు. టెస్ట్ క్రికెట్‌కు ఆసక్తి తగ్గుతున్న ప్రస్తుత రోజుల్లో సచిన్ రికార్డు చెక్కు చెదరకుండా ఉంటుందనే విశ్లేషణలు వినిపించాయి. కానీ రెడ్ బాల్ క్రికెట్ అంటే ఆసక్తిచూపించే ఇంగ్లాండ్‌లో పుట్టిన జో రూట్.. ఈ ఫార్మాట్‌కు ప్రాణం పోస్తున్నాడు. పరుగుల వరద పారిస్తూ.. సచిన్ రికార్డును డేంజర్‌లో పెట్టాడు. 35 ఏళ్ల జో రూట్.. సచిన్ రికార్డు బద్దలు కొట్టేందుకు 1921 పరుగుల దూరంలో ఉన్నాడు.విరాట్ కోహ్లీ తన టెస్ట్ కెరీర్‌లో 9230 పరుగులు సాధించాడు. కేన్ విలియమ్సన్ 9515 పరుగులు స్కోరు చేశాడు.

# ఆస్ట్రేలియాపై అమెరికా విజయదుందుభి

ఫిఫా ప్రపంచకప్ 2026 ఆతిథ్య దేశాల్లో అమెరికా ఫుట్‌బాల్ జట్టు విజయదుందుభి మోగించింది. శుక్రవారం జరిగిన గ్రూప్–డి పోరులో అమెరికా 2–0 గోల్స్ తేడాతో ఆస్ట్రేలియాను ఓడించింది. ఈ విజయంతో టోర్నమెంట్‌లో వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. దీంతో అమెరికా నాకౌట్ దశకు అర్హత సాధించింది. అమెరికా జట్టు గ్రూప్ దశలో ఇంకా ఒక మ్యాచ్ మిగిలి ఉండగానే నాకౌట్ బెర్త్‌ను ఖరారు చేసుకోవడం విశేషం. ఈ విజయంతో అమెరికా ఫుట్‌బాల్ చరిత్రలో 96 ఏళ్ల నాటి సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. 1929 ప్రపంచకప్ తర్వాత, అమెరికా జట్టు ఒకే ప్రపంచకప్‌లో మొదటి రెండు మ్యాచ్‌ల్లో వరుసగా విజయాలు సాధించడం ఇదే తొలిసారి కావడం విశేషం. సొంతగడ్డపై అభిమాన సందోహం మధ్య బరిలోకి దిగిన అమెరికా జట్టు ఆట ప్రారంభమైన మొదటి నిమిషం నుంచే ఆస్ట్రేలియాపై ఒత్తిడి పెంచింది. తమ మొదటి మ్యాచ్‌లో పరాగ్వేను 4–1తో చిత్తు చేసిన ఉత్సాహంతో ఉన్న అమెరికా ఆటగాళ్లు ఆస్ట్రేలియాపై ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. మ్యాచ్ ప్రారంభమైన కేవలం 11వ నిమిషంలోనే అమెరికాకు ఊహించని అదృష్టం కలిసివచ్చింది. అమెరికా స్టార్ ఆటగాడు ఫోలారిన్ బాలోగన్ ఆస్ట్రేలియా డిఫెండర్స్‌ను దాటుకొని బంతిని పెనాల్టీ ఏరియాలోకి తీసుకువెళ్లాడు. అక్కడి నుంచి అతను గోల్ పోస్ట్ వైపు కొట్టిన బాల్‌ను అడ్డుకునే క్రమంలో ఆస్ట్రేలియా డిఫెండర్ కేమరాన్ బర్గెస్ పొరపాటు చేశాడు. బంతిని ప్రమాదవశాత్తూ తన సొంత గోల్ పోస్ట్‌లోకి నెట్టేశాడు. దీనితో అమెరికాకు ఖాతాలో ఒక గోల్ పడింది. యూఎస్‌కు 1–0 ఆధిక్యం లభించింది. ఆ తర్వాత ఆస్ట్రేలియా కోలుకోవడానికి ప్రయత్నించినప్పటికీ, అమెరికా మిడ్‌ఫీల్డర్లు, డిఫెండర్లు ప్రత్యర్థి వ్యూహాలను సమర్థవంతంగా



తిప్పికొట్టారు. బంతిపై ఎక్కువ సమయం పట్టు సాధించినప్పటికీ, ఆస్ట్రేలియా జట్టు అమెరికా రక్షణ వలయాన్ని ఛేదించలేకపోయింది. ఫస్టాఫ్ ముగియడానికి కొన్ని నిమిషాల ముందు అమెరికా తన రెండో గోల్‌ను నమోదు చేసింది. దీంతో మొదటి సగం ముగిసేసరికే అమెరికా 2–0తో తిరుగులేని ఆధిక్యంలోకి దూసుకెళ్లి ఆస్ట్రేలియాను కోలుకోలేని దెబ్బతీసింది. ఇక సెకండాఫ్‌లో అమెరికా జట్టు దూకుడు కంటే డిఫెన్స్‌కే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చింది. మ్యాచ్‌ను పూర్తిగా తమ నియంత్రణలో ఉంచుకుంటూ, ఆస్ట్రేలియాకు ఎలాంటి గోల్ చేసే అవకాశం ఇవ్వకుండా జాగ్రత్త పడింది. ఆస్ట్రేలియా మ్యాచ్‌లోకి తిరిగి రావడానికి శతవిధాలా ప్రయత్నించినప్పటికీ, కనీసం ఒక్క గోల్ కూడా సాధించలేకపోయింది. నిర్ణీత సమయం ముగిసేసరికి అమెరికా 2–0తో విజయాన్ని ఖాయం చేసుకుంది. ఈ ఓటమితో ఆస్ట్రేలియా పాయింట్ల పట్టికలో 3 పాయింట్లతో రెండో స్థానంలోనే నిలిచింది. మరోవైపు ఫిఫా ప్రపంచకప్ 2026లో మొరాకో మిడ్‌ఫీల్డర్ ఇస్మాయిల్ సైబారీ సంచలనం సృష్టించాడు. శుక్రవారం జరిగిన గ్రూప్ దశ ఉత్కంఠ పోరులో స్కాట్లాండ్‌పై మ్యాచ్ ప్రారంభమైన కేవలం 70 సెకన్లలోనే సైబారీ అద్భుత గోల్ సాధించాడు. 2026 ఎడిషన్ ప్రపంచకప్‌లో నమోదైన అత్యంత వేగవంతమైన గోల్‌గా ఇది రికార్డు సృష్టించింది. అలాగే ఈ మ్యాచ్?లో 1–0 తేడాతో మొరాకో విజయం సాధించింది. ఇంతకుముందు సౌతాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో చెకియా దేశానికి చెందిన మిచల్ సాడిలెక్ 5 నిమిషాల 7 సెకన్లలో కొట్టిన గోల్ పేరిట ఉన్న రికార్డును సైబారీ ఇప్పుడు బద్దలు కొట్టాడు. మ్యాచ్ ప్రారంభమైన వెంటనే స్కాట్లాండ్ రక్షణ శ్రేణిని ఛేధించి సైబారీ మెరుపు వేగంతో సాధించిన ఈ గోల్‌తో సైబారీ మరో అరుదైన మైలురాయిని చేరుకున్నాడు. తన కెరీర్‌లో ఆడిన మొదటి రెండు ఫిఫా ప్రపంచకప్ మ్యాచ్‌ల్లోనూ వరుసగా గోల్స్ సాధించిన రెండో ఆఫ్రికన్ ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. ఇంతకుముందు ఈ ఘనతను ఈజిప్ట్ ఫుట్‌బాల్ లెజెండ్ మొహమ్మద్ సలాహ్ మాత్రమే సాధించగా, ఇప్పుడు సైబారీ ఆ క్లబ్‌లో చేరాడు. ప్రపంచకప్ చరిత్రలో మొరాకో దేశం తరఫున నమోదైన అత్యంత వేగవంతమైన గోల్ ఇదే కావడం విశేషం. అలాగే ఆఫ్రికా ఖండం మొత్తం మీద ఇది రెండో అత్యంత వేగవంతమైన గోల్. ఈ జాబితాలో ఘనా ఆటగాడు అసామోవా గ్యాన్ (2006లో చెక్ రిపబ్లిక్‌పై కొట్టిన గోల్) మొదటి స్థానంలో ఉన్నాడు. అయితే ప్రపంచకప్ చరిత్రలోనే అత్యంత వేగవంతమైన గోల్ రికార్డు మాత్రం తుర్కియే చెందిన హకాన్ సుకుర్ (2002లో సౌత్ కొరియాపై 11 సెకన్లలో కొట్టిన గోల్) పేరిట చెక్కుచెదరకుండా ఉంది.

# రోహిత్ శర్మ సహకారంతోనే సెంచరీ

## • టీమిండియా యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్

రోహిత్ శర్మ సహకారంతోనే సెంచరీ చేయగలిగానని టీమిండియా యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ అన్నాడు. బ్యాటింగ్ చేస్తున్నంత సేపు ప్రశ్నలతో విసిగించానని, రోహిత్ భయ్యా ఓపికగా తనకు సూచనలు ఇచ్చాడని తెలిపాడు. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా అఫ్గానిస్థాన్‌తో శనివారం జరిగిన మ్యాచ్‌లో యశస్వి జైస్వాల్(86 బంతుల్లో 14 ఫోర్లు, 3 సిక్స్‌లతో 110 నాటౌట్) అజేయ శతకంతో చెలరేగాడు. దాంతో ఈ మ్యాచ్‌లో టీమిండియా 9 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఈ గెలుపుతో మూడు వన్డేల సిరీస్‌ను 3–0తో టీమిండియా క్లీన్ స్వీప్ చేసింది. ఈ మ్యాచ్ అనంతరం తన ఇన్నింగ్స్ గురించి మాట్లాడిన యశస్వి జైస్వాల్.. రోహిత్ శర్మ సూచనలతోనే ఈ శతకం సాధ్యమైందని చెప్పాడు.ఈ ఇన్నింగ్స్‌ను తాను ఎంతగానో ఆస్వాదించానని వెల్లడించాడు. 'ఈ ఇన్నింగ్స్‌ను నేను చాలా ఆస్వాదించాను. పవర్‌ప్లేలోనే నాకు కొన్ని పరుగులు వచ్చాయి. దాంతో ఆ జోరును కొనసాగిస్తూ చివరి




వరకు క్రీజులో ఉండాలనుకున్నాను. అందుకే ఈ ఇన్నింగ్స్‌ను చాలా ఎంజాయ్ చేశాను. నేను నా విధానంపై, నా నియంత్రణలో ఉన్న విషయంపై మాత్రమే ఫోకస్ పెడుతాను. నా సాయశక్తులా కష్టపడటానికి ప్రయత్నిస్తాను. మా సపోర్ట్ స్టాఫ్ నుంచి కూడా నాకు మద్దతు లభిస్తుంది. సపోర్ట్ స్టాఫ్‌తో నా కమ్యూనికేషన్ చాలా బాగుంటుంది. కాబట్టి ఏం జరుగుతుందో నాకు స్పష్టంగా తెలుస్తుంది. అందుకే నేను ఈ ఇన్నింగ్స్‌ను బాగా ఆస్వాదించాను. నాకు లభించిన మంచి ఆరంభాలను శతకాలుగా మల్చడం అదృష్టమనే చెప్పాలి. నాకు మంచి ఆరంభం లభిస్తే దాన్ని భారీ స్కోరుగా మార్చడానికే ప్రయత్నిస్తున్నాను. ఎందుకంటే స్పోర్ట్స్ , ముఖ్యంగా క్రికెట్‌లో మనకు కలిసి వచ్చిన రోజును పూర్తిగా ఉపయోగించుకోవాలి. నేను అదే చేయడానికి ప్రయత్నిస్తాను. ఎందుకంటే ఇటీవల నాకు ఒక అనుభవం ఎదురైంది.. నేను ఎంత ప్రయత్నించినా విషయాలు నాకు అనుకూలంగా జరగలేదు. కానీ ఈరోజు మాత్రం నేను చాలా పట్టుదలగా ఉన్నాను. ఎలాగైనా నా దృష్టిని కోల్పోకూడదని, స్ట్రైక్ రొటేట్ చేస్తూనే ఉండాలని అనుకున్నాను. క్రీజులో సెట్ అయిన తర్వాత, దాన్ని భారీ స్కోరుగా మార్చాలనుకున్నాను. రోహిత్ భయ్యా ఎల్లప్పుడూ నాకు సహాయం చేస్తారు. నేను ఆయనను ఎప్పుడూ చాలా ప్రశ్నలు అడుగుతుంటాను. ఆయన సూచనలను మ్యాచ్‌లో అమలు చేయడానికి ప్రయత్నిస్తాను. ఈరోజు కూడా నేను కొన్ని డాట్ బాల్స్ ఆడినప్పుడు.. 'ఇప్పుడు నేను ఏం చేయాలి?' అని ఆయనను అడిగాను.

# వన్డే క్రికెట్ చరిత్రలోనే టీమిండియా సరికొత్త రికార్డు



చెన్నై వేదికగా అఫ్ఘానిస్థాన్‌తో జరిగిన మూడో వన్డేలో భారత్ వన్డే క్రికెట్ చరిత్రలోనే సరికొత్త రికార్డు సృష్టించింది. అఫ్ఘాన్ కెప్టెన్ హష్మతుల్లా షాహిదీ పిచ్‌పై పదే పదే పరుగెత్తడంతో అంపైర్లు 5 పరుగుల పెనాల్టీ విధించారు. దీంతో 5/0తో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్, తొలి ఓవర్లోనే యశస్వి జైశ్వాల్ బౌండరీల వర్షం కురిపించడంతో ఏకంగా 23 పరుగులు రాబట్టింది. ఫలితంగా 2004లో బంగ్లాదేశ్‌పై నమోదైన 22 పరుగుల రికార్డును టీమిండియా బద్దలు కొట్టింది. శనివారం చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియంలో అఫ్ఘానిస్థాన్‌తో జరిగిన మూడో వన్డేలో, భారత్ ఓ అరుదైన రికార్డు సాధించింది. 219 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా.. తొలి ఓవర్‌లోనే ఎదురుదాడికి దిగింది. ఏకంగా రికార్డు స్థాయిలో తొలి ఆరు బంతుల్లో 23 రన్స్ రాబట్టింది. దీంతో వన్డే క్రికెట్ చరిత్రలో తమ అత్యధిక తొలి ఓవర్ స్కోరు నమోదు చేసింది.ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన అఫ్ఘానిస్థాన్ 219 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం రోహిత్ శర్మ, యశస్వి జైశ్వాల్ భారత ఇన్నింగ్స్‌ను ప్రారంభించారు. అయితే అఫ్ఘాన్ బ్యాటింగ్ చేస్తుండగా.. ఆ జట్టు కెప్టెన్ హష్మతుల్లా షాహిదీ పదే పదే పిచ్‌లోని సురక్షిత ప్రాంతంలోకి పరుగెత్తాడు. దీంతో అంపైర్లు.. ఆ జట్టుకు 5 రన్స్ పెనాల్టీగా విధించారు. దీంతో టీమిండియా 5/0 స్కోరుతో తమ ఇన్నింగ్స్‌ను ప్రారంభించింది. ఇక భారత బ్యాటర్లు మరో 18 రన్స్ చేయడంతో 22 ఏళ్ల తర్వాత వన్డే క్రికెట్‌లో ఓ ఓవర్‌లో తమ అత్యధిక స్కోరును టీమిండియా నమోదు చేసింది.




# గతాన్ని పూర్తిగా మర్చిపోవాలి

: శోభిత ధూళిపాళ

అక్కినేని నాగచైతన్యతో వివాహం జరిగిన తర్వాత సినిమాలకు కాస్త బ్రేక్ ఇచ్చిన శోభిత ధూళిపాళ.. రీసెంట్‌గా 'చీకటిలో' వెబ్‌సిరీస్‌తో డిజిటల్ స్క్రీన్‌పై మంచి థ్రిల్ ఇచ్చారు. ప్రస్తుతం కోలీవుడ్ క్రేజీ డైరెక్టర్ పా రంజిత్ తెరకెక్కిస్తున్న సైన్స్ ఫిక్షన్ డ్రామా 'వెట్టువం' షూటింగ్‌తో బిజీగా ఉన్న ఈ బ్యూటీ... తాజాగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో చేసిన కొన్ని పర్సనల్ కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతమైన చర్చకు దారితీశాయి.ఇంటర్వ్యూలో భాగంగా యాంకర్ శోభితను ఒక పర్సనల్ క్వశ్చన్ అడిగారు. "మీ లైఫ్‌లో ఏ విషయాన్ని పూర్తిగా మర్చిపోవాలని అనుకుంటున్నారు?" అని ప్రశ్నించగా... దానికి శోభిత ఏమాత్రం తడబడకుండా.. "నిన్నటి వరకు నా జీవితంలో జరిగిన ప్రతి సంఘటనను, జ్ఞాపకాన్ని పూర్తిగా మర్చిపోవాలని అనుకుంటున్నాను" అని ఆన్సర్ ఇచ్చి అందరినీ ఆశ్చర్యపరిచారు.తన సమాధానానికి గల కారణాన్ని వివరిస్తూ.. "సాధారణంగా లోకం మతిమరుపును ఒక జబ్బుగా చూస్తుంది. కానీ నా దృష్టిలో కొన్నిసార్లు మతిమరుపు అనేది మనిషికి దొరికే ఒక గొప్ప వరం. ఎందుకంటే లైఫ్‌లో వేరే వాళ్లు మన పట్ల చేసిన బాధాకరమైన పనులు, మన మనసును గాయపరిచిన చేదు జ్ఞాపకాలను మనం మర్చిపోయినప్పుడే జీవితంలో ఫ్రీగా ముందుకు సాగడం సాధ్యమవుతుంది" అని చెప్పుకొచ్చారు. పాత జ్ఞాపకాలలోనే ఎప్పుడూ కూరుకుపోకుండా, వాటన్నింటినీ డిలీట్ చేసేసి రేపటి భవిష్యత్తు గురించి పాజిటివ్‌గా ఆలోచించడమే నేటి అవసరమని శోభిత క్లారిటీ ఇచ్చారు.

# ఇదిగో మా క్లీంకార..

**తొలిసారి కుమార్తెను చూపించిన రామ్ చరణ్, ఉపాసన...**



మెగా అభిమానులు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న క్షణం ఎట్టకేలకు వచ్చింది. రామ్ చరణ్, ఉపాసన దంపతులు తమ కుమార్తె క్లీంకార ముఖాన్ని తొలిసారి ప్రపంచానికి చూపించారు. ఆమె పుట్టిన రోజు సందర్భంగా ఉపాసన తన సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫొటో ఇప్పుడు వైరల్‌గా మారింది. ఇప్పటివరకు కూతురు ముఖం కనిపించకుండా జాగ్రత్తపడిన ఈ జంట మూడో బర్త్‌డే రోజున అభిమానులకు ప్రత్యేక కానుక ఇచ్చింది."మా అమూల్యమైన చిన్నారి క్లీంకారకు పుట్టినరోజు శుభాకాంక్షలు" అంటూ ఉపాసన తన ఫేస్‌బుక్ ఖాతాలో అందమైన తమ ఫ్యామిలీ ఫొటోను పంచుకున్నారు. పచ్చని ప్రకృతి మధ్యలో రామ్ చరణ్, ఉపాసన తమ గారాల పట్టిని ప్రేమగా ఎత్తుకుని ఉన్న ఈ చిత్రం అభిమానులను ఆకట్టుకుంటోంది. నీలి రంగు దుస్తుల్లో చిరునవ్వులు చిందిస్తున్న చిన్నారి అందరి చూపును కట్టిపడేస్తోంది. బుగ్గల నిండా నవ్వు, కళ్లలో అమాయకత్వం, ముఖంలో మెరిసే ఆనందం ఫొటోకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తల్లిదండ్రుల ఒడిలో హాయిగా కూర్చుని నవ్వుతున్న మెగా వారసురాలు ఆ కుటుంబ చిత్రానికి మరింత అందాన్ని తీసుకొచ్చింది. కొందరు ఆమె కళ్లు తాత మెగాస్టార్ చిరంజీవి కళ్లలా ఉన్నాయని కామెంట్ చేస్తున్నారు.ఈ పోస్ట్ బయటకు వచ్చిన వెంటనే సోషల్ మీడియాలో శుభాకాంక్షల వెల్లువ మొదలైంది. మెగా అభిమానులతో పాటు సినీ ప్రముఖులు క్లీంకారకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. మూడేళ్లుగా అభిమానులు ఎదురుచూస్తున్న ఆమె ఫేస్ రివీల్ కావడంతో ఈ ఫొటో ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.

# సూర్య 'విశ్వనాథ్ అండ్ సన్స్'

## నుంచి రొమాంటిక్ మెలోడీ విడుదల



విలక్షణ నటుడు సూర్య కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'విశ్వనాథ్ అండ్ సన్స్' ప్రచార కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా చిత్రబృందం శుక్రవారం నాడు ఈ సినిమాలోని తొలి గీతాన్ని విడుదల చేసింది. తమిళంలో 'పట్టాంపూచి'గా, తెలుగులో 'నేనో బటర్ ఫ్లై' పేరుతో విడుదలైన ఈ రొమాంటిక్ మెలోడీకి సంగీత ప్రియుల నుంచి విశేష స్పందన లభిస్తోంది.జీవీ ప్రకాశ్ కుమార్ స్వరపరిచిన ఈ గీతాన్ని సుబ్లాషిణి ఆలపించారు. హీరో సూర్య, కథానాయిక మమిత బైజుల మధ్య కెమిస్ట్రీని ప్రతిబింబిస్తూ సాగే ఈ పాటను ఆదిత్య మ్యూజిక్ ద్వారా విడుదల చేశారు. లిరికల్ వీడియోలోని సీతాకోకచిలుక థీమ్ విజువల్స్ వీక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ గీతం ప్రస్తుతం సోషల్ మీడియా, యూట్యూబ్ వేదికలపై ట్రెండింగ్‌లో ఉంది.వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సూర్య 40 ఏళ్ల అంతర్జాతీయ పిస్టల్ షూటర్ సంజయ్ విశ్వనాథ్ పాత్రలో కనిపించనున్నారు. కుటుంబ భావోద్వేగాల నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో రాధికా శరత్‌కుమార్, రవీనా టాండన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న ఈ చిత్ర డిజిటల్ హక్కులను నెట్‌ఫ్లిక్స్ కైవసం చేసుకుంది. స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా ఈ ఏడాది ఆగస్టు 14న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

# 'మా ఇంటి బంగారం'కు మంచి ఓపెనింగ్స్..


## మహిళా ప్రేక్షకులకు సమంత థ్యాంక్స్

సమంత ప్రధాన పాత్రలో నటించి, స్వయంగా నిర్మించిన చిత్రం 'మా ఇంటి బంగారం'. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన ఆరంభాన్ని అందుకుంది. విడుదలైన తొలిరోజే ప్రపంచవ్యాప్తంగా రూ. 13.15 కోట్ల గ్రాస్ వసూలు చేసి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈ భారీ విజయం పట్ల సమంత ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యంగా సినిమా ఓపెనింగ్స్‌కు మహిళా ప్రేక్షకులు భారీగా తరలిరావడంపై ఆమె ఆనందం వ్యక్తం చేశారు.ఈ విజయంపై ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె ఒక నోట్ రాశారు. "మొదటి రోజు ఒక సినిమాకు ఇంత మంచి ఓపెనింగ్ రావడం చాలా ఆనందంగా ఉంది. యువత నుంచి పెద్దల వరకు అందరూ సినిమాను ఆశీర్వదించడానికి రావడం గొప్ప అనుభూతినిచ్చింది" అని ఆమె పేర్కొన్నారు."థియేటర్లకు ఓపెనింగ్స్‌ను మగ ప్రేక్షకులే తెస్తారని చాలాకాలంగా వింటున్నాం. కానీ, ఈ సినిమాకు మహిళలు భారీగా తరలిరావడం చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. సినిమా ప్రేక్షకులు కూడా ఎదుగుతున్నారని అర్థమవుతోంది. మా చిన్న ప్రొడక్షన్ హౌస్ విజయం సాధించింది" అంటూ తన సంతోషాన్ని పంచుకున్నారు. ఇటీవలే ఓ ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ.. 'మా ఇంటి బంగారం'లోని స్వర్ణ పాత్ర తన నిజ జీవితానికి చాలా దగ్గరగా ఉంటుందని సమంత తెలిపారు. తాను ఇప్పటివరకు చేసిన తెలుగు పాత్రలన్నింటిలో ఇదే తనకు అత్యంత ఇష్టమైనదని చెప్పారు. చిత్రంలోని యాక్షన్ సన్నివేశాల గురించి మాట్లాడుతూ.. "సినిమాలో స్లో మోషన్ షాట్లు, బిల్డప్ షాట్లు ఉండవు. నిజమైన పంచ్‌లు ఉంటాయి. నాకు కూడా దెబ్బలు తగిలాయి, రక్తం వచ్చింది. అన్ని యాక్షన్ సీన్లను నేనే స్వయంగా చేశాను. అందుకే అవి అంత సహజంగా కనిపిస్తున్నాయి" అని సమంత వెల్లడించారు.




# ఏఐ డీప్‌ఫేక్‌తో వేధింపులు..

## కాంతార హీరోయిన్ కేసులో కీలక పురోగతి



'కాంతార చాప్టర్ 1' చిత్రంతో గుర్తింపు పొందిన నటి రుక్మిణి వసంత్‌కు సంబంధించిన డీప్‌ఫేక్ కేసులో కర్ణాటక సైబర్ క్రైమ్ పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను ఉపయోగించి నటి అశ్లీల చిత్రాలు, వీడియోలను సృష్టించి సోషల్ మీడియాలో ప్రచారం చేశారనే ఆరోపణలపై ఈ అరెస్టులు జరిగాయి.నిందితులను బాగల్‌కోట్ జిల్లాకు చెందిన రవికుమార్ (24), బెంగళూరు కామాక్షిపాళ్యకు చెందిన చంద్రకాంత్ (33), నాగసంద్రకు చెందిన రంజిత్ (25)గా పోలీసులు గుర్తించారు. ఐటీ చట్టంతో పాటు భారతీయ న్యాయ సంహితలోని సంబంధిత సెక్షన్ల కింద వీరిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు శుక్రవారం వెల్లడించారు.గత మే నెలలో రుక్మిణి వసంత్ బికినీ ధరించినట్లుగా ఏఐ సాంకేతికతతో సృష్టించిన కొన్ని నకిలీ చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. తన ముఖాన్ని వేరొకరి శరీరానికి అతికించి, ప్రతిష్టకు భంగం కలిగించేలా ఈ ఫోటోలను సృష్టించారని రుక్మిణి సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అటువంటి నకిలీ కంటెంట్‌ను షేర్ చేయవద్దని ఆమె ఈ సందర్భంగా తన అభిమానులను కోరారు.నటి ఫిర్యాదుతో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు, ఈ కంటెంట్‌ను సర్క్యులేట్ చేసిన 29 సోషల్ మీడియా ఖాతాలపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ క్రమంలోనే తాజాగా ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి కేసులో పురోగతి సాధించారు. ప్రముఖులను లక్ష్యంగా చేసుకుని, ఏఐ సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ ఇలాంటి అశ్లీల కంటెంట్ సృష్టించడంపై పౌర సమాజంలో మరోసారి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.



# పవన్ కల్యాణ్ స్ఫూర్తితోనే

## బాలుడి ప్రాణం కాపాడేందుకు బండ్ల గణేశ్ 5 లక్షల సాయం..

సినీ నిర్మాత, నటుడు బండ్ల గణేశ్ తనలోని ఉదారత్వాన్ని చాటుకుంటూ ఒక గొప్ప నిర్ణయంతో వార్తల్లో నిలిచారు. ప్రాణాంతక వ్యాధితో పోరాడుతున్న హనుమకొండకు చెందిన చిన్నారి నిరంజన్ కుటుంబానికి తాను ప్రకటించిన రూ. 5 లక్షల ఆర్థిక సాయాన్ని ఈరోజు తన చేతుల మీదుగా అందజేశారు.

హనుమకొండలోని హనుమాన్ నగర్‌లో ఉన్న చిన్నారి నిరంజన్ నివాసానికి బండ్ల గణేశ్ స్వయంగా వెళ్లారు. నిరంజన్‌తో కాసేపు ముచ్చటించి, ధైర్యం చెప్పారు. అతని ఆరోగ్య పరిస్థితిపై తల్లిదండ్రులు రాంగోపాల్ చారి, మానసలతో మాట్లాడి... తమ పరమేశ్వర ఆర్ట్స్ ప్రొడక్షన్ బ్యానర్ తరఫున రూ. 5 లక్షల చెక్‌ను వారికి అందజేశారు. ఆ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

ఈ సందర్భంగా బండ్ల గణేశ్ మీడియాతో మాట్లాడుతూ... "నేను పవన్ కల్యాణ్ గారి భక్తుడిని. దైవసమానులైన పవన్ కల్యాణ్ గారు ఈ బాబును పరామర్శించినప్పుడే నిరంజన్ విషయం నా దృష్టికి వచ్చింది. ఆయన స్ఫూర్తితోనే నేను ఈ రోజు ఇక్కడికి వచ్చి ఆర్థిక సాయం చేశాను. నిజానికి మేమంతా ఈ స్థాయిలో ఉన్నామంటే దానికి పవన్ కల్యాణ్ గారి దయే కారణం" అంటూ తన 'బాస్'పై ఉన్న భక్తిని చాటుకున్నారు.ప్రస్తుతం తన కూతురి వివాహ పనులతో ఎంతో బిజీగా ఉన్నప్పటికీ, ఈ రోజే వచ్చి సాయం చేయాలని ఫిక్స్ అయినట్లు బండ్ల గణేశ్ చెప్పారు. "నారా భువనేశ్వరి గారి పుట్టినరోజు సందర్భంగా ఈ రోజు ఈ రూ. 5 లక్షల సాయాన్ని నిరంజన్ కుటుంబానికి అందించడం నాకు ఎంతో సంతోషాన్ని ఇస్తోంది. బాబు త్వరగా కోలుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఈ పవిత్రమైన సందర్భంగా నేను ఎలాంటి రాజకీయాలు మాట్లాడదలుచుకోలేదు" అని స్పష్టం చేశారు.

# మనసుకూ విశ్రాంతి అవసరం..

**సోషల్ మీడియాకు బ్రేక్ ప్రకటించిన హీరోయిన్**



ప్రముఖ నటి కయాదు లోహర్ సోషల్ మీడియాకు తాత్కాలికంగా విరామం ఇస్తున్నట్లు ప్రకటించారు. శరీరానికి విశ్రాంతి ఇచ్చినట్లే మనసుకు కూడా విశ్రాంతి అవసరమని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా అభిమానులకు తెలిపారు. ఈ నిర్ణయం ద్వారా కొంతకాలం విశ్రాంతి తీసుకుని, స్క్రీన్‌కు అవతల ఉన్న నిజ జీవితంతో మమేకం కావాలనుకుంటున్నట్లు ఆమె పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆమె ఒక సుదీర్ఘ సందేశాన్ని పంచుకున్నారు. "సోషల్ మీడియా నుంచి చిన్న అడుగు వెనక్కి వేస్తున్నాను. కొన్నిసార్లు మనం శరీరానికి ఇచ్చే విశ్రాంతి మనసుకు కూడా అవసరం. నేను కాస్త నెమ్మదించి, డిస్‌కనెక్ట్ అవ్వాలని, స్క్రీన్‌కు అవతల ఉన్న జీవితంతో, నాతో నేను ఎక్కువ సమయం గడపాలని భావిస్తున్నాను" అని ఆమె తన పోస్ట్‌లో రాశారు.

"నాకు మద్దతుగా నిలిచిన, ప్రోత్సహించిన, దయ చూపిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. మీ ప్రేమ, సందేశాలు నాకు ఎంతో విలువైనవి. నేను కొంతకాలం సోషల్ మీడియాకు దూరంగా ఉంటాను, కానీ ఏవైనా ముఖ్యమైన అప్‌డేట్స్ ఉంటే నా టీమ్ ఈ ఖాతా ద్వారా పంచుకుంటుంది. అందరూ శాంతి, సంతోషం, దయతో ఉండాలని కోరుకుంటున్నాను. త్వరలో కలుద్దాం" అని ఆమె వివరించారు.కేవలం గత నెలలోనే కయాదు తన తమ్ముడు ఉదయ్ పుట్టినరోజు సందర్భంగా ఒక అందమైన పోస్ట్ చేశారు. "నువ్వు ఎంత పెరిగినా, నా దృష్టిలో ఎప్పటికీ చిన్నపిల్లవాడివే. జీవితంలో ఏదైనా కాకముందు, నేను మొదట అక్కనయ్యాను" అని ఆమె పేర్కొన్నారు. "నిన్ను తప్ప నా తమ్ముడిని ఎవరూ ఇబ్బంది పెట్టడానికి వీల్లేదు" అని సరదాగా రాసుకొచ్చారు.

Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com